


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

: fb.com/vaartha Digital

Published from Tirupathi Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, , Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 133 పేజీలు: 10+4 వెల: 6.50


## నేటి నుంచి ప్రధాని విదేశ పర్యటన

5లో

## కేన్సర్ మందులు, వ్యాక్సిన్లపై ధరలు 50 శాతం పెంపు



శుక్రవారం విశాఖలో 'డిజి100ఎక్స్ ఆంధ్రప్రదేశ్' ముగింపు సదస్సులో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

# వికసిత్ భారత్‌కు నైపుణ్యమే పునాది

### యువతకు అవకాశాల కోసం

### 22 పారిశ్రామిక క్లస్టర్లు: మంత్రి లోకేష్

**విశాఖపట్నం, జూన్ 12, ప్రభాతవార్త:** వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, నైపుణ్యం కలిగిన మానవ వనరుల ద్వారానే దేశం, రాష్ట్రం పోటీ సామర్థ్యాన్ని పెంచుకోగలవని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖపట్నంలోని రాడిసన్ బ్లూ రిసార్ట్లో నిర్వహించిన 'డీజీ 100ఎక్స్ ఆంధ్రప్రదేశ్' సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ప్రపంచం వేగంగా మారుతోందని, కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిశ్రమల స్వరూపాన్ని మార్చేస్తోందని మంత్రి తెలిపారు. భూమి, సహజ వనరులు లేదా మూలధనం >>2

# 2047కు స్వర్ణాంధ్ర సాధన

### ఎమ్మెల్యేలు ప్రజా సేవకులే.. పెత్తందారులు కాదు

### ఎవరు తప్పు చేసినా వదలను..

### ప్రధాని మోడీ, పవన్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం

### రెండేళ్ల విజయోత్సవ సభలో సిఎం చంద్రబాబు



విజయోత్సవ సభకు పెద్దఎత్తున హాజరైన ప్రజలు



శుక్రవారం తిరుపతిలో జరిగిన రెండేళ్ల విజయోత్సవ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం చంద్రబాబు, కూటమి నేతలు

**తిరుపతి,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా ప్రతినిధులు పెత్తందార్లుగా కాకుండా ప్రజా సేవకులుగా మెలగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సరిగ్గా రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని, ప్రధాని మోదీ, జనసేనాని పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్రాన్ని గెలిపిద్దాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుదామని ఇచ్చిన పిలుపునకు రాష్ట్ర ప్రజలు మద్దతు పలికారన్నారు. 57శాతం ఓట్ షేర్‌తో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని సిఎం అన్నారు. 164 సీట్లతో ఎన్‌డిఎకు అధికారాన్ని అందించారని, 2024 ఫలితాలను గెలుపుగా కాదు రాష్ట్రపుఃనర్నిర్మాణానికి అప్పజెప్పిన బాధ్యతగా భావించి సేవ చేస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం తిరుపతి రూరల్ చంద్రగిరి నియోజకవర్గం దామినేడులో రెండేళ్ల పాలనపై జరిగిన విజయోత్సవ సభకు సీఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, అనిత, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, పార్థసారధి ఇతర మంత్రులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారని, అన్నీ >>2

# ఎపి పోలీసుకు జాతీయ గుర్తింపు

**విజయవాడ,జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పోలీసులకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశవ్యాప్తంగా కనబరిచిన అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా కేంద్రవిదేశాంగ మంత్రిత్వశాఖ ఏపీ పోలీస్ విభాగానికి ప్రతిష్టాత్మక 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్' పురస్కారాన్ని ప్రకటించింది. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పాస్‌పోర్టు సేవలు అందించడంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన, పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసినందుకు ఏపీ పోలీసులకు జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. ఈనెల 19న ఢిల్లీలో వైభవంగా జరగనున్న 'పాస్‌పోర్ట్ సేవాదివస్-2026'సందర్భంగా కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చేతుల మీదుగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా పురస్కారాన్ని అందుకోనున్నారు. పాస్‌పోర్ట్ సేవా దివస్, పాస్‌పోర్ట్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలకు ఏపీ పోలీస్ శాఖను ప్రత్యేకంగా ఆహ్వా నించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కార్యక్రమానికి హాజరుకావాలని విదేశాంగ >>2

# రాష్ట్రమంతా తెరచుకొన్న బడులు



### అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసిన విద్యాశాఖ

**విజయవాడ,జూన్ 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పాఠశాలల అనంతరం శుక్రవారం తెరుచుకున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభ సందర్భంగా విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.ఏపీ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ సైతం విద్యార్థులకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.బడి తెరచిన వెంటనే రెండవ శనివారం,ఆదివారం శెలవులు కావడంతో తొలి రోజు ఆయా పాఠశాలల్లో హాజరు శాతం తక్కువగా ఉంది.ఇక ఏపీ విద్యాశాఖ ఇప్పటికే అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసింది. ఈ అకడమిక్ క్యాలెండర్‌లో ఈ విద్యా సంవత్సరంలో ఎన్నిరోజులు పాఠశాలలు పనిచేస్తాయి, ఎన్ని రోజులు సెలవులు ఉంటాయి, ఏ పండుగకు ఎన్ని రోజులు హాలీడేస్ వస్తాయనే వివరాలను పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 229 రోజులు పాఠశాలలు పని చేయనున్నాయి.అలాగే 87 రోజులు సెలవులు >>2

## గ్రామ సమస్యలను అక్కడే పరిష్కరించాలి: డి.సిఎం పవన్

2లో

## లక్ష కోట్లతో మిషన్ రాయలసీమ : మంత్రి లోకేష్

### రాష్ట్రానికి సంపద సృష్టిలో కలిసి పనిచేస్తున్నాం: బిజెపి చీఫ్ మాధవ్




# 2047కు స్వర్ణాంధ్ర సాధన

>> తాకట్టుపెట్టి అప్పులపాల్జేశారని అన్నారు. అలాంటి సమయంలో రాష్ట్రప్రజలు మంచి కోసం ఎన్‌డిఎ కూటమి పార్టీల అవసరాన్ని గుర్తించి ఓటేశారన్నారు. రెండేళ్ళలో పజల నమ్మకాన్ని పొందామని,ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామన్నారు. గడచిన రెండేళ్ళలో ఎంతో చేశామని, మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తోందని, కేంద్ర సాయాన్ని, ప్రధాని మోదీ చేయూతను మరువలేమాన్నారు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గెలుపుగా గాకుండా బాధ్యతగా భావిస్తూ పాలన మొదలు పెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెండేళ్ల పాలనపై ప్రజల్లో నమ్మకం కలిగింది. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన కొనసాగిస్తామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో జరుగుతున్న కుట్రలపైనా అప్రమత్తంగా ఉండాలని సీఎం హెచ్చరించారు. రాష్ట్రంలో అధికారం చేపట్టే సమయానికి అన్ని రంగాల్లో సంక్షోభంవ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని, 2019లో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం 10 లక్షల కోట్ల అప్పుతో ముగిసిందన్నారు. కేంద్ర పథకాలను, సాగునీటి పథకాలను నిర్వీర్యం చేశారని, పెట్టుబడి దారులను, పారిశ్రామికవేత్తలను వెంటాడి వేటాడి తరిమేశారన్నారు. యువత భవిష్యత్తును దెబ్బ తీశారని,ప్రశ్నించిన ప్రజలను వేధించారని గుర్తుచేశారు. తనపై ఎఫ్ఐఆర్ కూడా లేకుండా తనను అక్రమంగా జైల్లో పెట్టారని, పవన్ కల్యాణ్ ను ఇబ్బందులు పెట్టారన్నారు. రాష్ట్ర దుస్థితిని చూసి భయపడకుండా ఏడు శ్వేత పత్రాలు విడుదల చేసి ప్రజలకు వాస్తవ విషయాలు తెలియచేశామన్నారు. ప్రజలు చూపిన విజ్ఞతతో డబుల్ ఇంజన్ సర్కార్ గెలిచిందన్నారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు విజ్ఞత చూపారని,ఓట్లేసిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. ఎన్డీఏ ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

2019-24 మధ్య కాలంలో ఐదేళ్ల పాటు ఏపీ అవకాశాల్ని పోగొట్టుకుందని, విధ్వంసాన్ని సరి చేసేందుకు ఒక్కో అడుగూ కలిసి ముందుకు వేస్తున్నామన్నారు.ప్రజల సేవకు పునరంకితం కావడానికే ఈ విజయోత్సవ సభను నిర్వహించుకుంటున్నామని బాబు తెలిపారు. విమర్శలకు ఆధారాలతో సహా సమాధానం చెప్పే గుండె ధైర్యం ఎన్డీఏ ప్రభుత్వానికి ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలన ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చినట్టే పాలన అందిస్తున్నామన్నారు.సూపర్ సిక్స్ తో పాటు మేనిఫెస్టోలో హామీల అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని సాధించామని, ఎన్టీఆర్ భరోసా ద్వారా 65 వేల కోట్ల రూపాయలు పెన్షన్లు, తల్లికి వందనం ద్వారా చిన్నారులకు చదువు చెప్పిస్తున్నామన్నారు. స్త్రీశక్తి ద్వారా ఇప్పటి వరకు 71 కోట్ల ఉచిత ప్రయాణాలు కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రంతో కలిసి 20 వేలు రూపాయలు ప్రతీ రైతుకూ అందించామని, 24 గంటల్లోనే ధాన్యం కొనుగోళ్ల డబ్బులు చెల్లిస్తున్నామని బాబు వెల్లడించారు. గీత కార్మికులు, వడ్డెర్లు, అర్చకులు, ఇమామ్ లు, మోజన్లు ఇలా అందరినీ గుర్తుపెట్టుకుని మరీ సంక్షేమం అందిస్తున్నామని, ఎస్సీ,ఎస్టీ, బీసీల సహా అందరికీ సబ్సీడీపై సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. పీ4 ద్వారా సమాజంలో జీవన ప్రమాణాలు పెంపొందింపజేస్తున్నామని, విద్య వైద్యానికి ప్రాధాన్యం ఇస్తూ సంజీవని ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది టీచర్ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్లను కూడా నియమించడం జరిగిందన్నారు. ఉద్యోగులకు 23 నెలల్లో 21 వేల కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించామన్నారు. అప్పులు చేసే వ్యక్తికి, ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టిన వ్యక్తికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని పరోక్షంగా విమర్శించారు. యావత్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన వ్యక్తికి రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత ఉందా..? మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలు ఆట ఆడిన వ్యక్తులకు ప్రజల గురించి మాట్లాడే అర్హత లేదని బాబు పేర్కొన్నారు.

వందరోజుల్లోనే హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్ల తెచ్చానని, కల్యాణి డ్యామ్ కూడా పూర్తి చేసి శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వద్దకు నీళ్ల తీసుకువస్తామని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు తిరుమల ప్రసాదాన్ని కల్తీ చేసి అపవిత్రం చేశారని, కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి పట్ల అపచారం చేసి మన అందరి మనోభావాలను దెబ్బతీసేలా గొడ్డలి పార్టీ ప్రవర్తించిందన్నారు. తిరుమల జోలికి బ్రిటీషర్లు కూడా వెళ్లలేదు. కానీ గొడ్డలి పార్టీ ఆ దుర్మార్గం చేసిందన్నారు. ప్రజలకు న్యాయం చేయాలన్నదే జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. అడ్డగోలుగా జిల్లాలను విభజించారని, దానిని సరిచేసి మార్కాపురం, మదనపల్లె, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేశామన్నారు. దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామంలో భూ వివాదాలకు చెక్ పెట్టామన్నారు. తొలిసారి ట్రూ డౌన్ చేసి విద్యుత్ ఛార్జీలు తగ్గించామని, 4,668 కోట్ల భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించిందని బాబు గుర్తుచేశారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా వివిధ అంశాల్లో కేంద్రం అండగా నిలిచిందని బాబు మరోసారి గుర్తుచేశారు. 25 కోట్ల మంది పేదలు పేదరికం నుంచి విముక్తి కల్పించిన నేత ప్రధాని మోదీ అని, 1.46 లక్షల కిలోమీటర్ల జాతీయ రహదారులు, 160 ఎయిర్ పోర్టులు నిర్మించారన్నారు. అంతకుముందు రెండేళ్ల పాలన విజయోత్సవ సభ సందర్భంగా వివిధ పథకాల లబ్దిదారులు తాము పొందిన లబ్దిని సభా వేదిక మీద నుంచి వివరించారు.ఈ సభకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్రమంత్రులు నారా లోకేష్,అనగాని సత్యప్రసాద్, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు, టిడిపి, జనసేన, బీజేపీ కార్యకర్తలు హాజరయ్యారు.



శుక్రవారం టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతనంగా ఎన్నికైన ఎంపీలు

## మంత్రి లోకేష్‌ను కలిసిన కొత్త ఎంపీలు

**విజయవాడ,జూన్ 12, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం అభ్యున్నతి దిశగా అడుగులు వేసేందుకు అవసరమైన రీతిలో పార్లమెంటులో స్పందించాలని నూతన ఎంపీలకు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ సూచించారు. అమరావతితో సహా రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పూర్తికి అవసరమైన నిధుల విడుదలకు కేంద్రాన్ని అన్ని విధాలుగా ఒప్పించాలని కోరారు.నూతనంగా రాజ్యసభకు ఎన్నికైన నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణ రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించినందుకు నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలు చింతకాయల విజయ్, సాన సతీశ్, భాష్యం రామకృష్ణలను ఆయన అభినందించారు. పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున బలమైన గొంతుకగా నిలవాలని వారికి దిశానిర్దేశం చేశారు.ఈ భేటీకి సంబంధించిన వివరాలను లోకేశ్ తనఎక్స్ ట్విట్టర్ వేదికగాను పంచుకున్నారు. 'కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులను కలవడం సంతోషంగా ఉంది. వారికి నా అభినందనలు తెలిపాను. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో గట్టిగా గళం వినిపించాలని కోరాను' అని ఆయన పేర్కొన్నారు.

## లోకేష్‌ను కలిసిన చింతకాయల విజయ్

### రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తానని వెల్లడి

**విశాఖపట్నం, జూన్ 12, ప్రభాతవార్త:** ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన చింతకాయల విజయ్ రాష్ట్ర ఐటీ,ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు రాజ్యసభ సభ్యత్వం కల్పించి నమ్మకం ఉంచిన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్ర ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలను పార్లమెంట్ వేదికగా సమర్థవంతంగా ప్రస్తావిస్తూ, తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని చింతకాయల విజయ్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కేంద్రం- రాష్ట్రం మధ్య సమన్వయానికి తోడ్పడుతూ, రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని సాధించేందుకు కృషి చేయాలని, ప్రజల ఆకాంక్షలను రాజ్యసభలో బలంగా వినిపించాలని విజయ్‌కు సూచించినట్లు తెలిసింది.



శుక్రవారం తిరుపతిలో రెండేళ్ల విజయోత్స సభను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డి.సిఎం పవన్

## గ్రామ సమస్యలను అక్కడే పరిష్కరించాలి

### డి.సిఎం పవన్

**తిరుపతి కలెక్టరేట్, జూన్ 12 ప్రభాతవార్త :** దేశానికి రాష్ట్రపతి అయితే గ్రామానికి సర్పంచి కీలకమని, సర్పంచ్ హక్కులను కాలరాస్తే గ్రామం, నియోజకవర్గం, మండలం, జిల్లా, రాష్ట్రం దేశ అభివృద్ధి పూర్తిగా కుంటుపడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సున్నిత వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల పాలనను పురస్కరించుకొని తిరుపతి దామినేడు ప్రాంతంలో విజయోత్సవ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన రెండేళ్ల పాలనలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. అయితే గ్రామ సమస్యలను సర్పంచ్ స్థాయిలోనే పరిష్కరించుకోవాలని, గ్రామ సమస్యలు గ్రామంలోని పరిష్కారం కాక ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చుట్టూ ప్రజలు తిరగాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థాయిని చెక్ పెట్టి గ్రామ సమస్యలను గ్రామంలోనే పరిష్కరించుకునే విధంగా తొలి అడుగులు వేయనున్నట్లు తెలియజేశారు. ఈనెల తొమ్మిదవ తేదీ జరగాల్సిన ఈ విజయోత్సవ సభను వైజాగ్ స్టీల్ ప్లాంట్ లో జరిగిన దుర్ఘటన సంఘటన చూసి సీఎం నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి శుక్రవారం నాటికి వాయిదా వేసుకోవడం జరిగిందన్నారు. 2024లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలే చరిత్రను తిరగరాస్తారన్న విషయాన్ని తెలుసుకోవడం జరిగిందని తెలియజేశారు. ప్రజల తీర్పుకు తిరుగు ఉండదని, ప్రజల అనుకుంటే గద్దె ఎక్కిస్తారని, లేకుంటే దించే శక్తి వాళ్ళకి ఉందని స్పష్టం చేశారు. జనసేనకు ప్రజలు 21 సీట్లు ఇచ్చిన ఎక్కడ మేము రాజీ పడలేదని పంచాయతీ అభివృద్ధిలో ఏపీని నెంబర్ వన్ స్థాయిలోకి తీసుకొని వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాన్ని తీసుకుని వచ్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే క్రింద సర్పంచులు , ఎంపీటీసీలు తదితర విభాగాల్లో 600 మంది ప్రజాప్రతినిధులు ఉంటారని వారి వారి స్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కారం అయితే దేశాభివృద్ధి రాకెట్ వేగంతో దూసుకుని వెళ్తుందన్నారు. ఇది ప్రజాస్వామ్య సూత్ర మని ఈ విషయాన్ని నేను ఈ రెండేళ్ల కాలంలో తెలుసుకున్నానని పేర్కొన్నారు. గ్రామ వ్యవస్థలు బలంగా ఉంటేనే జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలోకి వెళ్తుందన్నారు.

## రాష్ట్రానికి సంపద సృష్టిలో కలిసి పనిచేస్తున్నాం: బిజెపి చీఫ్ మాధవ్

**తిరుపతి,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి సంపద సృష్టిలో, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తెలిపారు. సూపర్ సిక్స్, ప్రతి ఇంటికి నీటి కొళాయి, ఎల్ఈడీ లైట్లు , మరుగుదొడ్లు,గ్యాస్, తదితర అంశాలతో ప్రధాని ముఖ్యమంత్రి, మంత్రులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతిగడపకు చేరుకుంటున్నారన్నారు. ఇటీవల విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనలో మరణించిన ఉద్యోగులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఎన్డీఏ కూటమి తరఫున ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నానన్నారు.శుక్రవారం తిరుపతి దామినేడులో జరిగిన రెండేళ్ళ ఎన్‌డిఎ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సభలో మాధవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 12 ఏళ్ళు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రస్తుతం రెండేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రపంచం ఆశ్చర్యపోయేలా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఇందులో భాగంగా సుమారు 14 లక్షల కోట్ల రూపాయలుపెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. ప్రపంచంలో ఏ మల్టీ నేషనల్ కంపెనీ కూడా తన స్వదేశంలో తప్ప మిగిలిన ఏ దేశాల్లోనూ పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టలేదని ఇందుకు భిన్నంగా విశాఖపట్నంలో గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. ప్రపంచంలో స్టీల్ ప్లాంట్లలో మొదటి రెండు స్థానాల్లో గల ఆర్సినల్, నిబ్బాన్ స్టీల్ జాయింట్ వెంచర్ తో సుమారు లక్ష కోట్లు పెట్టుబడితో 10 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థం గల స్టీల్ ప్లాంట్ త్వరలో రానున్నదని తెలిపారు. ప్రపంచానికే ఆదర్శంగా ఉంటూ సుమారు 2 లక్షల కోట్ల రూపాయలతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో రెన్యువల్ ఎనర్జీ క్యాపిటల్ గా నిలవనున్నదన్నారు. దీని ద్వారా క్రూడ్ ఆయిల్ పై ఆధారపడి పరిస్థితి మారుతుంది అన్నారు.

## వికసిత్ భారత్‌కు నైపుణ్యమే పునాది

>> కంటే ప్రతిభే భవిష్యత్ పోటీ సామర్థ్యానికి అసలైన బలమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నో దశాబ్దాలుగా ప్రపంచానికి అత్యుత్తమ ప్రతిభను అందిస్తోందని, రాష్ట్ర ప్రజలే తమ గొప్ప సంపద అని ఆయన అన్నారు.విద్య అంటే కేవలం డిగ్రీలు అందించడం కాదని, జీవితాంతం నేర్చుకునే ప్రక్రియకు పునాది వేయడమే లక్ష్యమని లోకేష్ చెప్పారు. ఈ నేపథ్యంలో మరో రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి పోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఏఐ, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏరోస్పేస్ వంటి భవిష్యత్ రంగాలకు అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు ప్రతిభ, పరిశోధన, ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాయని పేర్కొన్న మంత్రి, ఏఐ వల్ల ఉద్యోగాలు తగ్గవని, కొత్త అవకాశాలు మరింతగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఏఐ ఆధారిత విద్య, పరిశోధన, పాలన, ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని చెబుతూ, "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, బ్రాండ్ సీబీఎన్, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్" ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతలని వ్యాఖ్యానించారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని, గాజు, డ్రోన్లు, ఉక్కు, ఆటోమొబైల్, ఫార్మా, డేటా సెంటర్లు వంటి అనేక రంగాల్లో భారీ పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు.యువతకు విస్తృత అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఫిషరీస్, ఆక్వాకల్చర్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, ఫార్మాస్యూటికల్స్ తదితర రంగాల్లో ఈ క్లస్టర్లు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. విద్యార్థులు అపజయాలకు కుంగిపోవద్దని సూచించిన మంత్రి, తాను తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు ఓడిపోయానని, అయితే దానిని పాఠంగా తీసుకుని కృషి చేసి విజయాన్ని సాధించానని గుర్తు చేశారు. యువత తమ లక్ష్యాల సాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీజీ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో హేమంత్ సహల్, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సంగీత రెడ్డితో పాటు విద్యారంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎపి పోలీసుకు జాతీయ గుర్తింపు

>> మంత్రిత్వ శాఖ ఆహ్వానం పంపింది. పాస్‌పోర్టు జారీ ప్రక్రియలో అత్యంత కీలకమైన పోలీస్ వెరిఫికేషన్‌ను ఏపీ పోలీసులు సాంకేతికత జోడించి సులభతరం చేశారు. డిజిటల్ విధానాలు, ప్రత్యేక యాప్‌ల ద్వారా దరఖాస్తుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, రికార్డు సమయంలో నివేదికలను వేగంగా పంపించడం వల్ల పాస్ పోర్టు జారీ ప్రక్రియ మరింత సులభతరం అయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, డిజిటల్ విధానాల్లో వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించడం ద్వారా సేవల నాణ్యతను మెరుగుపరిచారు.

## రాష్ట్రమంతా తెరచుకొన్న బడులు

>> ఇస్తారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతీ వారంలోనూ 24 నుంచి 30 పీరియడ్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక సెలవుల సంగతికి వస్తే దసరాకు (విజయదశమి) పది రోజుల పాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించనున్నారు. అక్టోబర్ 12 నుంచి అక్టోబర్ 21వ తేదీ వరకూ దసరా సెలవులు ఉంటాయి. మైనారిటీ విద్యాసంస్థలకు అక్టోబర్ 15 నుంచి సెలవులు ఇస్తారు. ఇక మైనార్టీ విద్యా సంస్థలకు డిసెంబర్ 20 నుంచి డిసెంబర్ 27 వరకూ క్రిస్మస్ సెలవులు ప్రకటించారు.

సాధారణ స్కూళ్లకు డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ హాలీడే ఉంటుంది. సంక్రాంతి పండుగ సెలవుల విషయానికి వస్తే జనవరి 11 నుంచి జనవరి 17వ తేదీ వరకూ స్కూళ్లకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. మైనారిటీ విద్యాసంస్థలకు మాత్రం జనవరి 13 నుంచి హాలీడేస్ ప్రారంభమవుతాయని ఏపీ విద్యాశాఖ ప్రకటించింది.పరీక్షల షెడ్యూల్‌కి సంబంధించి ఆగస్టు నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆగస్టు 3 నుంచి 6 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ 1 , అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ 2 , జనవరి 4 నుంచి 7 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ 3, ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 11 వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ 4 పరీక్షలు నిర్వహిస్తారు.

సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల విషయానికి వస్తే నవంబర్ 9 నుంచి నవంబర్ 20వ తేదీ వరకూ సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1, ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకూ సమ్మేటివ్ అసెస్‌మెంట్ 2 పరీక్షలు ఉంటాయి.

పది విద్యార్థుల కోసం ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందించారు. ఫిబ్రవరి 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయి. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 9వ తేదీ వరకూ పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు, 9వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ 2 పరీక్షలు ఉంటాయి. మార్చి 15 నుంచి మార్చి 31 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించేలా ఏపీ విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ రూపొందించారు.

## వారం - వర్జ్యం

13-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
త్రయోదశి సా. 4.04
కృత్తిక రా. 1.15
వర్జ్యం : మ. 2.40-సా. 4.04
దు.తె. 5.34 - 7.14
శుభసమయం : ఉ. 6.00-7.00
రాహుకాలం - ఉ. 9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. పాతమిత్రులను కలసి ఆనందంగా గడుపుతారు.

**వృషభం:** జీవిత భాగస్వామితో విభేదాలు రాకుండా సామరస్యంగా ఉండేటట్లుగా మెలగడం చెప్పదగినది.

**మిథునం:** ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులు ఉండవు. ఆత్మ విమర్శ చేసుకుంటారు.

**కర్కాటకం:** పెట్టుబడులకు తగిన ఫలితం దక్కుతుంది. కళారంగాలలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. వస్త్రలాభం.

**సింహం:** ఋణాలు తీరి ఊరట చెందుతారు. కొన్ని అవకాశాలు అను కోకుండా లాభిస్తాయి. క్రయ విక్రయాలలో లాభాలు.

**కన్య :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వ్యాపారంలో రొటేషన్ బాగుంటుంది. వాహనసౌఖ్యం.

**తుల :** ఆర్థికంగా లాభం కూర్చే వ్యవహారాలు అనుకూలిస్తాయి. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

**వృశ్చికం:** కాంట్రాక్టులు కొత్తవి వస్తాయి. చేస్తున్న వాటి పురోగతి బాగుంటుంది. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**ధనుస్సు:** కళాసాహిత్య రంగాలలోని వారికి నూతన అవకాశాలు పేరు, ప్రఖ్యాతి కలుగుతాయి. వివాహ యత్నాలు.

**మకరం :** వాక్చతుర్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. ఇంటా బయట మీదే పై చేయిగా నిలుస్తుంది. వస్త్రలాభం.

**కుంభం:** చెప్పుడు మాటలు విని మంచి స్నేహితులను దూరం చేసుకునే అవకాశం వుంది. జాగ్రత్త వహించండి.

**మీనం:** అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి. అయితే మాట తీరు వలన నష్టపోయే అవకాశాలు ఉంటాయి.కొత్త మిత్రులు పరిచయమవుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# లక్ష కోట్లతో మిషన్ రాయలసీమ

### ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని

### అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజా ప్రభుత్వ విధానం: మంత్రి లోకేష్

**తిరుపతి,జూన్ 12ప్రభాతవార్తప్రతినిధి:** లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో"మిషన్ రాయలసీమ' అమలు చేయనున్నట్లు రాష్ట్ర ఐటి ఉన్నతవిద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ ప్రాజెక్టు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు ఒక కుటుంబంలా పనిచేయాలని, చిన్న చిన్న సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. గుజరాత్, ఒడిశా రాష్ట్రాల మాదిరిగా ప్రభుత్వ కొనసాగింపు వల్లే అభివృద్ధి సాధ్యమవుతుందని, పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి లోకేశ్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. పెన్షన్‌ను రెండువేలరూపాయలనుండి ఒకేసారి 4వేల రూపాయలకు పెంచామని, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించామని, 16,347 డీఎస్సీ పోస్టులతో పాటు 6వేల కానిస్టేబుల్ పోస్టులు, జాబ్ క్యాలెండర్ ద్వారా మరో 10,060 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని వివరించారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం,,దీపం2 కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలతో జనరంజక పాలన అందిస్తున్నామన్నారు. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వల్లే ప్రపంచంలో భారత్‌కు గౌరవం పెరిగిందని లోకేశ్ అన్నారు. ఏపీలో ఉన్నది సాధారణ డబుల్ ఇంజన్ సర్కార్ కాదని, ఇది డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ అని అభివర్ణించారు.కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రశాంతత నెలకొందని, గతంలో ఉన్నట్లుగా దాడులు, హత్యలు, రాజకీయ వేధింపులు, అసభ్య రాజకీయ సంస్కృతి ప్రస్తుతం కనిపించడం లేదన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా చంద్రగిరి గడ్డపై తాను చేసిన హెచ్చరికను గుర్తుచేస్తూ, తిరుమల వేంకటేశ్వర స్వామి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని అప్పటి ప్రభుత్వాన్ని హెచ్చరించానని, దేవుడితో పెట్టుకున్నవారి పరిస్థితి ఏమైందో ప్రజలు ఆలోచించాలని అన్నారు.

ఎన్టీరామారావు రాయలసీమ అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని, తెలుగు గంగ, గాలేరునగరి వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేయడంతో పాటు మహిళల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం, నిత్య అన్నదానం వంటి కార్యక్రమాలు ప్రారంభించారని కొనియాడారు. ప్రస్తుత రాజకీయాల్లో చంద్రబాబు నాయుడుని విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్, బౌలర్లు మారినా బ్యాట్స్‌మన్ ఒకరే అన్నట్లుగా అభివృద్ధి రాజకీయాల్లో చంద్రబాబుకి ప్రత్యామ్నాయం లేదన్నారు. బిందు సేద్యం, హంద్రీనీవా, సుజల స్రవంతి వంటి కార్యక్రమాల ద్వారా రాయలసీమను అభివృద్ధి పథంలో నడిపించారని, ఇప్పుడు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో "మిషన్ రాయలసీమ" ప్రారంభించబోతున్నారని తెలిపారు. 2019-2024 మధ్య రాష్ట్రంలో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, అమర్‌నాథ్ గౌడ్, డాక్టర్ సుధాకర్, సుబ్రహ్మణ్యం, మిస్బా కుటుంబం వంటి సంఘటనలను ఉదాహరణగా పేర్కొంటూ, గత ప్రభుత్వ పాలనలో జరిగిన అన్యాయాలను ప్రజలు మరవలేదన్నారు. "వై నాట్ 175" అన్నవారికి ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేస్తూ తీర్పు ఇచ్చారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కొందరు రప్పారప్పా అంటూ హెచ్చరికలు చేస్తున్నారని, చట్టవ్యతిరేక చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. రెడ్‌బుక్ తన పనితానుచేసుకెళుతుందని ఈ సందర్భంగా వక్కాణించారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల్లో వెనుకడుగు వేయలేదన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి భారీ పెట్టుబడులను ఉత్తరాంధ్రకు, క్వాంటం వ్యాలీని కోస్తాంధ్రకు, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఫైటర్ జెట్ తయారీ పరిశ్రమలను రాయలసీమకు తీసుకువచ్చిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానిదేనని చెప్పారు విశాఖ ఉక్కు పరిరక్షణలో ఎన్డీఏ ప్రభుత్వాల పాత్రను గుర్తుచేస్తూ, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి విశాఖ ఉక్కును కాపాడారని తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు శాశ్వత అండగా నిలుస్తామని హామీ ఇచ్చామన్నారు. శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు రూ. 2 కోట్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు ఒకకోటి చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశం ప్రతిష్ట పెరగడానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో "డబుల్ ఇంజన్ ప్రభుత్వం" ఉంటే, రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, క్యారియర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు రావడం ఎన్డీఏ ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కొనసాగింపు అవసరమని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష నేత జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**జగన్‌కు సీసీడీ జబ్బుందని, జీ అంటే గొడ్డలి**

ప్రతిపక్ష నేత జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) అనే జబ్బు ఉందని లోకేశ్ ఎద్దేవా చేశారు. తాము కష్టపడి గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ వంటి కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తే, వాటిని తానే తెచ్చానని ప్రెస్‌మీట్ పెట్టి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. "ఇంకొంత కాలం సమయం ఇస్తే, ఆగస్టు 15న ప్రెస్‌మీట్ పెట్టి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది మా తాతేనని ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అని లోకేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమది గూగుల్ అయితే వాళ్లది గొడ్డలని, తమది ఫైటర్ జెట్స్ అయితే వాళ్లది ఫ్యాక్షన్ అని, తమది కియా అయితే వాళ్లది కిడ్నాప్ అని పోల్చారు. త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

## ఐరోపాలో ఇరాన్‌తో డీల్‌పై సంతకాలు

### ఓవల్ ఆఫీసులో ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 12:** అమెరికా, ఇరాన్‌ల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెర పడనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు ఒక గొప్ప ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఒప్పందంపై సంతకాలు పూర్తయిన వెంటనే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తామని, ఇది కొద్ది రోజుల్లోనే జరగవచ్చని ఆయన తెలిపారు. ఓవల్ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్‌తో యుద్ధం విషయంలో మేము ఒక గొప్ప పరిష్కారానికి వచ్చాము. బహుశా ఈ వారాంతంలో ఐరోపాలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ఈ శాంతి ఒప్పందంలోని చివరి అంశాలకు ఆమోదం లభించడంతో ఇరాన్‌పై కొత్తగా చేయాలనుకున్న దాడులను రద్దు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## అవాంతరాలులేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రజలకు అవాంతరాలు లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది కృషిచేయాలని సియం ప్రత్యేక ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ పిలుపునిచ్చారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్‌డిఎస్ఎస్ నష్టాల తగ్గింపు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షి స్తున్నట్లు చెప్పారు. ఫీడర్ విభజన, అధికలోడ్ ఉన్న ఫీడర్ల విభజన, పాత, శిధిలావస్థకు చేరిన కండక్టర్‌ల మార్పిడి, విద్యుత్ మౌలిక సదుపాయల బలోపేతం వంటి పనులపై త్ర్యేక దృష్టి సారించి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని డిస్కంలలో నమోద వుతున్న భౌతిక, ఆర్థిక పురోగతి, విద్యుత్ నాణ్యత, సరఫరా విశ్వసనీయత, కార్యనిర్వహణ సామర్ధ్యాల మెరుగుదలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన పేరొ ్కన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిం చేందుకు చేపట్టిన పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలన్నారు. ఆమోదింపబడిన అన్ని పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు.


**FORMAT C-7**

(For Political Party to Publish in website, Newspaper, TV)

**Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also to why other individuals without criminal antecedents could not be selected as candidates.**

(As per the Commission's directions issued in Pursuance of the order Dt.13.02.2020 of the Hon'ble Supreme Court in Contempt Petition (C) No.2192 of 2018 in WP(C) No.536 of 2011)

Name of the Political Party : **JANASENA PARTY**
Name of Election : **To the Council of States (Rajya Sabha) by the Members of the Legislative Assembly**
Name of State / UT : **Andhra Pradesh**
Name of the Candidate : **Lingamaneni Ramesh**

| | | | |
|---|---|---|---|
| Sl.No | | | |
| 1. | Criminal Antecedents | | |
| A. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No 292/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| B. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No 294/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| C. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No 296/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| D. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.311/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | Crl.P.No.15836/2024 is Reserved for Orders before the Hon'ble High Court of Telangana at Hyderabad for Quashing of the Proceedings and there is Stay of all Further Proceedings vide Order Dt.03.01.2025 and extended vide Order Dt.06.05.2026 |
| E. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.313/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| F. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.314/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| G. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.315/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| H. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.345/2021 |
| | c. | Name of the Court | VI Metropolitan Magistrate Court, Hyderabad |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | Crl.P.No.284/2025 is Reserved for Orders before the Hon'ble High Court of Telangana at Hyderabad for Quashing of the Proceedings and there is Stay of all Further Proceedings vide Order Dt.24.01.2025 and extended vide Order Dt.06.05.2026. |
| I. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.819/2022 |
| | c. | Name of the Court | XIIth Additional Chief Metropolitan Magistrate Court, Kukatpally |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| J. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.1160/2022 |
| | c. | Name of the Court | XIIth Additional Chief Metropolitan Magistrate Court, Kukatpally |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| K. | a. | Nature of Offence | One of the Directors of Company that had allegedly issued the Cheque which was dishonoured |
| | b. | Case No. | S.T.C.NI.No.1192/2022 |
| | c. | Name of the Court | XIIth Additional Chief Metropolitan Magistrate Court, Kukatpally |
| | d. | Whether Charges have been framed or not | NO |
| | e. | Date of Conviction, if any | NO |
| | f. | Details of Punishment undergone, if any | NO |
| | g. | Any other information required to be given | NO |
| 2. | The reasons for the Selection of the Candidate, Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate and not mere winnability at the Polls (Not more than 100 Words) | | Sri.Lingamaneni Ramesh has been selected in recognition of his distinguished achievements as an entrepreneur, institution builder and philanthropist, and for his proven contribution to economic development, infrastructure growth and social welfare. He has consistently supported initiatives in education, healthcare and community development, demonstrating a sustained commitment to public service. Associated with Jana Sena Party since its formative years, he has shown unwavering dedication, integrity and loyalty to its ideals. His extensive experience in industry, governance-related matters and public affairs is expected to contribute valuable practical insights and informed perspectives to the deliberations of the Rajya Sabha. |
| 3. | Reasons as to why other individuals without Criminal antecedents could not be selected as Candidates (Not More than 100 Words) | | Upon a comparative assessment of merit, experience, contribution to public life and suitability for parliamentary responsibilities, Sri.Lingamaneni Ramesh was found to be the most appropriate candidate. The pending cases against him primarily arise from complaints under Section 138 of the Negotiable Instruments Act in connection with his position as Director of a company and do not involve allegations of moral turpitude, violence, corruption or offences against society. Moreover, one of the similar cases has already been quashed by the Hon'ble High Court of Telangana at Hyderabad, while in two other matters, proceedings are presently stayed and orders have been reserved. His distinguished professional achievements, philanthropic contributions and long-standing commitment to the Party's ideals outweighed such considerations. |

**RAM TALLURI, GENERAL SECRETARY, JANASENA PARTY.**


# తిరుమల సమాచారం



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న హైకోర్టు సిజె గిల్

## శ్రీవారి దర్శనంతో మనసు ఎంతో అనుభూతి

● హైకోర్టు సిజె జస్టిస్ లీసా గిల్

**తిరుమల, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకోవడంతో మనసు అనుభూతి కలిగిందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ తెలిపారు. సిజెగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆమె కుటుంబంతో కలసి తొలిసారిగా శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఆలయ మహద్వారం వద్ద జస్టిస్ లీసా గిల్‌కు టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ మురళీకృష్ణ స్వాగతం పలికారు. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. అనంతరం ఆనందనిలయుడ్ని దర్శించుకుని కానుకలు సమర్పించారు. ఆమెకు, కుటుంబసభ్యులకు పండితులు వేదాశీర్వచనం అందించగా ఇఒ, అదనపు ఇఒ తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందించారు.

## శ్రీవారి సేవలో ముఖేశ్ అంబానీ



**తిరుమల, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ కుటుంబంతో కలసి శుక్రవారం వేకువజామున తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అంబానీ కుటుంబం తిరుమలేశునికి అత్యంత భక్తివిశ్వాసం కలిగి ఉన్నారు. శుక్రవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో ముఖేష్ అంబానీ, కుమారుడు అనంత్ అంబానీ, కోడలు రాధికతో కలిసి ఆయన శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబానీ కుటుంబం తిరుమల ఆలయం వద్దకు చేరుకోగానే టిటిడి అధికారులు స్వాగతం పలికారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వయంగా ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం చెప్పి, శ్రీవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంబానీ కుటుంబం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ మార్గం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదిస్తూ వేద మంత్రోచ్చారణల మధ్య అంబానీ కుటుంబానికి ప్రత్యేక ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

## రాష్ట్రానికి శుభాలు కలగాలని వేడుకున్నా

● రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



**తిరుమల, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూర్తిచేసుకుందని, అభివృద్ధిలో మరింత ముందుకు వెళుతోందని రాష్ట్రసమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. తిరుపతిలో జరిగే కార్యక్రమానికి హాజరుకావడానికి తిరుమలకు వచ్చిన ఆయన శుక్రవారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శివయ్య సేవలో బీహార్ డి.సిఎం పూజలు



బీహార్ ఉపముఖ్యమంత్రికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందిస్తున్న ఇఓ

**శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని శుక్రవారం బీహార్ ఉపమ్యుమంత్రి విజయ్‌కుమార్ చౌదరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు, ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## అనంత్ అంబానీ రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలను ప్రపంచాన్ని శాసిస్తున్న రిలయన్స్ సంస్థకు చెందిన అనంత్ అంబాని కుటుంబసభ్యులతో కలసి జరిపించుకున్నారు. వారికి ఆలయంలోని స్వామి గర్భగుడి సమీపంలోని సహస్ర లింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. అనంత్ అంబాని కుటుంబసభ్యులతో రాగా వారికి స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి స్వాగతం పలికారు. దక్షిణ గోపురం వద్ద వారికి ఆలయ మర్యాదలతో ఆలయ ఇఓ బికె వెంకటేశులు, ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. వారికి ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్టు కొనుగోలు చేసి ప్రత్యేక వేదపండితులతో పూజలు జరిపించారు.

# రాబోయే మూడేళ్లలో విద్యుత్తు ఛార్జీలు పెంచం

● విధ్వంసమైన విద్యుత్ వ్యవస్థను రెండేళ్లలో గాడిన పెట్టాం ● మంత్రి గొట్టిపాటి



**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్తు చార్జీలను ఎట్టి పరిస్దితుల్లోను పెంచేది లేదని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్ రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా పునరుద్ధ రించిందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని కేవలం రెండేళ్లలోనే సరిదిద్ది, పట్టాలెక్కించామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచ లేదన్నారు. రాబోయే మూడేళ్ల లో కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వినియోగ దారులపై అదనపు భారం మోపిన ట్రూ అప్ విధానానికి స్వస్తి పలికి, చరిత్రలోనే మొదటిసారిగా ట్రూ డౌన్ విధానాన్ని తీసు కువచ్చామని తెలి పారు. దీని ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించి, ప్రజలకు రూ.4,498 కోట్ల మేర ఉప శమనం కలిగించామని వెల్లడించారు. గత వైసిపి ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని మంత్రి ధ్వజమెత్తారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 6 లక్షల ఉచిత సోలార్ కనెక్షన్లను అందించడానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. విద్యుత్ ఉత్పాదనను గణనీయంగా పెంచడం ద్వారా, బయటి రాష్ట్రాల నుండి కొనుగోలు చేసే ఖరీదైన విద్యుత్ భారాన్ని తగ్గించామన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఆర్‌డిఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నా మని, విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు కొత్త సబ్‌స్టేష న్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. దీనితో విద్యుత్ అంతరాయాలు, లోఓల్టేజ్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# స్మార్ట్‌సిటీలో కుళ్లిన మాంసం

● ఆహార పదార్థాలపై ఆకస్మిక తనిఖీల్లో విస్తుబోయే నిజాలు వెలుగులోకి



**తిరుపతి, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం, స్మార్ట్‌సిటీలో కుళ్ళిన మాంసం... వారం పది రోజుల క్రిందట సేకరించిన పొట్టేలు, మేక మాంసంతో బాటు వాటి తలలు, కాళ్ళు కుళ్ళిపోయి విక్రయించే వాటిపై శుక్రవారం మధ్యాహ్నం మెరుపు దాడులు జరిగాయి. పరిశుభ్రతకు మారుపేరుగా నిలవాల్సిన తిరుపతినగరంలో ఈ దారుణం వెలుగుచూడటంతో మాంస ప్రియులకే గాక యాత్రికులు వాంతులు చేసుకునే పరిస్థితి కనిపించింది.

తిరుపతిలో పి.పి. చావడి మాంసం మార్కెట్ కేంద్రంగా జరుగుతున్న కుళ్లిన మేక, గొర్రె తలలు, కాళ్ల సరఫరా ఉదంతం వెలుగు చూడటంతో ఇంతకాలం నడచిన దందాకు చెక్‌పెట్టారు. చెన్నై, హైదరాబాద్ నుంచి కుళ్లిన తలకాయ మాంసం దిగుమతి చేసుకుని ప్రముఖ మెస్‌లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం బయటకు పొక్కింది. దీంతో ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో మరోసారి నకిలీ, నిల్వ ఉంచిన మాంసం కలకలం రేపింది. నగరంలోని పి.పి. చావడి మటన్ మార్కెట్ వేదికగా పెద్ద ఎత్తున సాగుతున్న కుళ్లిన మాంసం నెట్‌వర్క్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు రట్టు చేశారు. చెన్నై, హైదరాబాద్ మహానగరాల్లో అమ్ముడుపోకుండా మిగిలిపోయిన, పాచిపోయిన మేక, గొర్రె తలలు, కాళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరుపతికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు వెయ్యి కిలోల (ఒక టన్ను) బరువున్న ఈ పాచిపోయిన, కుళ్లబట్టి తీవ్ర దుర్వాసన వస్తున్న మాంసాన్ని నగరంలోని పలు హోటళ్లు, మెస్‌లకు సరఫరా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ముఖ్యంగా నగరంలో నిత్యం వేలాదిమంది భోజనం చేసే పలు మెస్‌లు ప్రముఖ తిండి కేంద్రాలకు ఈ నాసిరకం, ప్రమాదకరమైన తలకాయ మాంసం, పాయా (కాళ్లు) సరఫరా అవుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

**ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు:**

మెట్రో నగరాల్లో విక్రయించకుండా నిల్వ ఉంచిన వ్యర్థాలను, గడువు ముగిసిన మాంసాన్ని రసాయనాలు చల్లి తిరుపతి మార్కెట్‌కు తరలిస్తున్నట్లు అధికారులకు పక్కా సమాచారం అందింది. దీనిపై రంగంలోకి దిగిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఫుడ్ సేఫ్టీ అధికారులు పి.పి. చావడి మార్కెట్‌తో పాటు సదరు హోటళ్ల స్టోరేజ్ రూముల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఫ్రీజర్లలో ఎటువంటి లేబుళ్లు, తయారీ తేదీలు లేకుండా కుళ్లిపోయి, రంగు మారిన స్థితిలో ఉన్న తలలు, కాళ్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు ఈ నమూనాలను సేకరించి తదుపరి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటువంటి కుళ్లిన, బ్యాక్టీరియా (సాల్మొనెల్లా, ఈకోలి) చేరిన మాంసాన్ని తినడం వల్ల తీవ్రమైన ఫుడ్ పాయిజనింగ్, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి జీర్ణకోశ వ్యాధులు వస్తాయని, ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలు, పర్యాటకులు హోటళ్లలో తలకాయ కూర, పాయా సూప్ వంటి వంటకాలకు దూరంగా ఉండాలని, నమ్మకమైన ప్రదేశాల్లో స్వయంగా చూసి కొనుగోలు చేసుకోవడమే సురక్షి తమని అధికారులు సూచిస్తున్నారు.

## బిజెపి ప్రశిక్షణా కార్యక్రమాలకు విశేష స్పందన

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమా లకు పార్టీశ్రేణుల నుండి విశేష స్పందన లభిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తెలిపారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాఅభియాన్-26లో భాగంగా జిల్లాలో జరుగుతున్న ప్రశిక్షణ వర్గాల పురోగతిపై శుక్రవారం విజయవాడ లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, జాతీయత, సుశాసనం, సేవా కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించే వేదికగా ఈ శిక్షణా శిబిరాలు నిలుస్తాయన్నారు. ప్రతిజిల్లాలో నాణ్యతతో కూడిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థాయి వరకు పార్టీ భావజాలాన్ని తీసుకెళ్ల గల నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రశిక్షణ వర్గాల ద్వారా కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సంస్థాగత నైపుణ్యాలు పెంపొందించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిక్షణ పొందిన ప్రతి కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కరంలో ముందుండి పనిచేయాలని మాధవ్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, రాష్ట్రప్రధాన కార్యదర్శులు లక్ష్మీ ప్రసన్న, మట్ట ప్రసాద్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

**తిరుపతి, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతోబాటు రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె కోర్టు న్యాయమూర్తి నరసింహామూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు.

శేషాచలం అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 2018 కేసులో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా నాగపట్ల ఈస్ట్ ఫారెస్ట్ బీట్ అటవీ పరిధిలోని చామల రేంజ్‌లో అరెస్టయ్యారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

Tender Notice No.02/2026-27/CE(GVMC)/SE-GWK/E.E-GWK, Dt:11-06-2026

No. of Works : 1 Nos
Value of Works : Rs.854.62 Lakhs
Down Load Starting Date : 12.06.2026 @ 02.00 P.M.,
Down Load Ending Date : 26.06.2026 @ 03.00 P.M.,
*Note:* Further details @ www.ape.procurement.gov.in
O/o CE (GVMC) or EE-Gwk (Contact No.98489 33235) For Commissioner, (GVMC)

**MUNICIPAL CORPORATION : TIRUPATI**

The Commissioner, Municipal Corporation, Tirupati invites tenders on the e-Procurement platform from the "Eligible Contrators" for various developmental works under **General Funds and 15th FC Grant** vide IFB Nos: 19 to 38/TPT/26-27/15th FC/TO and IFB Nos: 39 to 57/TPT/26-27/GEN/TO, Dated: 09-06-2026.

**Total No. of Works is 39 with a total ECV of Rs.674.10 lakhs.**

For further particulars please contact Municipal Engineer/ Technical officer during office working hours (or) visit e-Procurement platform: https//tender.apeprocurement.gov.in.

**Commissioner**
**Municipal Corporation, Tirupati**

వార్త, శనివారం13, జూన్ 2026


శత్రువుని జయించినవాడు విజేత కాదు,
శత్రుత్వాన్ని జయించినవాడే నిజమైన విజేత.

న- స్వామి వివేకానంద

# విస్తరిస్తున్న విద్యావ్యాపారం

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి, పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపార రూపం దాల్చింది. విద్యనే కాదు విద్యార్థులతోసహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాటకొస్తే దేశవ్యాప్తంగా రోజురోజుకు విస్తరించిపోతున్నది. ప్రైవేట్ రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈ వ్యాపారంలో గతంలో కాంట్రాక్టర్లు, వ్యాపారాలు చేసేవారితోపాటు అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ నాయకులు భాగస్వాములు అవుతున్నారు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా అమలు చేయగలిగిన సామర్థ్యం గల అధికారులున్నా రానురాను ప్రభుత్వ విద్య పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో నడిచేవి. వాటిలో వ్యాపార ధోరణులు కన్పించేవి కావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవాదృక్పథంతో అవి సేవలు అందించేవి. నిర్వాహకులుసామాజిక బాధ్యతగా భావించి ఆ బడులు నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రైవేట్ పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండాపోయింది.అందుకే చట్టాల అవసరం తలెత్తలేదు.ప్రభుత్వ రంగంలోని పాఠశాలల్లో కూడా విద్యాబోధన అంతో ఇంతో పటిష్టంగా నడిచేది. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదా, బిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆ వైపే మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతిలేని వారు మరో దారి లేనివారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాట పడుతున్నారు. ప్రైవేట్ విద్యావ్యాపారం గ్రామాలకు విస్తరించింది. ఇక రానురాను ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా కన్పిస్తున్నది. ఇటీవలకాలంలో యేడాదియేడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నారు. ఈ యేడాది కూడా రాబోయేవిద్యాసంవత్సరంలో దాదాపు లక్షమందికి పైగా విద్యార్థులు తగ్గిపోయే ప్రమాదం ఉందని సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ తగ్గడం ఇప్పటికిప్పుడు మొదలు కాలేదు. గత ఐదారేళ్లుగా పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. 2021-22 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ముప్ఫైలక్షల డెబ్భైఎనిమిది వేల మందికిపైగా ఉంటే ప్రైవేట్ బడుల్లో ఇరవైఎనిమిది లక్షల అరవైఏడువేల మంది వరకు ఉన్నారు. అయితే 2022-23 విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్లో విద్యార్థుల సంఖ్య తగ్గి, ప్రైవేట్ స్కూళ్లల్లో పెరిగిపోయింది. సర్కారు బడుల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో దాదాపు రెండు లక్షల మందికిపైగా అదనంగా అడ్మిషన్ తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూల్‌లో చేరేవారి సంఖ్య మరింతగా పడిపోయింది. సర్కారు బడుల్లో ఇరవైఆరు లక్షల ముప్ఫైఆరువేల ఆరువందల ముప్ఫైకి పరిమితం కాగా,ప్రైవేట్‌బడుల్లో ముప్ఫైనాలుగు లక్షలకుపైగా పెరిగిపోయింది. దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో ఏడు లక్షలకుపైగా ఎక్కువ ప్రవేశాలు లభించాయి. ఈ యేడాది పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. దాదాపు సర్కారు స్కూళ్లలో లక్షా ఇరవై వేల మంది తగ్గిపోతున్నట్లు చెప్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఈ పరిస్థితికి కారకులెవరు? కారణాలు ఏమిటి అనేది అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు కానీ తెలియంది కాదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు,ప్రోత్సాహకాలు కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. బడి బాట, మధ్యాహ్నభోజన పథకం, ఉచిత పుస్తకాలు లాంటిఎన్నో ప్రోత్సాహకాలు ప్రకటించి ప్రయత్నాలు చేస్తున్నాఆశించిన మేరకు ఫలితాలు కన్పించడం లేదు. అన్నిటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. వీటన్నిటి మించి వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడంతో ప్రధానంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా అందరికీ విద్య అందించాలన్న లక్ష్యం కనుచూపుమేరలో కన్పించడం లేదు. ఆరేళ్ల నుంచి పద్నాలుగేళ్ల బాలబాలికలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. కానీ లక్ష్యానికి చేరుకోలేకపోతున్నారు. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ రంగంలోని విద్యావ్యవస్థను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం సమంజసంకాదు. ఇప్పటికైనా విద్యావ్యాపారాన్ని ఆపకపోతే భవిష్యత్తులో ఎలాంటి విపరీత ధోరణులు చోటు చేసుకుంటాయో ఊహిస్తేనే భయాందోళనలు కలుగుతున్నాయి. ప్రభుత్వ రంగంలో విద్యాప్రమాణాలు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి.

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.



అరిస్టాటిల్

విగ్రహాన్ని దేవునిగా తలచి పూజించడం శ్రేష్టం. దేవుణ్ణి విగ్రహంగా భావించడం దోషం.



డబ్ల్యు. ఎమర్సన్

## ప్రజావాక్కు



### గ్రామీణంలో సాంకేతికత

ఆధునిక యుగంలో కృత్రిమ మేధస్సు అత్యంత వేగంగా విస్తరిస్తూ, భవిష్యత్తు ఉపాధిప్రపంచంపై పెను ప్రభావం చూపుతోంది. విద్య, వైద్యం, బ్యాంకింగ్ వంటి రంగాల్లో డేటావిశ్లేషణ,పత్రాల నిర్వహణవంటి పనులను యంత్రాలు వేగంగా చేస్తున్నాయి. దీనివల్ల పునరావృత స్వభావం కలిగిన డేటాఎంట్రీ, కాల్‌సెంటర్ వంటి విభాగాల్లో ఉద్యోగ భద్రతపై ఆందోళనలువ్యక్తమవుతున్నాయి. యంత్రాలు మానవ శ్రమను భర్తీ చేస్తాయనే భయం ఉన్నప్పటికీ, ప్రతి సాంకేతిక విప్లవం లాగే ఇది కూడా కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తోంది.డేటాసైన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ భద్రత వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన వారికి డిమాండ్ పెరుగుతోంది. యంత్రాలు తర్కాన్ని అనుసరించగలవు కానీ, మానవీయ కోణం, సృజనాత్మకత నాయకత్వ లక్షణాలు అవసరమైన పనుల్లో మానవుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు.

- సి. రిత్విక్, నల్గొండజిల్లా

### అతివేగం అనర్థదాయకం

నేడు రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పెరుగుతున్న వాహనాలసంఖ్య, మితిమీరిన వేగం కారణంగా ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలోనిర్లక్ష్యం వహించడంవల్ల కలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. గుంతలమయమైనరోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చు.

- పి. రామకృష్ణ, హైదరాబాద్

### చిరు వ్యాపారులను ఆదుకోవాలి

బ్రతుకుబండి పేరుతో జీవనం సాగించే చిరు వ్యాపారులు ఎందరో ఉన్నారు. కొందరు అధికారులు ఇలాంటి వ్యాపారులను లక్ష్యం చేసుకుని నాణ్యత పేరుతో, ధరల పేరుతోవ్యాపారం సజావుగాసాగకుండా తరచూ ఇబ్బంది పెడుతూబ్రతుకుబండిని సాగనియ్యకుండా చేస్తున్న ఘటన లెన్నో. స్వేచ్ఛగా బ్రతుకుతున్నా వాళ్లను బ్రతకనిద్దాం.

### ఐరిష్ హాజరు విధానాన్ని రద్దు చేయాలి

ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు అమలు చేస్తున్న ఐరిష్ హాజరు విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టాన్ని పునరుద్ధరణ చేయాలని,విబిజి రాంజీ పథకాన్ని రద్దు చేయాలని, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు, శ్రామికులు కోరుతున్నారు. ఉపాధి శ్రామికులలో ఆర్థిక వెనుకబాటు తనం, సామాజికంగా పనులు లేని కూలీలను గుర్తించి ఆ గ్రూపులకు పనులను కేటాయించాలన్నారు. అలాగే పనులలో వివక్షత చూపకుండా అన్ని వర్గాలకు ఒకే పనిని చూపాలి. రాజకీయ మద్దతు ఉన్న గ్రూపులకుఎక్కువ పనిదినాలు కేటాయించకుండా సామాజిక న్యాయం పాటించాలని వారు కోరుతున్నారు. అలాగే ఒక పూట పని విధానం అమలు చేయాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్, మంచినీరు సరఫరా చేయాలని, సమ్మర్ అలవెన్సులు పునరుద్ధరణ చేయాలని, పలుగు, పార పనిముట్లు ఇవ్వాలి.

- జి.సూర్యనారాయణ, భూపాలపల్లి జిల్లా

### మానవాళికి పెనుముప్పు మారిన ప్లాస్టిక్

ఆధునిక ప్రపంచంలో ప్లాస్టిక్ వినియోగం అనివార్యమైనప్పటికీ, అది 'సూక్ష్మ ప్లాస్టిక్'రూపంలో మానవాళికి పెనుముప్పుగా మారింది. ఐదు మిల్లీమీటర్ల కంటే తక్కువ పరిమాణం ఉండే ఈకణాలు గాలి,నీరు, ఆహారంద్వారా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి.ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్‌ఉత్పత్తి అవుతుండగా, అందులో గణనీయమైన భాగం వ్యర్థాలుగా మారిపర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్నాయి. ముఖ్యంగా భారతదేశంలో ప్లాస్టిక్ పునర్వినియోగం కేవలం 13 శాతంగానే ఉండటం ఆందోళనకరం. పెద్దప్లాస్టిక్ వస్తువులు ప్రకృతి ప్రభావంతో విచ్ఛిన్నమవ్వడం, కృత్రిమ వస్త్రాల వాడకం వంటి కారణాల వల్ల ఇవి వాతావరణంలో చేరుతున్నాయి. పరిశోధనల ప్రకారం, ఈ కణాలు మానవరక్తం,ఊపిరితిత్తులు,మెదడులోకూడా కనిపిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### శృతిమించుతున్న హిజ్రాలు

హిజ్రాల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. రోడ్డుపై వీరిని చూడగానే బెంబేలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు డబ్బు కోసం వీరి వేధింపులు ఆగడం లేదు. ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శుభకార్యాల వద్దకువచ్చి అడిగినంత డబ్బు ఇవ్వకపోతే అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అసభ్యకర ప్రవర్తన, భూతులు మాట్లాడుతూ వారిని కించపరుస్తున్నారు.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మోసాల సుడిగుండంలో బ్యాంకులు!

**ఇటీవల కాలంలో కూడా బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలు సాధారణ ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి. ఎన్ని చట్టాలున్నా, నిబంధనలను ఎంత కఠినతరం చేసినా, తనిఖీ వ్యవస్థలు వాటిని అమలు చేసి బ్యాంకుల్లోని ప్రజాసొమ్మును కాపాడేందుకు నెలనెలా వేలు, లక్షలాది రూపాయలు జీతభత్యాల రూపేణా వేతనాలు తీసుకుంటున్నా, అధికారగణం ఉన్నా దోపిడీ మాత్రం ఆగడం లేదు. చట్టాలన్నా, నిబంధనలన్నా జంకుబొంకు లేకుండాపోతున్నాయి. అంతేకాదు అటు దర్యాప్తు అధికారుల పట్ల కూడా పెద్దగా భయభక్తులు కన్పించడం లేదు. కర్ర లేని వారిని గొర్రె కూడా కరుస్తుందంటారు అలా ఉంది మన దర్యాప్తు అధికారుల పరిస్థితి.**

దామెర్ల సాయిబాబ

ఒకసారి మోసపోతే దగా చేసినవారి తప్పు. రెండోసారి దగాపడితే మోసపోయినవారిది కూడా తప్పంటారు పెద్దలు. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వందలసార్లు మోసపోతూనే ఉన్నాం. అధికారంలో ఎవరున్నా, కారణాలు, కారకులు ఎవరైనా, ఈ దోపిడీ యధేచ్ఛగానే జరుగుతున్నది. ఎన్ని వేల కోట్ల రూపాయలు అక్రమార్కుల పాలయ్యాయో లెక్కలకు అందకపోవచ్చు. బ్యాంకుల్లో ఉన్న ప్రజాసొమ్మును భోంచేయడం, అందులో కొందరు విదేశాలకు పారిపోవడం పరిపాటిగా మారిపోతున్నది. వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ కానీ, అంతకు ముందు పారిశ్రామికవేత్త విజయమాల్యా కానీ బ్యాంకులను వేలాది కోట్ల రూపాయల మోసం చేసి ఇప్ప టికి ఒకటిన్నర దశాబ్దం దాటిపోయినా ఇప్పటివరకు వారిపై నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేకపోవడం దురదృష్టకరం. వారే కాదు వారి సన్నిహితులు దేశ సరిహద్దులు దాటిపోయిన తర్వాత కానీ సంబంధిత యంత్రాంగం కళ్లు తెరవలేదు. ఇటీవల కాలంలో కూడా బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలు సాధారణ ప్రజల్లో వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి. ఎన్ని చట్టాలున్నా, నిబంధనలను ఎంత కఠినతరం చేసినా, తనిఖీ వ్యవస్థలువాటిని అమలు చేసి బ్యాంకుల్లోని ప్రజాసొమ్మును కాపాడేందుకు నెలనెలా వేలు, లక్షలాది రూపాయలు జీతభత్యాల రూపేణా వేతనాలు తీసు కుంటున్నా, అధికారగణం ఉన్నా దోపిడీ మాత్రం ఆగడం లేదు. చట్టాలన్నా, నిబంధనలన్నా జంకు బొంకు లేకుండాపోతున్నాయి. అంతేకాదు అటు దర్యాప్తు అధికారుల పట్ల కూడా పెద్దగా భయభక్తులు కన్పించడం లేదు. కర్రలేని వారిని గొర్రె కూడా కరుస్తుందంటారు. అలా ఉంది మన దర్యాప్తు అధికారుల పరిస్థితి. వేల కోట్ల రూపాయలు దగా చేశారని ఆరోపణలు ఎదుర్కొంటూ విదేశాల్లో జల్సాగా జీవనం గడుపుతున్న బడా వ్యాపారి ఒకరు తాను ఏమీ తప్పు చేయలేదని, ఎలాంటి మోసానికి పాల్పడలేదని బహిరంగంగానే గత వారంలో వ్యాఖ్యానించారు. చేసివుంటే ఇప్పటివరకు తనపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారన్నట్లుగా మాట్లాడారు. తాను నిజంగా తప్పు చేసి ఉంటే అంతపెద్ద దేశ యంత్రాంగం నుండి తప్పించుకోవడం సాధ్యం కాదన్నారు. ఆయనే కాదు బ్యాంకులను దగాచేసిన వారెందరో అలానే మాట్లాడుతున్నారు. చట్టంలో కూడా కొన్ని లోపాలున్నాయనే వాదన కూడా నిజమే కావొచ్చు. మన రాజ్యాంగ నిర్మాతలు కుల, మత, వర్గ,లింగ భేదాలు లేకుండా అందరికీ సమానంగా వర్తించే విధంగా శాసనాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. అవి నిష్పక్షపాతంగాఅమలు చేస్తారని ఆశించారు. కానీ అమలు చేయాల్సిన కొందరు అధికారులు రాజకీయ ఒత్తిడిలకు లొంగో, దక్షిణలకు ప్రలోభపడో చట్టాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటారని నాటి రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేకపోయారు. వందలాది కరుడుగట్టిన నేరస్తులు ప్రజలను వంచించి కోట్లాది రూపాయలు దోచుకుంటున్న వైట్‌కాలర్ నేరస్తులు తప్పించుకోగలుగుతున్నారు. ఇక చట్టం అప్పటిపరిస్థితులకు అనుగుణంగా తయారు చేసిన సిఆర్‌పిసి, ఐపిసి నిబంధనలకు కాలానుగుణంగా సవరించాలనే దర్యాప్తు అధికారుల వాదన కూడా సమంజసమే కావొచ్చు. కానీ ఉన్న నిబంధనలను, చట్టాలను ఏమేరకు నిష్పక్షపాతంగా అమలు చేస్తున్నారన్నది పరిశీలించాల్సిన విషయం. ధనిక, పేద అని తేడా లేకుండా ఉన్న చట్టాలను ఎంతవరకు చిత్తశుద్ధితో వ్యవహరించగలుగుతున్నారనేదే ప్రశ్న. నిరుపేదలు పోలీసు స్టేషన్‌కు వస్తే ఎలా వ్యవహరిస్తారు? వారిని ఏదో నేరంలో అదుపులోకి

## ఒక్క మాట

తీసుకున్నప్పుడు ఎలా ప్రవర్తిస్తారు? అలాగే ఘరానా పెద్దల విషయంలో ఎలాంటి ట్రీట్మెంట్ ఇస్తారో ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. అందుకే వైట్‌కాలర్ నేరాలు పెరిగిపోతున్నాయి. కోట్ల కొద్దీ దోచేస్తున్నారు. మద్యం వ్యాపారి విజయ్‌మాల్యా కేసునే తీసుకుందాం. ఆయన మోసం 2011లో ఆరంభమైంది. అయినా 2016 వరకు ఫిర్యాదు చేయడానికి కూడా బ్యాంకులు ముందుకు రాలేదు. ఆయన వెనుక ఉన్న రాజకీయ శక్తి అలాంటిది. భారతీయ బ్యాంకులకు ఆయన తొమ్మిదివేల కోట్లకుపైగా టోకరా వేశారని అభియోగం. 2016లో కొన్ని బ్యాంకులు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించాయి. విదేశాలకు వెళ్లకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరాయి. న్యాయస్థానం స్పందించేలోగా ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. 2017లో లండన్‌లో అరెస్టు అయిన వెంటనే బెయిల్ దొరికింది. భారత్‌కు తీసుకొచ్చేందుకు దర్యాప్తు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఇప్పుడు వడ్డీతో కలిపి దాదాపు ఆ అప్పు ఇరవైవేల కోట్లకుపైగా చేరి ఉండవచ్చు. ఆ సంగతి అటుంచితే కేసు దర్యాప్తునకు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో, ఎంత వ్యయప్రయాసలకు లోనవుతున్నారో లెక్కకు అందదు. ఇక సాఫ్ట్‌వేర్ కంపెనీ సలహాదారుగా పనిచేసిన ఒక ప్రముఖుడు ఆదాయపు పన్ను ఎగవేయడంలో బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్‌లో పెద్దఎత్తున లావాదేవీలు జరిపాడు. భారీ మోసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయుధాల వ్యాపారంలో అత్యంత వివాదాస్పదుడిగా పేరొందిన మరొక ప్రముఖుడి ఇంటిపై జరిపిన దాడుల్లో రక్షణ శాఖ కొనుగోలుకు సంబంధించిన అత్యంత రహస్య కీలక సమాచారం లభించింది. అధికారిక రహస్యాల చట్టాల కింద ఢిల్లీలోని న్యాయస్థానం ఆయనను నేరస్తుడిగా ప్రకటించింది. దర్యాప్తు అధికారులు అప్రమత్తం అయ్యేలోపు ఆయనా విదేశాలకు వెళ్లిపోయాడు. ఇలా ఎన్నో కేసులను ఉదహరించవచ్చు. ఇక బినామీ కంపెనీల పేరుతో ఖాతాలు తెరిచి బ్యాంకులను మోసం చేశాడన్న ఆరోపణలపై ఒక బ్యాంకు డైరెక్టర్‌నే అరెస్టు చేశారు. మరొక బ్యాంకు పూణె జోన్ మాజీ అధిపతి దాదాపు ఎనిమిది కోట్ల రూపాయలకుపైగా దగాకు సహకరించాడన్ని సిబిఐ గతంలో అరెస్టు చేసింది. ఈ బ్యాంకు, ఆ బ్యాంకు అని కాదు. అన్ని బ్యాంకులు మోసాలకు గురైపోతున్నాయి. గుజరాత్‌కు సంబంధించిన ఒక షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ ఇరవైరెండువేల కోట్ల రూపాయలకుపైగా బ్యాంకులకు ఎగనామం పెట్టింది. ఆ సంస్థ చేతిలో మోసపోయింది ఒకటో, రెండో కాదు. ఏకంగా ఇరవై ఎనిమిది బ్యాంకుల కనార్షియంకు కుచ్చుటోపీ పెట్టింది. ఈ దగా ఒకటి, రెండేళ్ల జరగలేదు. ఎన్నో ఏళ్లుగా కొనసాగినా సంస్థలకు బ్యాంకుల నుండి తీసుకున్న డబ్బు మళ్లిస్తున్నా పసిగట్టలేకపోయారంటే ఏమనుకోవాలి. ఇలా చెప్పుకుంటూ పోతే గత రెండు,మూడు దశాబ్దాలుగా బ్యాంకులను మోసం చేసే ఘరానా పెద్దలు పెరిగిపోతున్నారు. ఇందులో కొన్ని సందర్భాల్లో ఆయా బ్యాంకులకు సంబంధించిన కొందరు అధికారులు కూడా వారితో చేతులు కలుపుతున్నారనేది కాదనలేని వాస్తవం. కేవలం రెండేళ్ల వ్యవధిలో ఐదువేల మందికి పైగా బ్యాంకు ఉద్యోగులు రకరకాలు మోసాలు చేసినట్లు రిజర్వుబాంకు గతంలో గుర్తించింది. బ్యాంకుల్లో ఇంటి దొంగలను నియంత్రించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. బ్యాంకులకు వెళ్లి అప్పు కావాలంటే సామాన్యులను సవాలక్ష ప్రశ్నలు అడుగుతారు. నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటారు. ఇచ్చే రుణానికి నాలుగు రెట్లు అదనంగా విలువ ఉన్న ఆస్తులను తనఖా పెట్టుకుంటారు. వాయిదాల ప్రకారం కిస్తీలు కట్టకపోతే ఎన్‌పిఎ అంటూ, ఆస్తుల రికవరీ పత్రికా ప్రకటన ఇచ్చి నానా యాగీ చేస్తారు. ఇటీవల కాలంలో అప్పుల వసూళ్లకు బ్యాంకు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుంటున్నాయి. కొన్ని బ్యాంకులు అయితే ఆ అప్పులను వసూలు చేయడంలో ప్రైవేట్ వ్యాపారులను మించిపోతున్నాయి. కేవలం పది, ఇరవై వేల రూపాయలు కిస్తీ కట్టలేక, బ్యాంకుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన అన్నదాతలు ఎందరో ఉన్నారు. అదే బ్యాంకు యాజమాన్యాలు పెద్దల విషయంలో ఇందుకు పూర్తివిరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. రాజకీయ పలుకుబడో లేక లక్ష్మీపుత్రులుగా మారితేనో తమను ఏమీ చేయలేరనే భావన రోజురోజుకు పెరిగిపోతున్నది. అందుకే ఒకరిని మించి ఒకరు పోటీపడి ఇటు ప్రజలను, అటు బ్యాంకులను మోసంచేసి కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలాంటి మోసం చేసేవారిపై ఉక్కుపాదం మోపాలి. అవసరమైతే చట్టానికి మరింత పదునుపెట్టాలి. ●

# కార్మికుల భద్రతకు భరోసా ఏది?

బుగ్గన మధుసూదనరెడ్డి

ఈమధ్యే విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని స్టీల్ మెల్డింగ్ షాప్ (ఎస్ఎంఎస్)లో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘోర దుర్ఘటనలో ఐదుగురు ఉద్యోగులతోపాటు ముగ్గురు కార్మికులు మృత్యువాత పడటం,మరో ఆరుగురు తీవ్రంగా కాలిన గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండటం, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటం అత్యంత బాధాకరం. ఈ ఘోర,పెను ప్రమాదం ఓ హృదయ విదారక ఘట్టంగా, ఎంతటి వారికైనా ఒక్క క్షణం గగుర్పాటుకు గురిచేసే ఈ విషాదకరమైన ఘటన ఎలా సంభవించింది అనే విషయానికి వస్తే 150టన్నుల ద్రవపు ఉక్కును మోసుకెళ్తున్న భారీ లాడేల్ నుంచి ద్రవపు ఉక్కు ఒక్కసారిగా విస్ఫోటకం చెంది పైకి ఎగిసి పడటం, తద్వారా అందులో ఉన్న సలసల కాగే ఉక్కు ద్రవం నేలపై చెల్లాచెదురుగా పడటంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అంతేకాదు లాడేల్ నుంచి ద్రవం తుళ్ళిన వేగానికి, ఉక్కు ద్రవం వేడికి అక్కడ ఉన్న భారీ క్రేన్ కూడా పూర్తిగా దగ్ధమై ఆ ప్రాంతమంతా క్షణాల్లో మంటలు వ్యాపించడంతో ప్లాంట్ ఒక్కసారిగా అగ్నిగుండంగా మారడాన్ని బట్టి ప్రమాదం అనేది ఏ స్థాయిలో ఎంతటి భారీ స్థాయిలో జరిగిందో మనం ఇట్టే ఊహించవచ్చు. అయితే దేశంలోని ఏ స్టీల్ ప్లాంట్‌లోనూ ఈ తరహా ప్రమాదం గతంలో సంభవించలేదని, లాడెల్ నుంచి ద్రవపు ఉక్కు లీకై మాత్రమే ప్రమాదాలు జరిగేవి, కానీ ఈసారి లాడెల్ నుంచి ద్రవపు ఉక్కు చిచ్చుబుడ్డిలా ఎగిసిపడి ఈ దారుణ దుర్ఘటనకు కారణ భూతమవ్వడం అత్యంత దురదృష్టకరమైన విషయం. గత రెండు నెలలుగా లాడెల్స్ నుంచి ద్రవపు ఉక్కు 27సార్లు లీక్‌కాగా పలుమార్లు కార్మికులు పెను ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. అయితే దేశంలోని స్టీల్ ప్లాంట్‌లలో లాడేల్‌లోని ఉక్కు ఎగిసిపడటం ఇదే ప్రథమమని కార్మిక సంఘాల ప్రతినిధులు చెబుతుండటం,పైగా ప్రాసెసింగ్ కోసం వాడే




రసాయనాలు నాణ్యత లేనివి కావడం వల్లే కెమికల్ రియాక్షన్ జరిగి ఈ తరహా దుర్ఘటన జరిగిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో వీటివెనుక ఉన్న నిజనిజాలు నిర్ధారణ చేయాల్సిన గురుతర బాధ్యత స్టీల్ ప్లాంట్ యజమాన్యం వారిపై, అదేమాదిరి ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా ఆ స్టీల్ ప్లాంట్ యజమాన్యం ఖచ్చితమైన చర్యలు తీసుకునేలా వారిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాల్సిన కనీస బాధ్యత ప్రస్తుత కేంద్ర ఉక్కు శాఖపై ఎంతైనా వుంది. ఏదిఏమైన 20మంది ఉండాల్సిన పనిప్రదేశంలో కేవలం 12మందితో పని చేయించడం దారుణమని, పనికిరాని వ్యక్తులను డైరెక్టర్లుగా నియమించి భద్రతాప్రమాణాలు పాటించకుండా ఉత్పత్తి చేయడంవల్లే ఇలాంటి తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయని విశాఖస్టీల్ ప్లాంట్ యాజమాన్యంపై అత్యంత తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వీటన్నింటిని ఒకటికి రెండుసార్లు క్షుణంగా పరిశీలించి, పర్యవేక్షణ గావించి, తనిఖీ చేసి మరీ ఈపొరపాట్లు మరోసారి పునరావృతంకాకుండా చూసుకోవాల్సిన గురుతర బాధ్యత విశాఖ స్టీల్ ప్లాంట్ యజమాన్యం వారి భుజస్కందాలపై ఎంతైనా వుంది.ఏమైనా కార్మికుల భద్రతపై ఏమాత్రం దృష్టిసారించకుండా కేవలం ఉత్పత్తి మాత్రమే లక్ష్యంగా కార్మికులపై ఒత్తిడి పెంచడం మూలాన ఇలాంటి ప్రమాదాలు తరచుగా చోటు చేసుకుంటున్నాయని పలువురు కార్మిక అనుబంధ సంఘాల నాయకులు స్టీల్ ప్లాంట్ యజమాన్యంపై తీవ్ర విమర్శలు చేస్తూన్న నేపథ్యంలో వీటన్నింటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత,కర్తవ్యం స్టీల్ ప్లాంట్ యజమాన్యంపై ఎంతైనా వుంది.అన్నింటికి మించి ఇలాంటి పెద్ద పెద్ద స్టీల్ ప్లాంట్ వంటి సంస్థలలో అయా యజమాన్యాలు అధిక లాభాలకు ఇచ్చేప్రాధాన్యత, కార్మిక భద్రతాప్రమాణాలకు ఇవ్వకుండా చేయడం మూలా నే ఇలాంటి గుండెల్ని పిండి చేసే ఘటనలు, కార్మికుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయే, దిగ్భ్రాంతికరమైన సంఘటనలు సంభవిస్తూన్నాయి అనేమాట అక్షరసత్యం.కార్మికుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతుండటం, పెద్దపెద్దసంస్థల యజమాన్యాలు మాత్రంకోట్లకు పడగలు ఎత్తుతుండటం ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ఓ తతంగం,ఓ సాధారణ పరిణామం అనడంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ●

# హారిజంటల్ రిజర్వేషన్ల అసలు తత్వం

ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు

డీఎస్సీ నియామకాల నేపథ్యంలో హారిజాంటల్ రిజర్వేషన్లపై ఉద్భవించిన వివాదం కేవలం కొన్ని ఉద్యోగాల కేటాయింపుల గురించినది కాదు. అది భారతదేశంలో రిజర్వేషన్ వ్యవస్థపై ఉన్న అవగాహన లోపాన్ని, సామాజిక న్యాయం గురించి మనం ఇంకా ఎంత పరిమితంగా ఆలోచిస్తున్నామో వెల్లడించింది. రిజర్వేషన్లు అంటే కేవలం శాతం లెక్కలు కాదని, ప్రాతినిధ్యం అనే ప్రజాస్వామ్య విలువను ప్రతిబింబించే వ్యవస్థ అని గుర్తుచేసింది. చాలా మందికి రిజర్వేషన్ అంటే కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు కేటాయించిన సామాజిక కోటాలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ, భారత రాజ్యాంగం ఆశించిన బహుముఖ సామాజిక న్యాయం అంతటితో ముగిసిపోదు. ఒకే సామాజిక వర్గానికి చెందిన మహిళ, వికలాంగుడు, మాజీ సైనికుడు లేదా క్రీడాకారుడు కూడా వ్యవస్థలో సమాన అవకాశాలు పొందాలనే ఉద్దేశంతో రూపొందించబడిన అత్యంత సంక్లిష్టమైన అంతర్గత రక్షణ వలయమే ఈ 'హారిజాంటల్ రిజర్వేషన్లు'. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1), 16(4) పరిధిని విశ్లేషిస్తే సమానత్వానికి ఉన్న రెండు భిన్న కోణాలు స్పష్టమవుతాయి. చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించడం కోసం ప్రవేశపెట్టిన వర్టికల్ (సామాజిక) రిజర్వేషన్లు ఒక ఎత్తయితే, ఆయా వర్గాల లోపల మళ్లీ వెనుకబడిన ఉపవర్గాలకు రక్షణ కల్పించడం మరోఎత్తు. ఉదాహరణకు, ఒక నిర్దిష్ట సామాజిక వర్గంలో పురుషులతో పోలిస్తే మహిళలు, సాధారణ అభ్యర్థులతో పోలిస్తే దివ్యాంగులు మరింత వెనుకబడి ఉంటారు. కేవలం సామాజిక వర్గాల ఆధారంగానే సీట్లు కేటాయించుకుంటూపోతే, ఆయా వర్గాలలోని మహిళలకు, దివ్యాంగుల వంటి బలహీన ఉపవర్గాలకు అవకాశాలు దక్కకుండా పోతాయి. ఈ అంతర్గత అసమానతలను తొలగించేందుకే 'హారిజాంటల్ విధానం' రూపుదిద్దుకుంది. సూక్ష్మ సాంకేతిక వ్యత్యాసం అర్థం కాకపోవడం వల్లే నియామకాల ప్రతిసారీ వివాదాలు, కోర్టు కేసులు ముసురుకుంటున్నాయి. ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులుఅత్యంత స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించాయి. ముఖ్యంగా 'అనిల్ కుమార్ గుపా', 'రాజేష్ కుమార్ దరియా' కేసులలో సుప్రీంకోర్టు హారిజాంటల్ విధానాన్ని 'ఇంటర్లాకింగ్ రిజర్వేషన్'గా అభివర్ణించింది. న్యాయస్థానం నిర్దేశించిన సూత్రం ప్రకారం, ముందుగా ఓపెన్ మెరిట్, ఆ తర్వాత వర్టికల్



(సామాజిక) రిజర్వేషన్ల ప్రకారం ప్రతి కేటగిరీలో పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీచేయాలి. ఆ తర్వాతే, సదరు కేటగిరీలలో మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికుల నిర్దేశితకోటా భర్తీ అయిందో లేదో సరిచూసుకోవాలి. ఒకవేళ భర్తీ కాకపోతేనే చిట్టచివరి అభ్యర్థులను తొలగించి, ఆయా క్షితిజసమాంతర (హారిజాంటల్) అభ్యర్థులతో భర్తీచేయాలి. ఈ విధానం సామాజిక న్యాయంతో పాటు పరిపాలనా పారదర్శకతను కూడా నిర్ధారిస్తుంది. డీఎస్సీ వివాదం బహిర్గతం చేసిన వాస్తవం డీఎస్సీ నియామకాల సందర్భంగా వచ్చిన అపోహాలు కేవలం పోస్టుల లెక్కలకు సంబందించినది కాదు. అది ప్రజా విధానాలపై అవగాహన ఎంత అవసరమో గుర్తు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు, రోస్టర్ విధానం, న్యాయస్థానాల తీర్పులు అన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ, అవి సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో చేరడం లేదు. ఫలితంగా నియామకాల ప్రక్రియ పూర్తయిన తర్వాతే సందోహాలు, ఆరోపణలు, అపోహాలు ఉత్పన్నమవుతున్నాయి. నియామక ప్రక్రియలో పారదర్శకత ఎంత ముఖ్యమో, దానిపై ప్రజలకు అవగాహన కల్పించడంకూడా అంతే ముఖ్యం. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల్లో 'మెరిట్' అనే భావన కేవలం పరీక్షల్లో సాధించే మార్కులకే పరిమితం కాకూడదు. సామాజిక సమగ్రత, వైవిధ్యం కూడా మెరిట్‌లో భాగమేనని న్యాయవ్యవస్థ సైతం పునరుద్ఘాటించింది. హారిజాంటల్ రిజర్వేషన్లు ఈ మెరిట్‌ప్రాతినిధ్యాల మధ్య ఒక సంపూర్ణ సమతుల్యతను సాధిస్తాయి. ఒకవైపు పోటీని కొనసాగిస్తూనే, మరోవైపు మహిళలు, దివ్యాంగులు వంటి వర్గాలు అవకాశాల నుండి దూరం కాకుండా చూస్తాయి. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నియమావళి సాధారణ అభ్యర్థులకు అర్థమయ్యే సరళమైన భాషలో అందుబాటులో లేకపోవడం పెద్ద లోపం. ఇకపై ప్రతి ప్రభుత్వ నియామక నోటిఫికేషన్తో పాటు, హారిజాంటల్ రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారో స్పష్టమైన గ్రాఫికల్ చార్టులు, ఉదాహరణలతో కూడిన వివరణలను కూడా అధికారికంగా విడుదల చేయాలి. సామాజిక న్యాయం అనేది కేవలం కాగితాల మీది అంకెల శాతాలతో ముడిపడి ఉన్నది కాదు, అది సమాజంలోని ప్రతి ఉపవర్గానికి సంపూర్ణంగా అందినప్పుడే రాజ్యాంగ ఆశయం నెరవేరుతుంది. భారతదేశం వంటి వైవిధ్యభరిత సమాజంలో సామాజిక న్యాయం అనేది కేవలం శాతం కేటాయింపుల అంశం కాదు. సమాజంలోని ప్రతి వర్గం, ప్రతి ఉపవర్గం, ప్రతి వ్యక్తి అవకాశాల ప్రవాహంలో భాగస్వామి కావడం దాని అసలు లక్ష్యం. ఆ లక్ష్యాన్ని సాధించడంలో హారిజాంటల్ రిజర్వేషన్లు ఒక కీలక ప్రజాస్వామ్య సాధనం. అందువల్ల వాటిని వివాదాల కళ్లద్దాల ద్వారా కాకుండా, సమగ్ర ప్రాతినిధ్యం రాజ్యాంగ విలువల దృష్టితో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ●

# కేన్సర్ మందులు, వ్యాక్సిన్‌లపై ధరలు 50శాతం పెంపు

- గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసిన ఎన్‌పిపిఎ
- అంతర్జాతీయ విపణిలో ధరలు పెరుగుదల



**న్యూఢిల్లీ, జూన్ 12:** క్యాన్సర్ మందులు, టెటనస్ సీరం, చిన్నపిల్లల వ్యాక్సిన్‌ల ధరలు 50 వరకు పెరగనున్నాయిపెరుగుతున్న ముడి పదార్థాల ధరలు, సరఫరా ఆందోళనలను కారణంగా చూపుతూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నియంత్రణ అథారిటీ; కీలక ఆంకాలజీ మందులు, ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్లు, వ్యాక్సిన్‌ల గరిష్ట ధరలను సవరించింది పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, సరఫరా అంతరాయాల నేపథ్యంలో రెండు కీలక క్యాన్సర్ మందులైన కార్బోప్లాటిన్, సిస్ప్లాటిన్‌ల లభ్యత కొనసాగేలా చూసేందుకు, వాటి గరిష్ట ధరలను ఒకేసారి 50శాతం పెంచడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కార్బోప్లాటిన్, సిస్ప్లాటిన్‌లు వివిధ రకాల క్యాన్సర్ల చికిత్స కోసం విస్తృతంగా ఉపయోగించే తొలిదశ ఆంకాలజీ ఔషధాలు. ఈ మందుల కొరత, సరఫరా అంతరాయాలపై ఆరోగ్య సంస్థలు, ఆంకాలజిస్టులు, తయారీదారులు తమ దృష్టిని ఆకర్షించారని ఎన్‌పిపిఎ తెలిపింది. మందుల కొరత, అధిక యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్ (ఎపిఐ) ధరలు, వాటి తయారీ వాణిజ్యపరమైన లాభదాయకతపై ఆందోళనలకు సంబంధించిన నివేదికలను సమీక్షి ంచిన తర్వాత ఈ చర్య తీసుకున్నట్లు జూన్ 11న జారీ చేసిన ఒక నోటిఫికేషన్‌లో నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) పేర్కొంది. సవరించిన గరిష్ట ధరల ప్రకారం, వర్తించే జిఎస్‌టిని మినహాయించి, కార్బోప్లాటిన్ ఇంజెక్షన్ (10ఎంజి/ఎంఎల్) ధరను ప్రతి ఎంఎల్‌కి రూ.90.74గా, సిస్ప్లాటిన్ ఇంజెక్షన్ (1ఎంజి/ఎంఎల్) ధరను ప్రతి ఎంఎల్‌కి రూ.10.89గా నిర్ణయించారు. ఈ రెండు మందులలో ఉపయోగించే ఎపిఐల ధరలు ఇటీవలి సంవత్సరాలలో గణనీయంగా పెరిగాయని, ఇది వాటి ఉత్పత్తి, సరఫరా సాధ్యతను ప్రభావితం చేస్తోందని అథారిటీ పేర్కొంది. ఈ మందుల లభ్యతలో ఏ మాత్రం అంతరాయం ఏర్పడినా, అది క్యాన్సర్ చికిత్సకు ఆటంకం కలిగించి, రోగులను ఖరీదైన ప్రత్యామ్నాయాల వైపు మళ్లించేలా చేస్తుందని కూడా అది తెలిపింది. ముడి పదార్థాల ధరలలోని హెచ్చుతగ్గులను పరిగణనలోకి తీసుకుని, ఈ సవరించిన గరిష్ట ధరలను ఆరు నెలల తర్వాత లేదా అవసరమైతే అంతకంటే ముందుగానే సమీక్షి స్తారు.

## రాజ్యసభకు 24 మంది ఎంపీలు ఏకగ్రీవం

**న్యూఢిల్లీ,జూన్ 12:** రాజ్యసభ 2026కు సంబంధించిన ఎన్నికలు తాజాగా జరిగాయి. మొత్తం 27 స్థానాలకు నోటిఫికేషన్ వెలువడి ఎన్నిక జరగగా అందులో 24 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. గురువారం ఫలితాలు వెలువడ్డాయి. వీరిలో 19 మంది బీజేపీ (ఎన్‌డీయే) అభ్యర్థులుకాగా, మిగతా ఐదుగురు కాంగ్రెస్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మరోసారి ఎంపీగా గెలిచారు. కాంగ్రెస్ నుంచి మీనాక్షినటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత రాజ్యసభలో ఎన్‌డీయే స్థానాలు 3 పెరగగా, కాంగ్రెస్ ఒక సీటు పెంచుకుంది. ఇంతకుముందు ఈ స్థానాల్లో ఎన్‌డీయే 16 రాజ్యసభ సీట్లు కలిగి ఉండేది. ఇప్పుడు 3 సీట్లు పెరిగాయి. ఇంతకుముందు ఇదే స్థానాల్లో కాంగ్రెస్ 4 సీట్లు కలిగి ఉండేది. ఇప్పుడు అదనంగా మరో సీటు గెలుచుకుంది. ఈ ఎన్నికల ద్వారా ఏపీకి చెందిన వైసీపీ మూడు రాజ్యసభ స్థానాల్ని కోల్పోయింది. ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ కూడా ఒక సీటును బీజేపీకి కోల్పోవాల్సి వచ్చింది. తాజా ఫలితాల్లో పార్టీ ప్రకారం గెలిచిన సీట్ల వివరాలివి. ఏపీ నుంచి ఎన్‌డీయే కూటమికి చెందిన పార్టీలు టీడీపీ, జనసేనలు 4 స్థానాలు దక్కించుకున్నాయి. ఇందులో మూడు సీట్లు టీడీపీకి, ఒక సీటు జనసేనకు దక్కాయి. భాష్యం రామకృష్ణ (టీడీపీ) చింతకాయల విజయ్ (టీడీపీ), సానా సతీష్ బాబు (టీడీపీ), లింగమనేని రమేష్ (జనసేన), గుజరాత్ నుంచి నాలుగు స్తానాలు బీజేపీకే దక్కాయి. రాజుభాయ్ శుక్లా, మన్షిన్ పర్మార్, ముకేష్‌భాయ్ రత్వా, జితేంద్ర కంజారియాలు బీజేపీ నుంచి గెలిచారు. కర్ణాటకలో ఒక స్థానం ఎన్‌డీయేకు, మూడు స్థానాలు కాంగ్రెస్ (ఇండియా బ్లాక్)కు దక్కాయి. అవి మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్), మన్సూర్ అలీఖాన్ (కాంగ్రెస్), పవన్ ఖేరా (బీజేపీ), ఎం నాగరాజా (బీజేపీ), మధ్యప్రదేశ్ నుంచి 3 సీట్లు ఎన్‌డీయే కూటమికి దక్కాయి. తరుణ్ చుగ్, రాజనీష్ అగర్వాల్, ముకేష్ కేవత్‌లు బీజేపీ నుంచి గెలిచారు. రాజస్తాన్‌లో రెండు సీట్లు ఎన్‌డీయేకు, ఒకటి కాంగ్రెస్‌కు దక్కాయి. సతీష్ పూనియా (బీజేపీ), అల్కా గుర్జార్ (బీజేపీ), నీరజ్ దంగి (కాంగ్రెస్) గెలుపొందారు. తమిళనాడులో ఒక స్తానాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. టీవీకే మద్దతుతో కాంగ్రెస్ గెలిచింది. తమిళనాడు నుంచి కాంగ్రెస్ తరఫున ప్రవీణ్ చక్రవర్తి గెలిచారు. ఇక అరుణాచల్ ప్రదేశ్ నుంచి బీజేపీ తరఫున తాయ్ తగాక్, మణిపూర్ నుంచి అధికారిమయూమ్ శార్దా దేవి (బీజేపీ), మేఘాలయ నుంచి జేమ్స్ కే సంగ్మా (ఎన్‌పీపీ), మహారాష్ట్ర నుంచి రాజేంద్ర జైన్ (ఎన్‌సీపీ), ఒడిశా నుంచి దేవాశిస్ సమంత్ రాయ్ (బీజేపీ) గెలిచారు.

## ఒమన్ తీరంలో మరో భారతీయ నౌకపై అమెరికా దాడి!

**మస్కట్,జూన్ 12:** ఒమన్ తీరంలో భారతీయ నావికులు ఉన్న వాణిజ్య నౌకలపై వరుస దాడులు కొనసాగుతుండటంతో అమెరికా తీరు పట్ల భారత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గత 48 గంటల్లో రెండోసారి ఢిల్లీలోని అమెరికా సీనియర్ దౌత్యాధికారిని విదేశాంగ శాఖ పిలిపించి అధికారికంగా నిరసన తెలిపింది. ముందురోజు జరిగిన ఘటనలో 20 మంది భారతీయ సిబ్బంది ఉన్న ఓ వాణిజ్య నౌక దాడికి గురికావడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. అమెరికా అధికారి జేసన్ మీక్స్‌ను పిలిపించి భారత విదేశాంగ శాఖ తమ ఆందోళనలను నేరుగా తెలియజేసింది. గత దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒమన్ తీర ప్రాంతంలో నాలుగు రోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న మూడు వాణిజ్య నౌకలను అమెరికా నౌకాదళం లక్ష్యంగా చేసుకుందని భారత ప్రభుత్వం వెల్లడించింది. భారత నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. సెట్టెబెల్లో నౌకపై దాడి జరిగిన వెంటనే అమెరికా అధికారులకు గట్టి నిరసన తెలిపినట్లు వెల్లడించారు. ఇలాంటి దాడులు వెంటనే ఆగాలని, సమస్యల పరిష్కారానికి యుద్ధం కంటే చర్చలు, దౌత్య మార్గాలే సరైనవని భారత్ స్పష్టం చేసిందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా నౌకాయానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని భారత్ కోరింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితిని శాంతియుతంగా పరిష్కరించేందుకు అన్ని పక్షాలు సంభాషణల బాట పట్టాలని ఢిల్లీ పిలుపునిచ్చింది.

# నేటి నుంచి ప్రధాని విదేశ పర్యటన

- 18 వరకు ఫ్రాన్స్, స్లోవేకియాలో టూర్ - ఇరు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు - జి7 సదస్సుకు హాజరు.. ట్రంప్‌తో భేటీ?



**న్యూఢిల్లీ, జూన్ 12:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జూన్ 13 నుంచి 18 వరకు ఫ్రాన్స్, స్లోవేకియాలలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, స్లోవేకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికోలతో ద్వైపాక్షి క చర్చలు జరుపనున్నారు. అలాగే ఫ్రాన్స్‌లో జరిగే జి7 సదస్సులో పాల్గొని, పారిస్‌లో జరిగే వివాటెక్ టెక్నాలజీ ఈవెంట్‌కు హాజరవుతారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, ప్రధాని మోడీ తన పర్యటనను ఫ్రాన్స్‌లోని నైస్‌లో ప్రారంభిస్తారు. అక్కడ ఆయన జూన్ 14న అధ్యక్షుడు మాక్రాన్‌ను కలుస్తారు. భారత్-ఫ్రాన్స్ ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం కింద ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షి క సంబంధాల పూర్తి స్థాయిని ఈ ఇద్దరు నాయకులు సమీక్షి ంచే అవకాశం ఉంది. భారత్, ఫ్రాన్స్, ఇతర దేశాలకు చెందిన స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్ ఫండ్‌లను ఒకచోట చేర్చే 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని కూడా ఈ ఇద్దరు నాయకులు సంయుక్తంగా ప్రారంభిస్తారు. భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జూన్ 14 నుంచి 16 వరకు, ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ స్లోవేకియాలో అధికారిక పర్యటన చేపట్టనున్నారు. 1993లో స్లోవేకియాకు స్వాతంత్రం వచ్చిన తర్వాత, ఆ దేశంలో ఒక భారత ప్రధాని పర్య టించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటన సంద ర్భంగా, ప్రధాని మోడీ ఫికోతో చర్చలు జరిపి, స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినిని కలుస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఆటో మొబైల్ తయారీ, రైల్వే తయారీ వంటి రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై ఈ చర్చలు దృష్టి సారించే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రధాని మోడీ, జూన్ 16, 17 తేదీలలో ఫ్రాన్స్‌లోని ఎవి యాన్‌లో జరిగే జి7 సదస్సులో పాల్గొంటారు. అంతర్జాతీయ సహకారం, ఆర్థిక వృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాలపై జి7 నాయకులు, భాగస్వామ్య దేశాలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో ఆయన అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది. ఈ సదస్సు సందర్భంగా, ప్రధాని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సహా పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షి క సమావేశాలు కూడా నిర్వహించే అవకాశం ఉంది. తన పర్యటన చివరి దశలో, ప్రధాని మోడీ తదుపరి ద్వైపాక్షి క కార్యక్రమాల కోసం, యూరప్‌లోనే అతిపెద్ద టెక్నాలజీ, స్టార్టప్ ఈవెంట్ అయిన వివాటెక్ సమ్మిట్‌లో పాల్గొనడం కోసం జూన్ 18న ప్యారి స్‌కు వెళ్లనున్నారు. ఆయన ఫ్రాన్స్ రాజధానిలోని భారతీయ సమాజ సభ్యులతో కూడా సంభాషించే అవకాశం ఉంది. ఈ పర్యటన ద్వారా ఫ్రాన్స్, స్లోవేకియాలతో భారతదేశ సంబంధాలు మరింత బలపడతాయని, జి7 దేశాలతో సహకారం పటిష్టం అవుతుందని, ఆవిష్కరణ, డిజిటల్ టెక్నా లజీలు, వ్యవస్థాపకత

## రష్యా చమురు కొనుగోలు చేయమని అమెరికానే చెప్పింది!

### ఫిన్‌ల్యాండ్ పర్యటనలో విదేశాంగమంత్రి జైశంకర్



**హెల్సింకి, జూన్ 12:** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని విమర్శిస్తున్న పాశ్చాత్య దేశాలపై విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఘాటుగా స్పందించారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురు కొనుగోలు చేయాలని భారత్‌ను స్వయంగా అమెరి కానే కోరిందని వెల్ల డించారు. ప్రపంచ మార్కెట్లో ధరలు అదుపులో ఉండాలంటే రష్యా చమురు కొనాలని అప్పట్లో అగ్ర రాజ్యం సూచించిందని చెప్పారు. ఫిన్లాండ్ పర్యటనలో భాగంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాపై భారత్ మరీ సానుభూతి చూపుతోందని, ఎక్కువగా రష్యా చమురునే కొనుగోలు చేస్తోందని ఓ జర్నలిస్టు ప్రశ్నించచడంతో గట్టిగా బదులిచ్చారు. తాను చమురు కొనేటప్పుడు ధర, లభ్యత మాత్రమే చూస్తానని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత అమెరికా సహా పాశ్చాత్య దేశాలు మాస్కోపై ఆంక్ష లు విధించాయి. దీంతో యూరప్ దేశాలు పశ్చిమాసియా దేశాల చమురును ఎక్కువగా కొనుగోలు చేయడం ప్రారంభించాయి. అదే సమయంలో భారత్‌కు అందుబాటులో ఉన్న పెద్ద సరఫరాదారు రష్యానే అయిందని జైశంకర్ వివరించారు. పరిస్థితులే భారత్‌ను ఆ దిశగా నడిపించాయని చెప్పారు. రష్యా చమురు విషయంలో అమెరికా వైఖరిని కూడా ఆయన ప్రశ్నించారు. ఓవైపు రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై టారిఫ్‌లు విధించారని తర్వాత వాటినే ఎత్తివేశారని గుర్తుచేశారు. ఇందులో గొప్ప సూత్రాలు ఏమీ లేవని, దీనికి నైతికత ముసుగు వేయడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. గత ఏడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం భారత వస్తువులపై 50 శాతం వరకు టారిఫ్‌లు విధించింది. ఇందులో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తోందంటూ విధించిన 25 శాతం అదనపు సుంకం కూడా ఉంది. అయితే ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రపంచ ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి పెరగడంతో ఆ ఆంక్షలను అమెరికా సడలించింది.

యూరప్ దేశాలపై కూడా జైశంకర్ విమర్శలు గుప్పిం చారు. భారత్‌పై దాడులకు ఉప యోగించే ఆయుధాలను యూరప్ దేశాలు ఎన్నో ఏళ్లుగా విక్రయిస్తున్నా యని చెప్పారు. భారత ఆయుధాలతో యూరప్‌లోని ఏ దేశంపైనా దాడులు జరగలేదని స్పష్టం చేశారు.

## టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీపై కేసు నమోదు



**కోల్‌కత్తా,జూన్ 12:** టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజి నగర్ పోలీస్ స్టేషన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక వ్యక్తి మమతపై ఫిర్యాదు చేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మమత గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకవర్గానికి వ్యతిరేకంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఆమెపై నమోదైన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మీరు క్షేమంగా ఉన్నారని, లేకుంటే ఒక వర్గం చేతిలో అణిచివేతకు గురయ్యే వారు అంటూ అప్పట్లో మమత వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఆమె వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు, భయం పెంపొందించేలా, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా మమత వ్యవహరించారని ఫిర్యాదులో వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. మే 20న ఈ ఫిర్యాదు దాఖలైంది. శుక్రవారం ఈ ఫిర్యాదుపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మమతకు తాజా రాజకీయ పరిణామాలు ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే. పార్టీకి చెందిన మెజారిటీ నేతలు టీఎంసీని వీడుతున్నారు. ఎంపీలు రెబల్స్‌గా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటించారు. తమను ప్రత్యేక వర్గంగా చూడాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. మరోవైపు ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లో ఇప్పుడు టీఎంసీ భవితవ్యంతోపాటు మమత రాజకీయ భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారింది.

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి 30 యేళ్ల జైలు



**సియోల్, జూన్ 12:** దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. కాగా 2024 అక్టోబరులో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందుకు ఆయనకు మరో 30 యేళ్లు జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియాలోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంట్‌ను తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన 'మార్షల్ లా' విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది.

## ఆ పది శాతం సుంకాలకు ఫెడరల్ కోర్టు ఓకే

**వాషింగ్టన్, జనవరి 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. ప్రపంచవ్యాప్తంగా దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ విధించిన 10 శాతం గ్లోబల్ సుంకాలను వాషింగ్టన్‌లోని ఫెడరల్ సర్క్యూట్ అప్పీల్స్ కోర్టు సమర్థించింది. ఆ సుంకాల వసూలును కొనసాగించవచ్చని కీలక తీర్పునిచ్చింది. గతేడాది భారత్ సహా అన్ని దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాటిని ఈ యేడాది ప్రారంభంలో అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఆ వెంటనే ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 122ను ఉపయోగించి జూలై 24 వరకు అమలులో ఉండేలా 10 శాతం తాత్కాలిక సుంకాలను ట్రంప్ విధించారు. రెండు వ్యాపార సంస్థలు ఇటీవల దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా..

అక్కడ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం సుంకాలను నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. ట్రంప్ యంత్రాంగం దీనిపై అప్పీల్ చేయగా.. వారికి అనుకూలంగా న్యాయస్థానం తీర్పునిచ్చింది. కాగా.. ఈ కేసుపై సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సంక్షిప్త వార్తలు

### కోమాలో ఉన్న థాయ్ యువరాణి కన్నుమూత



**బ్యాంకాక్, జూన్ 12:** మూడేళ్లుగా కోమాలో ఉన్న థాయ్‌ల్యాండ్ యువరాణి బజ్రకితియాబా కన్నుమూశారు. ఆమె వయసు 47 ఏళ్లు. డిసెంబర్ 2022లో ఆమె స్పృహ కోల్పోయారు. గుండె పనితీరు రెగ్యులర్‌గా లేని కారణంగా ఆమె గుండె కండరాలకు మైక్రోప్లాస్మా ఇన్‌ఫెక్షన్ అయ్యింది. థాయ్‌ల్యాండ్ రాచకుటుంబం యువరాణి మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించింది. రాజు వజిరలాంగ్‌కార్న్ పెద్ద కుమార్తె ఆమె. ఆ రాజుకు ఏడు మంది పిల్లలు ఉన్నారు. 1978లో డిసెంబర్ 7వ తేదీన తొలి భార్యకు ఆమె జన్మించారు. వైద్య బృందం ఆ యువరాణికి ఇంటెన్సివ్ కేర్ చికిత్స అందించింది. కానీ ఆమె క్రమంగా బలహీనమైనట్లు గుర్తించారు. చూలలోంగ్‌కార్న్ ఆస్పత్రిలో ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

### ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**లక్నో,జూన్ 12:** ఇండిగో విమానానికి శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. లక్నో నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపు వచ్చిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ కావడానికి కొద్ది నిమిషాల ముందు బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న భద్రతాదళాలు వేగంగా స్పందించాయి. విమానాన్ని నిలిపివేశారు. విమానంలోని ప్రయాణికుల్ని, సిబ్బందిని దింపివేశారు. దూరంగా నిలిపి తనిఖీలు చేపడుతున్నారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)తోపాటు స్థానిక పోలీసులు ఈ సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్నారు.

### టాటాలను మళ్లీ తీసుకొస్తాం.. సిఎం సువేందు అధికారి



**కోల్‌కత్తా,జూన్ 12:** పశ్చిమ బెంగాల్‌లో పారిశ్రామిక పెట్టుబడులను పెంపొందించే దిశగా నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి అడుగులువేస్తున్నారు. సుమారు రెండు దశా బ్దాల క్రితం రాష్ట్రం నుంచి తరలివెళ్లిన టాటా గ్రూప్‌ను మళ్లీ వెనక్కి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కోల్‌కత్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "టాటాలను మేము తిరిగి బెంగాల్‌కు తీసుకు వస్తాం" అని ప్రకటించారు. సుమారు 18 ఏళ్ల క్రితం సింగూ ర్‌లో టాటా నానో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుపై తలెత్తిన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

### బంగ్లాలో శ్రీరాముడి విగ్రహ నిర్మాణపనులు నిలిపివేత



**ఢాకా,జూన్ 12:** బంగ్లాదేశ్‌లో నిర్మాణంలో ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద శ్రీరాముడి విగ్రహ పనులను అక్కడి అధికారులు నిలిపివేశారు. గైబాంధా జిల్లాలోని పలాష్‌బారి ప్రాంతంలోని శ్రీశ్రీ రాధా గోవింద, కాళీ ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. స్థానిక ఇస్లామిక్ సంస్థలు, మత ఛాందసవాద గ్రూపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ నిర్ణయం బంగ్లాదేశ్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా చర్చనీయాంశమైంది.

### 160 యేళ్ల బంగ్లాను నివాసంగా ఎంపికచేసుకున్న సిఎం డికె



**బెంగళూరు,జూన్ 12:** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన అధికారిక నివాసం విషయంలో సంప్రదాయానికి భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా ముఖ్యమంత్రుల కోసం కేటాయించే కృష్ణ, కావేరి, అనుగ్రహ వంటి అధికారిక బంగ్లాలకు బదులుగా, 160 ఏళ్ల సుదీర్ఘ చారిత్రక నేపథ్యం కలిగిన కుమారకృప బంగ్లాను తన నివాసంగా, కార్యాలయంగా ఆయన ఎంపిక చేసుకున్నారు. ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కావేరి బంగ్లాలోనే నివాసం ఉంటుండటంతో, ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డీకే శివకుమార్ ఈ ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు.

## ఖొమేనీ అంత్యక్రియలు మరోసారి వాయిదా



**టెహ్రాన్,జూన్ 12:** ఇరాన్ సుప్రీం లీడర్ దివంగత అయ తుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు మరోసారి వాయిదా పడ్డాయి. అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఖమేనీ అంత్యక్రియలను జూన్ చివరి వరకు లేదా జూలై ఆరంభం వరకు వాయిదా వేస్తున్నట్లు టెహ్రాన్ మేయర్ ప్రకటించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున ఈ అంత్యక్రియలను జూన్ 26 జూలై 5 మధ్య కాలానికి వాయిదా వేస్తున్నట్లు టెహ్రాన్ మేయర్ అలీరెజా జకాని ప్రకటించారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన ముహర్రం ప్రారంభంలో అంటే జూన్ ఆరంభంలో ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ భావించింది. అయితే, కర్బలా యుద్ధంలో (క్రీ.శ. 680) అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం భక్తులు జరిపే వార్షిక సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు వీలుగా ముహర్రం తర్వాతే అంత్యక్రియల నిర్వహించాలని నిర్ణయించినట్లు మేయర్ అలీరెజా వెల్లడించారు.

## రాజీపడిన ప్రధాని - భరతమాత ముద్దుబిడ్డలను రక్షించలేరు

### నావికుల మృతికి మోడీపై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, జూన్ 12:** వాణిజ్య నౌకపై అమెరికా సైనిక దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. "రాజీపడిన ప్రధాని" భరతమాత ముద్దుబిడ్డలను రక్షి ంచలేరని, ఎందుకంటే వారి ప్రాణాలు తీసిన వారిని ఆగ్రహానికి గురిచేసే ధైర్యం లేదా శక్తి ఆయనకు లేదని రాహుల్ అన్నారు. 'ఎక్స్' వేదికగా ఈ మేరకు పోస్ట్ చేశారు. ఈ విషయంపై ప్రధాని మోడీ మౌనాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. "మూడు రోజుల్లో అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై జరిగిన అమెరికా దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించారు. కానీ మన 'రాజీపడిన ప్రధాని' మాత్రం... ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని చంపినప్పుడు, ప్రధాని తప్పక స్పందించాలి. కానీ ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేరు. వచ్చే వారం జరగబోయే జి7 సమావేశంలో, మన నావికుల హత్య జరిగిన కొద్ది రోజులకే, మోడీ జీ నవ్వుతూ, ఆలింగనం చేసుకుంటూ, ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ ఆ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్క మాట కూడా మాట్లాడరు" అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాజీపడిన ప్రధాని భరతమాత ముద్దు బిడ్డలను రక్షి ంచలేరు, ఎందు కంటే ఆ బిడ్డల ప్రాణాలు తీసిన వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ ఆయనకు లేవు" అని గాంధీ పేర్కొన్నారు. ఒమన్ గల్ఫ్ లో ప్రయాణిస్తున్న ఎంటీ సెట్టెబెల్లో అనే వాణిజ్య నౌకపై అమెరికా సైన్యం జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. కానీ దీనిపై ప్రధాని మోడీ ఇప్పటి వరకు ఏం మాట్లాడలేదు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇసి-బిజెపి జుగల్‌బందీతోనే సీటు చోరీ.

ప్రధాని మోడీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షీ నటరాజన్

## ఇరాన్‌తో ఒప్పందం కోసం 'యురేనియం'పై మెట్టు దిగిన ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 12:** ఇరాన్‌తో డీల్ దాదాపు కొలిక్కి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. గతంలో కూడా ఆయన పలుమార్లు ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ.. ఈసారి మాత్రం ఒప్పందం ఖరారయ్యే సంకేతాలే కన్పిస్తున్నాయి. ఇందు కోసం ట్రంప్ ఓ మెట్టు దిగి మరీ ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థ సంచలన కథనం వెల్లడించింది. ఇరాన్‌లో శుద్ధి చేసిన యురేనియం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశం చేతుల్లో ఉండొద్దని ట్రంప్ గత కొంతకాలంగా డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే. దాన్ని అమెరికాకు అప్పగించాలని లేదంటే నాశనం చేయాలని ఆయన అంతకుముందు చెప్పారు. అయితే, తాజా చర్చల్లో దీనిపై ట్రంప్ కాస్త తగ్గినట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్‌లోనే ఉంచేందుకు ఆయన అంగీకరించినట్లు సమాచారం. అయితే, అది ఐరాస ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలోనే ఉండాలని మెలిక పెట్టారట. ఇక, అణు కార్యక్రమాలపై టెహ్రాన్ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా.. అది అమెరికాతో రెండో డీల్ కుదిరిన తర్వాతేనని ట్రంప్ షరతు విధించినట్లు తెలుస్తోంది. తాజా అవగాహన ఒప్పందంలో భాగంగా 30 రోజుల్లోపు హార్ముజ్ జలసంధిని ఎలాంటి టోల్ రుసుములు లేకుండా నౌకల రవాణాకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా.. అమెరికా ఈ జలమార్గంలో నిర్బంధాన్ని ఎత్తివేయనుంది. ఇక, హార్ముజ్‌ను తెరిచిన తర్వాత 60 రోజులపాటు ఇరాన్‌కు అగ్రరాజ్యం ఆంక్షల మినహాయింపు కల్పించనుందని తెలుస్తోంది.



# భోగాపురం విమానాశ్రయం రెడీ

**ప్రయాణ సమయాన్ని 45-50 నిమిషాలకు తగ్గించేలా చర్యలు**

# విశాఖపట్నం- ఎయిర్‌పోర్టు మధ్య కొత్త రోడ్డు నెట్‌వర్క్

**విజయనగరం జూన్ 12 ప్రభాతవార్త:** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం తుది దశకు చేరుకుంటోంది. విశాఖపట్నం- విమానాశ్రయం మధ్య కనెక్టివిటీని బలోపేతం చేయడానికి ప్రధాన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయి. ప్రణాళిక చేయబడిన యాక్సెస్ నెట్‌వర్క్‌లో భాగంగా, అనకాపల్లి-ఆనందపురం ఎన్‌హెచ్-16 బైపాస్‌కు అనుసంధానించే నాలుగు కీలక రోడ్లు వేగంగా అభివృద్ధి చేయబడుతున్నాయి. వాటిలో రోడ్డు నం.5 (నేరెళ్లవలస- తల్లవలస, 3.83 కి.మీ), రోడ్డు నం.12 (సింహాచలం- సొంత్యం, 8 కి.మీ), రోడ్డు నం.14 (వేపగుంట- జుట్టాడ, 6.35 కి.మీ), మరియు రోడ్డు నం.15 (వేపగుంట- పినగాడి, 7.12 కి.మీ) ఉన్నాయి. ఈ కారిడార్లు పూర్తయిన తర్వాత విమానాశ్రయానికి కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడి, విశాఖపట్నం నగరవాసులకు ప్రయాణ సమయం సుమారు 45-50 నిమిషాలకు తగ్గుతుంది. రోడ్డు అభివృద్ధి పనులు సుమారు 98శాతం పూర్తయ్యాయి, ఈ రోడ్లు జూలై నాటికి అందుబాటులోకి వస్తాయని అంచనా.

**మెరుగైన రోడ్డు నెట్‌వర్క్:** ఈ రహదారులతో విజయనగరం, శ్రీకాకుళం వంటి పొరుగు జిల్లాల ప్రయాణికులకు కూడా ఉపయోగపడుతుంది. ఉత్తరాంధ్రలోని ఈ కొత్త విమానయాన కేంద్రానికి ప్రాంతీయ అందుబాటు మెరుగుపడుతుంది. సుస్థిర రవాణాను ప్రోత్సహించడానికి, చివరి మైలు కనెక్టివిటీ ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా నిజుఎనేబుల్ ట్రాన్సిట్ కారిడార్లు, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు కూడా ప్రణాళిక చేయబడుతున్నాయి. ఇవి సమర్థవంతమైన, పర్యావరణహిత ప్రయాణ ఎంపికలను అందిస్తాయి. విమానాశ్రయం యొక్క మొదటి దశ వార్షికంగా 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇందులో ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలు, అధునాతన కార్గో మౌలిక సదుపాయాలు, నిత్యావసర వస్తువుల కోసం కోల్డ్ చైన్ వ్యవస్థలు ఉంటాయి. సుస్థిర కార్యకలాపాలకు మద్దతుగా 5 ఎండబ్ల్యు సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్ కూడా ప్రణాళిక చేయబడిందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, విశాఖపట్నం ప్రపంచ స్థాయి పెట్టుబడులు, ఉపాధి కేంద్రంగా మారే దిశగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ఐటీ, ఉక్కు, ఫార్మాస్యూటికల్ వంటి రంగాల నుండి వచ్చిన భారీ పెట్టుబడులు ఈ ప్రాంత రూపురేఖలను మారుస్తూ, మన యువతకు లక్షలాది ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. గచ్చిబౌలి, హైదరాబాద్ ఐటీ కారిడార్ వంటి ప్రాంతాల అభివృద్ధిని శంషాబాద్ విమానాశ్రయం ఏ విధంగా వేగవంతం చేసిందో, అలాగే రాబోయే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక మలుపుగా (గేమ్‌ఛేంజర్‌గా) నిలవనుంది. ఇది మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయడంతో పాటు, ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షిస్తుంది. ప్రముఖ ఆర్థిక కేంద్రంగా విశాఖపట్నం స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. త్వరలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించబోతున్నామని కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం విజయనగరం విస్తృత ఉత్తరాంధ్ర ప్రాంతం వృద్ధి గమనాన్ని మార్చివేయబోతోంది. విజయనగరానికి కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ విమానాశ్రయం, అతుకులేని కారిడార్ యాక్సెస్, తగ్గిన ప్రయాణ రద్దీ, అప్‌గ్రేడ్ చేయబడిన రోడ్డు నెట్‌వర్క్‌లు మరియు రాబోయే ఈవి-ఎనేబుల్ రవాణా సేవలతో ప్రాంతీయ చలనశీలతను మెరుగుపరుస్తుంది." ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే జిల్లాలో పారిశ్రామిక పెట్టుబడులు, వాణిజ్య కార్యకలాపాలు, ఐటీ విస్తరణ, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఆకర్షిస్తోంది. కనెక్టివిటీకి మించి, భోగాపురం విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం మధ్య ఆర్థిక సమైక్యతను వేగవంతం చేస్తుంది. ఉత్తరాంధ్రను ఒక ప్రధాన వృద్ధి కారిడార్‌గా నిలబెడుతుంది. జి.సాంబ శివరావు, ఛైర్మన్ సీఐఐ ఆంధ్రప్రదేశ్ మరియు ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా మాట్లాడుతూ జీఎంఆర్ గ్రూప్ నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర మరియు విశాఖపట్నం ఆర్థిక వృద్ధికి ఒక పరివర్తనాత్మక చోదక శక్తిగా మారుతుంది. సైనిక నియంత్రణలో ఉన్న విమానాశ్రయం వల్ల ఏర్పడే స్లాట్ పరిమితులను అధిగమించి, ఇది 24/7 అంతర్జాతీయ కనెక్టివిటీని సులభతరం చేస్తుంది. ఎయిర్ కార్గో కార్యకలాపాలను బలోపేతం చేస్తుంది. అధునాతన ఎంఆర్‌ఓ సౌకర్యాలకు అవకాశాలు కల్పించి స్థానిక ఉపాధిని గణనీయంగా పెంచుతుంది. విమానాశ్రయం మాత్రమే కాకుండా, ఇది పర్యాటకం, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక ఎగుమతుల్లో ప్రాంతం తదుపరి దశ వృద్ధిని నడిపిస్తుంది. ఎంఎస్ఎంఇలను బలోపేతం చేస్తుంది. మహిళలకు ఎక్కువ ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.

## రెండేళ్ల కూటమి పాలనపై వైసిపి నిరసనలు

**• నందిగామలో ఆందోళనలో అపశృతి**




విజయవాడలో ఆందోళన చేస్తున్న వైకాంగ్రెస్‌పార్టీ శ్రేణులు

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపట్టింది. ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని, సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేసి ప్రజా సంక్షేమాన్ని పణంగా పెట్టిందని వైఎస్సార్‌సిపి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను 'వెన్నుపోటు పాలన'గా అభివర్ణిస్తూ వైఎస్సార్‌సిపి శ్రేణులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేశారని, రైతులు, మహిళలు, నిరుద్యోగులు మోసపోయారని మాజీ మంత్రులు, నాయకులు ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో వైఎస్సార్‌సిపి ఆందోళనలో చిన్న అపశృతి చోటు చేసుకుంది. వైఎస్సార్‌సిపి కార్యకర్తలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దున్నపోతును తీసుకొచ్చి నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ అరుణ్, మాజీ ఎమ్మెల్యే మొండితోక ఇంటి నుంచి దున్నపోతుతో ర్యాలీ వచ్చారు. ఈ ర్యాలీలో దున్నపోతు బెదిరి పొడవడంతో పలువురికి గాయాలయ్యాయి. ఆర్డీఓ కార్యాలయం వద్ద దున్నపోతుతో నిరసన చేస్తుండగా ఘటన చోటు చేసుకుంది. అయితే అతి ప్రయాసపై దున్నపోతును అదుపు చేసారు. దీంతో ఊపిరి పీల్చుకున్నారు.

**సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నుంచే అవినీతి మొదలు పెట్టారు: సజ్జల**

2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నుంచే కూటమి అరాచకాలకు పాల్పడుతోందని, వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. తాడేపల్లి వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను దగా చేశారని సజ్జల మండిపడ్డారు. ప్రజలకు హామీలిచ్చి వంచించడమే చంద్రబాబుకు తెలుసని ఎద్దేవా చేశారు. చంద్రబాబు జీవితాంతమంతా ప్రజలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఇదే లాస్ట్ టర్మ్ రాజకీయాలని జోస్యం చెప్పారు. అవినీతిలో కూటమి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు కూటమి పాలనతో విసిగిపోయారని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు చూస్తున్నారని సజ్జల వ్యాఖ్యానించారు.

## ఐటిఐ కళాశాల కమిటీ సభ్యుడు హుస్సేన్ దారుణహత్య

**• ప్రిన్సిపాల్ శేషయ్యకు తీవ్ర గాయాలు • ఆర్థిక వివాదాలే కారణం.. కమిటీ సమావేశంలో రక్తపాతం**



**చీరాల, జూన్ 12 ప్రభాతవార్త:** విద్యాబుద్ధులు నేర్పే ఐటీఐ కళాశాల కాస్తా పాతకక్షలు, ఆర్థిక వివాదాల నేపథ్యంలో రణరంగంగా మారింది. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలోని ఎస్.కె బొమ్మ నాయుడు మెమోరియల్ ఐటిఐ కళాశాలలో నిర్వహించిన కమిటీ సమావేశం దారుణ రక్తపాతానికి దారి తీసింది. మాజీ ప్రిన్సిపాల్ తన కుమారుడితో కలిసి ముందే ప్లాన్ ప్రకారం కత్తులతో బరితెగించి చేసిన దాడిలో కమిటీ సభ్యుడు హుస్సేన్ (60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా, ప్రస్తుత ప్రిన్సిపాల్ శేషయ్య తీవ్ర గాయాలతో మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ ఘోర హత్యోదంతం చీరాల పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేపింది.

**పదవి తొలగింపు.. ఆర్థిక వివాదాలు:** పోలీసుల సమాచారం ప్రకారం, ఈపురుపాలెంలోని ఐటిఐ కళాశాలలో గతంలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అబ్దుల్ సత్తార్‌ను యాజమాన్యం ఆ పదవి నుంచి తొలగించి, శేషయ్యకు నూతన బాధ్యతలు అప్పగించింది. అయితే అప్పటి నుండి కాలేజీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీల విషయంలో మాజీ ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్‌కు, కళాశాల కమిటీ సభ్యులకు మధ్య తీవ్ర వివాదం, పాతకక్షలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే కళాశాల భవిష్యత్తు, ఆర్థికాంశాలపై చర్చించేందుకు కమిటీ సభ్యులు అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌కు హాజరైన మాజీ ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్ కమిటీ సభ్యులతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. మాట మాట పెరిగి ఘర్షణ తీవ్రం కావడంతో అబ్దుల్ సత్తార్ తన కుమారుడు జిలానితో కలిసి ముందే దాచి ఉంచిన కత్తితో కమిటీ సభ్యులపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. హాల్లో ఉన్నవారంతా భయంతో పరుగులు తీస్తుండగా కమిటీ మెంబర్ హుస్సేన్‌ను, ప్రిన్సిపాల్ శేషయ్యలపై నిందితులు ఇద్దరూ విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు.

**చికిత్స పొందుతూ మృతి:** రక్తమడుగులో పడివున్న బాధితులను స్థానికులు, సిబ్బంది కలిసి చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర రక్తస్రావం కావడంతో కమిటీ సభ్యుడు హుస్సేన్(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ప్రిన్సిపాల్ శేషయ్య తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న చీరాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘాతుకానికి ఒడిగట్టి పరారైన మాజీ ప్రిన్సిపాల్ అబ్దుల్ సత్తార్, అతని కుమారుడు జిలానిల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## ప్రాణాలు తీసిన వివాహిత సంబంధం

**• పురుగులు మందు తాగి ఆత్మహత్య • వివాహిత లీలావతి, చిన్నారి మృతి • మహేష్ పరిస్థితి విషమం**

**హాలహర్వి, జూన్ 12 ప్రభాతవార్త;** వివాహిత సంబంధం ప్రాణాలు తీసింది. వివరాల్లోకి వెళితే... హాలహర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గూళ్యం గ్రామానికి చెందిన మహేష్(46) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా వణేనూరు గ్రామంలో గత ఐదు సంవత్సరాల క్రితం ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఆ యువతితో కొన్ని రోజులు కాపురం చేసి విడాకులు తీసుకున్నాడు. తరువాత కర్ణాటక బళ్లారి జిల్లా సంగనకల్లు గ్రామంలో ఓ వికలాంగురాలితో రెండో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి చేసుకుని సంగనకల్లు గ్రామంలోనే స్థిరపడ్డాడు. అయితే అదే గ్రామంలో లీలావతి(35) అనే వివాహితతో పరిచయం పెరిగింది. ఆ పరిచయం వివాహిత సంబంధానికి దారితీసింది. ఇలా కొన్ని రోజులపాటు లీలావతి, మహేష్ మధ్య వివాహిత సంబంధం కొనసాగింది. ఈ విషయం లీలావతి భర్తకు తెలియడంతో పలుమార్లు లీలావతి భర్త దండించాడు. ఈ విషయాన్ని లీలావతి తన ప్రియుడు మహేష్‌తో చెప్పింది. తమ ప్రేమకు భర్త అడ్డువస్తున్నాడని లీలావతి, మహేష్ నాలుగు నెలల చిన్నారిని తీసుకుని నాలుగు రోజుల క్రితం గూళ్యం గ్రామానికి వచ్చారు. గూళ్యం గ్రామంలో వారిని ఎవరూ చేరదీయకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున గ్రామశివారులో ఉండే వంకలో లీలావతి, మహేష్, నాలుగు నెలల చిన్నారితో పాటు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలో లీలావతి నాలుగు నెలల చిన్నారి అక్కడికక్కడే మృతిచెందారు. మహేష్ కొన ఊపిరితో ఉన్నాడు. పొలం పనులకు వెళ్లిన రైతులు చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న హాలహర్వి ఎస్ఐ ఈశ్వరరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకున్నారు. మృతిచెందిన లీలావతిని నాలుగు నెలల చిన్నారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

## జులై 11, 12న సాహిత్య సమ్మేళనం

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె), సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యాన జులై 11, 12 తేదీల్లో సాహిత్య సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మీడియా సమావేశంలో సాహితీ స్రవంతి బాధ్యులు సత్యాజీ, వొరప్రసాద్, ఎంబివికె ప్రతినిధులు గుండు నారాయణరావు, కె.స్వరూపరాణి, టి.క్రాంతి పాల్గొని కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ సమ్మేళనంలో యువ కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొన వలసిందిగా కోరారు. రచయితలు సమాజానికి నిజమైన అభివృద్ధి దిశను చూపించాలి. రచయితలు సృజించే సాహిత్యాన్ని చదవడం ద్వారా ప్రజలు సంస్కారం, మానవీయ విలువలను అలవర్చుకుంటారు. ఈ వర్క్‌షాప్‌ను అనుభవం ఉన్న ప్రముఖులు, వర్తమాన రచయితల మేళవింపుగా నిర్వహిస్తున్నాం. తెలుగు కవులు, రచయితలు ఎక్కడివారైనా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని తమ ఆలోచనలు, అనుభవాల ద్వారా ప్రజోపయోగ కరమైన సాహిత్య సృజనకు దోహదకారులు కావాలి అని కోరారు. ఈసందర్భంగా సాహిత్య సమ్మేళనం పోస్టరును విడుదల చేశారు.

## సైన్స్ సిటీ ఆఫ్ ఎపి నిర్వాహక కమిటీ ఏర్పాటు

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో సైన్స్ సిటీ ఆఫ్ ఎపి నిర్వాహక కమిటీని పునర్ వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మౌలిక సదుపాయాలు పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన కమిటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సభ్య కన్వీనర్‌గా సైన్స్ సిటీ ఆఫ్ ఎపి సిఇఒ వ్యవహరించనున్నారు.

## అమెరికా దాడిలో విశాఖ వాసి మరణించడంపై సిఎం చంద్రబాబు విచారం

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికా క్షిపణి దాడితో విశాఖకు చెందిన చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేష్ మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తంచేశారు. సురేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సిఎం ఆదేశించారు. సురేష్ మృతదేహాన్ని స్వదేశానికి తెచ్చేందుకు భారత రాయబార కార్యాలయం, ఒమన్ అధికారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎపి భవన్ ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. ఒమన్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం, ఎంబసితో ఎపి భవన్ నిరంతరం సంప్రదింపులు చేస్తోంది. ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్‌పై క్షిపణి దాడి జరగ్గా సురేష్ మృతి చెందినట్టు గుర్తించారు. సురేష్ ప్రయాణిస్తున్న నౌక ప్రస్తుతం ఒమన్ తీరానికి 30 నాటికల్ మైళ్ల దూరంలో నిలిచిపోయినట్టు సమాచారం. నౌకను ఒడ్డుకు తీసుకురావడానికి ఒమన్ అధికారులు చర్యలు చేపట్టారు. నౌక ఈ అర్ధరాత్రికి పోర్టుకు చేరుకునే అవకాశం ఉంది. అధికారిక గుర్తింపు అనంతరం భారత దేశానికి తరలించనున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదారుల సామాజిక హోదా గమనించండి

**- డిజిపికి డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు**

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో ఎవరైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేస్తే, సదరు ఫిర్యాదుదారుడి ఎస్సీ హోదాను తప్పనిసరిగా పరిశీలించాలని డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు డిజిపిని కోరారు. ఈ మేరకు ఆయన డిజిపికి ఒక లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలకు దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకే ఈ చర్యలు అవసరమని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన ఒక తీర్పును రఘురామ తన లేఖలో ప్రస్తావించారు. ఆ తీర్పు ప్రకారం క్రైస్తవ మతంలోకి మారిన వారు ఎస్సీ హోదాను కోల్పోతారని, వారికి అట్రాసిటీ చట్టం కింద ఎలాంటి హక్కులు వర్తించవని ఆయన గుర్తు చేశారు. అందువల్ల అట్రాసిటీ చట్టం కింద ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు, ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు గానీ, లేదా నమోదు చేసిన వెంటనే గానీ ఫిర్యాదుదారుడి కుల హోదాను క్షుణ్ణంగా ధ్రువీకరించుకోవాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మతం మారి ఎస్సీ హోదా కోల్పోయిన వారి నుంచి అట్రాసిటీ కేసులను స్వీకరించకుండా చూడాలని రఘురామ డిజిపిని కోరారు.

## ఎపి కళాకారులకు కేంద్ర పురస్కారాలు

**గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందనలు**



**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాలను పొందిన రాష్ట్ర కళాకారులకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అభినందనలు తెలిపారు. సంగీత నాటక అకాడమీ నుంచి ప్రతిష్టాత్మక అకాడమీ రత్న ఫెలోషిప్ అవార్డును పొందిన కూచిపూడి గురువు పసుమర్తి రత్తయ్య శర్మకు ఆరంగంలో విశేష కృషి చేశారన్నారు. బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అందుకున్న వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్, పసుమర్తి పావనిలు నేటి తరం సంప్రదాయ కళారూపాలపైనా వాటి సాధనలోనూ ఎటువంటి పరిశ్రమ చేస్తున్నారనడానికి వారికి లభించిన గుర్తింపు తేటతెల్లం చేస్తోందన్నారు. పురాతనమైన తోలుబొమ్మలాట కళా రూపం పరిరక్షణకు సంగీత నాటక అకాడమీ అవార్డును గెలుచుకున్న విద్వాంసులు సింధే చిదంబర రావు మంచి కళాకారుడిగా గుర్తింపు పొందారని ప్రశంసించారు. తెలుగు పద్య నాటక రంగంలో కృషికి గాను, నటన విభాగంలో ప్రతిష్టాత్మక సంగీత నాటక అకాడమీ అవార్డును గెలుచుకున్న ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ రాష్ట్రానికికే గర్వకారణంగా నిలిచారని గవర్నర్ కొనియాడారు. గోపాలకృష్ణ తెలుగు పద్య నాటక రంగంలో నిష్ణాతులని, శాస్త్రీయ నాటక సంప్రదాయాన్ని ప్రోత్సహించడానికి, పరిరక్షించడానికి ఆయన చేసిన కృషికి ఈ అవార్డు ఒక గుర్తింపు అని గవర్నర్ అన్నారు.

## అగ్రిగోల్డ్ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట కల్పించింది. అగ్రిగోల్డ్ కేసులతో పాటుగా డిపాజిటర్ల కేసుల్ని విచారణ చేసేందుకు ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సంబంధించి కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్పెషల్ కోర్టు కోసం 21 పోస్టులు, నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టుల్లో జిల్లా జడ్జి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సహా పలు పోస్టులు ఉన్నాయి. కోర్టుకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.5లక్షలు.. కోర్టులో లైబ్రరీ, ఫర్నీచర్ కోసం రూ.10 లక్షలు కేటాయించారు. ఈ స్పెషల్ కోర్టులో అగ్రిగోల్డ్ కేసులతో పాటుగా ఎపి డిపాజిటర్ల రక్షణ చట్టం కింద నమోదైన కేసుల్ని విచారణ చేస్తారు. విజయవాడలో కోర్టును ఏర్పాటు చేయనున్నారు.

## డిఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై న్యాయ విచారణ జరిపించాలి

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**



**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా నియామకాలపై తీవ్రమైన ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వారి సర్టిఫికేట్లను బహిరంగ పర్చాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు.

స్పోర్ట్స్ కోటా ఎంపికకు రూపొందించిన జివోలు, వాటి అమలు తీరుపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి స్పందించాలి. విడివిడిగా జరగాల్సిన డిఎస్సీ ప్రశ్నాపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ ఒకే డైరెక్టర్‌కి ఎందుకు అప్పగించారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. ఈ అంశాలపై ప్రభుత్వ అధికారులు వివరణ ఇచ్చిన ప్రతిసారీ మరికొన్ని సందేహాలు తలెత్తుతున్నాయి.

అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో పాల్గొన్న క్రీడా కారుల్లో కొద్దిమంది స్పోర్ట్స్ కోటాకు ఎంపిక కాకపోవడం అనేక అనుమానాలకు తావునిస్తు న్నది. డిఎస్సీ ఉద్యోగ నియామకాలలో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా జరిపేందుకు న్యాయవిచారణకు ఆదేశించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ(యం) కోరుతుందన్నారు.

## ఏం చేశారని విజయోత్సవ సభ

**పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల**



**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సుపరిపాలన సాగుతోందని, అభివృద్ధి, సంక్షేమం పేరిట విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోండి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. తిరుపతిలో కూటమి ప్రభుత్వం విజయోత్సవ సభ నిర్వహించడంపై ఆమె ఆగ్రహం వ్యం చేశారు. విజయోత్సవ సభలో అన్నీ అబద్దాలే చెప్పారని మండిపడ్డారు. మొత్తం ఆరు గ్యారంటీలను ఇప్పటివరకూ అమలు చేయలేదని ఆరోపించారు. సూపర్ సిక్స్‌ను సూపర్ ఫ్లాప్ చేసి, సూపర్ హిట్ అని చెప్పుకోవడం చంద్రబాబుకే సాధ్యం. చేసిన వాగ్దాలను విలువలేదు మేనిఫెస్టో 143 హామీల అమలుకు అతి గతి లేదు. మెగా డిఎస్సీ దగా డిఎస్సీ చేసి, జాబ్ క్యాలెండర్‌ను జాబులు లేని క్యాలెండర్‌గా మార్చారు అని షర్మిల వ్యాఖ్యానించారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఉన్న పెన్షన్లనే ఊడపీకారు. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని మోసం చేశారు. పేదలకు రెండే లేదా మూడు సెంట్ల భూమి ఇస్తామని మాట తప్పారు. పక్కా ఇండ్లు కట్టిస్తామన్న హామీని తుంగలో తొక్కారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీల సంక్షేమాన్ని అటెక్కించారు. కౌలురైతులకు కౌలు కార్డులు దిక్కులేదు. ధరల స్థిరీకరణ అమలు జరగలేదు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పరికరాలు అందలేదు. చివరికి రైతు పండించిన పట నేలపాలైతే పరిహారంలో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్టులకు ముట్టుకోలేదు. 30శాతం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని 15 వేల కోట్ల ఛార్జీల భారాన్ని మోపారు. ఫీజు రీయింబర్స్ కొనసాగిస్తామని 7వేల కోట్ల బకాయిలు పెట్టారు. ఆరోగ్యశ్రీకి 3 వేల కోట్ల బకాయిలు ఇవ్వడానికి మనసు రావడం లేదు అని షర్మిల ఆరోపించారు.

విభజన హామీలను విస్మరించి, కేంద్రం నుంచి దక్కాల్సిన నిధులపై మాట మాట్లాడకుండా ప్రధాని మోడీ భజన చేస్తూ, మతాల మధ్య విభజన తెస్తూ, క్రిస్టియన్ మైనారిటీల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసి, రాష్ట్రాన్ని ఏమో రూ.3.50 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేసిన పెట్టిన కూటమి రెండేళ్ల పాలన రాష్ట్రానికి పట్టిన మరో దౌర్భాగ్యం అని షర్మిల విమర్శించారు.

## కేశినేని బ్రదర్స్ మధ్య ముదిరిన విభేదాలు

**- విజయవాడ ఎంపి చిన్నిపై ఇడికి నాని ఫిర్యాదు**





**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడల రాజకీయాల్లో కేశినేని సోదరుల మధ్య విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎంపి కేశినేని నాని తన సోదరుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు, వ్యాపార భాగస్వాములపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు లేఖ రాశారు. తన ఫిర్యాదులో ఎంపి చిన్ని, ఆయన భార్య జానకి లక్ష్మి కుమారుడు వెంకట్ చౌదరి, రాజ్ కెసిరెడ్డి సహా వారి నెట్‌వర్క్‌కు సంబంధించిన పలు అంశాలపై విచారణ జరపాలని నాని కోరారు. ముఖ్యంగా లిక్కర్ స్కామ్‌కేసులో రాజ్ కెసిరెడ్డి అరెస్టు, జానకి లక్ష్మికి జారీ చేసిన సమన్లు నేపథ్యంలో దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నా యంటూ ఆయన ఆరోపించారు. టికెట్ కేటాయింపులో అవినీతి జరిగిందని టిడిపి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన ఆరోపణలను కూడా దర్యాప్తులో భాగం చేయాలని నాని కోరారు. టికెట్ కోసం రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేశారనే ఆరోపణలతో పాటు, సుంకర రామచంద్రారావు మరియు బొల్లినేని మోహన్‌రావు ఖాతాలకు జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి కేశినేని డెవలపర్స్ చేపట్టి దుండిగల్, కర్తానూర్ - పటాంచేరుకు, గచ్చిబౌలి, బంజారాహిల్స్ శంకరపల్లి ప్రాంతాల ప్రాజెక్టులో ప్రి లాంచ్ దశలోనే భారీ మొత్తాలు వసూలు చేసి కొనుగోలుదారులను మోసం చేశారంటూ నాని ఆరోపించారు. అలాగే సహితి ఇన్‌ఫ్రా స్కామ్‌తో సంబంధాలపై కూడా దర్యాప్తు జరపాలని కోరారు.

## చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనను నిరసిస్తూ కాకాణి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




**ముత్తుకూరు (నెల్లూరు), జూన్ 12 ప్రభాతవార్త:** ముత్తుకూరు మండల కేంద్రంలో చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటు పాలనను నిరసిస్తూ మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం సెంటర్ వరకు, చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, సర్వేపల్లి పరిశీలకులు వీరి చలపతి, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ మెట్టా విష్ణు వర్ధన్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని శాలువాలతో సత్కరించి, గజమాలతో స్వాగతం పలికారు. డీఎస్సీలో జరిగిన అవకతవకలకు నిరసనగా కాకాణి గోవర్ధన్ రెడ్డి, పూజితమ్మ, విష్ణువర్ధన్ రెడ్డి, నిరుద్యోగులు, యువతతో కలిసి డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులకు నిప్పంటించి, తగులబెట్టారు.

# తాడిపత్రిలో రాజకీయ రగడ

**• మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలి • పోలీస్ స్టేషన్ వద్ద జెసి ప్రభాకర్‌రెడ్డి బైఠాయింపు • స్టేషన్ గేటు వద్ద మంచం వేసుకుని జెసి నిరసన**

**తాడిపత్రి అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయ రగడ తారాస్థాయికి చేరింది. వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టిడిపి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుటే మంచం వేసుకుని స్నానం చేసి దాదాపు 6 గంటల పాటు నిరసనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు కాపాడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేయడంతో జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆందోళన విరమించారు. రెండు రోజుల క్రితం జరిగిన వైఎస్ఆర్‌సిపి సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు, నాయకులపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. టిడిపి కౌన్సిలర్లను అవమానించేలా మాట్లాడటమే కాకుండా, హైకోర్టు విధించిన ఆంక్షలను సైతం ఉల్లంఘించారని ఆరోపిస్తూ జె.సి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు చేసినప్పటికీ కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జె.సి ప్రభాకర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్ ఎదుటే మంచం వేసుకుని నిరసన ప్రారంభించారు. సాధారణ వ్యక్తి అయితే వెంటనే కేసు నమోదు చేసే పోలీసులు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని, చట్టం అందరికీ ఒకటే కాదా అని పోలీసులను ప్రశ్నించారు. కేతిరెడ్డిని రాజకీయంగా కాపాడేందుకే కేసు నమోదు చేయడం లేదని ఆరోపణలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేసు నమోదు చేసే వరకు పోరాటం ఆగదని టిడిపి శ్రేణులు స్పష్టం చేశాయి. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై చర్యలు తీసుకోవాలని జె.సి ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన నిరసనతో తాడిపత్రి రాజకీయాలు మరోసారి హీటెక్కాయి. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేతిరెడ్డి పెద్దారెడ్డి హైకోర్టు ఆదేశాలను పాటించకుండా తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నా పోలీసులు మిన్నకుండి పోతున్నారన్నారు. తాము ప్రజాస్వామ్య పద్ధతిలో వెళుతున్నా పోలీసులు అప్పుడు ఇప్పుడు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డిపై బిఎన్ఎస్ యాక్ట్ 196 (1) సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి జె.సి ప్రభాకర్‌రెడ్డికి అందజేసిన తరువాత ఆయన తన అనుచరులతో కలిసి ఇంటికి వెళ్ళిపోయారు.



టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మంచం వేసుకుని నిరసన తెలుపుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

# వెన్నుపోటు నిరసనకు పోలీసుల పోటు

**• తాడిపత్రికి వేలాదిగా తరలివచ్చిన వైకాపా శ్రేణులు • పెద్దారెడ్డి నిరసన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు • ఉన్నత న్యాయస్థానం ఊరటకు పోలీసుల అడ్డుకట్ట**

**తాడిపత్రి, జూన్ 12 ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో తాడిపత్రిలో శుక్రవారం తలపెట్టిన చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమానికి పోలీసుల పోటు తప్పలేదు. రెండేళ్ల తర్వాత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వేచ్ఛగా నియోజకవర్గంలో తిరగొచ్చనే హైకోర్టు తీర్పుతో వైకాపా శ్రేణుల్లో నూతనోత్సాహం పెల్లుబికింది. దీంతో నియోజక వర్గం నలుమూలల నుంచి వేలాది మంది వైకాపా నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయాన్నే భగత్‌సింగ్ నగర్‌లోని పెద్దారెడ్డి ఇంటికి చేరు కున్నారు. నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీగా నిరసన వ్యక్తం చేస్తూ పెద్దారెడ్డి తన ఇంటి వద్ద నుంచి వైయస్సార్ సర్కిల్‌కు బయలు దేరారు. ఇంతో సిఐ శివగంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున పోలీసులు పెద్దారెడ్డి ఇంటికి చేరుకొని అనుమతి లేదంటూ ర్యాలీని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పెద్దారెడ్డి సారథ్యంలో నాయకులు, కార్యకర్తలకు పోలీసులకు నడుమ తోపులాట చోటు చేసుకుంది. ప్రభుత్వ, పోలీసు వ్యతిరేక నినాదాలతో పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి.

పోలీసుల చర్యలకు నిరసనగా అడ్డుకున్న చోటనే పెద్దారెడ్డి నిరసనకు దిగి బైఠాయించారు. కొద్ది సేపటి తరువాత పెద్దారెడ్డిని పోలీసులు అనంతపురానికి తరలించారు. అనంతపురానికి చేరుకున్న తరువాత ఆయన జిల్లా నాయకులతో కలసి పోలీసు హెడ్ క్వార్టర్స్ ముంగిట ఆందోళనకు దిగారు. వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌తో కలసి కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎస్పీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పేరం స్వర్ణలత, వెన్నపూస వెంకట్రామిరెడ్డి, బోగాతి బ్రహ్మానందరెడ్డి, సజ్జలదిన్నె రాజు, ఆలూరు రామేశ్వరరెడ్డి, ఎద్దుల శరభారెడ్డి, ఆర్సీ ఓబుళరెడ్డి, వేమనాథరెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెద్దపేట లక్ష్మీదేవి, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దారెడ్డిపై కేసు నమోదు:** వైకాపా నాయకులతో ఈ నెల 9న తాడిపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదు మేరకు శుక్రవారం పట్టణ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. రాష్ట్ర టిఎన్‌టియుసి నాయకుడు పరిమి సోమశేఖర్ నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు 196(1) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. పెద్దారెడ్డిపై కేసు నమోదు చేసిన సిఐ ఆరోహణరావు ఎఫ్ఐఆర్‌ను అందించిన తరువాతనే మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి పోలీసు స్టేషన్ ఎదుట చేపట్టిన ఆందోళనను విరమించారు.



పోలీసుల చర్యలకు నిరసనగా బైఠాయించిన పెద్దారెడ్డి

# టిటిడి ఉద్యోగుల గృహ స్థలాల కేటాయింపు

**• జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమీక్ష • పెండింగ్ సమస్యలపై చర్చ**

**తిరుపతి, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఉద్యోగులకు గృహ స్థలాల కేటాయింపునకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, కమిటీ సభ్యులు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డితో శుక్రవారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

వడమాలపేట మండలం పాదిరేడు అరణ్య ప్రాంతం, ఏర్పేడు మండలం పల్లం గ్రామంలో టిటిడి ఉద్యోగులకు గృహ స్థలాల కేటాయింపుకు సంబంధించి తలెత్తిన సమస్యలు, పెండింగ్ అంశాలు, భూసంబంధిత పరిపాలనా అంశాలపై రెవెన్యూ శాఖ అధికారులు, టిటిడి అధికారులు, బోర్డు సభ్యులతో కలిసి సమగ్రంగా చర్చించారు. టిటిడి ఉద్యోగుల ప్రతినిధులు తమ సమస్యలను, గృహ స్థలాల కేటాయింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు.

ఉద్యోగులు వ్యక్తం చేసిన సమస్యలను సానుకూలంగా పరిశీలించి, చట్టబద్ధమైన పరిధిలో వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. గృహ స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పరిపాలనా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే పెండింగ్ అంశాల పరిష్కారానికి సమన్వయంతో పనిచేసి, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.



# బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

**• ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా**




బాలకార్మిక నిర్మూలన అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త:** బడిఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలని ఈదిశగా అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మికశాఖ, వాసవ్య మహిళామండలి, మహిళా శిశుసంక్షేమశాఖ, ఫోరంఫర్ చైల్డ్‌రైట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విజయవాడ భవానిపురంలోని పున్నమిఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అవగాహన పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించి, అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ బాల్యంలో ఆటపాటలతో విద్యనేర్చుకోవాల్సిన చిన్నారులు బాలకార్మికవ్యవస్థ కారణంగా వారి హక్కులను కోల్పోవటమే కాకుండా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాల్సిన వీరు తమ బంగారు జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించటం సమాజంలో ప్రతిఒక్క పౌరుడు తమ బాధ్యతగా గుర్తించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే సంబందిత అధికారులకు తెలియచేయాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమీషనర్ జి.ధనలక్ష్మీ, ఐసిడిఎస్ పిడి రుక్సానా సుల్తానాబేగం, ఫోరంఫర్‌చైల్డ్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్, నగరపాలకసంస్థ అదనపు కమీషనర్ చంద్రశేఖర్, పొల్యూషన్‌బోర్డు ఈఈ శ్రీనివాసరావు, పరిశ్రమలశాఖ జిల్లామేనేజర్ యం.మధు తదితరులు పాల్గొన్నారు.

# 17న దుర్గమ్మ గుడిలో ఉచితంగా సామూహిక అక్షరాభ్యాసాలు

**ఇంద్రకీలాద్రి, జూన్ 12 ప్రభాతవార్త:** విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ఈనెల 17న నిజ జేష్ఠమాస తదియ తిథినాడు 250 మందికి ఉచితంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. మహా మండపంలోని 6వ అంతస్తులో నిర్వహిస్తున్న అక్షరాభ్యాసాలు పూర్తయిన తరువాత ఆయా పిల్లలు, తల్లిదండ్రులకు రు.300 క్యూలైన్లో ఉచిత దర్శనము, పులిహోరం, శ్రీ అమ్మవారి శక్తికంకణం, రాత పలక, బలపము, పాకెట్ సైజ్ ఫొటో, చక్కెర పొంగలి ప్రసాదంగా అందిస్తామన్నారు. ఆసక్తులు 5 సం. లోపు వయస్సున్న పిల్లల వివరాలతో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌ల ద్వారా ఈనెల 14 నుండి రిజర్వేషన్లు చేసుకుని ఆ టికెట్‌ను అక్షరాభ్యాసం రోజున తీసుకుని వచ్చి పాల్గొన వచ్చున్నారు.

**దుర్గమ్మ సేవలో కలెక్టర్, సిపిలు:** దుర్గమ్మని శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా దంపతులు, సిపి రాజశేఖర్ బాబు దంపతులు దర్శించుకున్నారు. వారికి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనానాయక్‌లు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**పోటెత్తిన భక్తులు:** దుర్గమ్మ ఆలయంలో శ్రీ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం, వేసవి సెలవుల సందర్భంగా పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులకు సౌకర్యవంతంగా దర్శనమయ్యేలా ఇఒ చర్యలు తీసుకున్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పిల్లలకు పాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు.

**నిత్యాన్నదాన పథకానికి భారీ విరాళం:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన బబ్బూరి సుబ్బారావు దంపతులు వారి కుటుంబసభ్యులతో కలిసి రు.9 లక్షల విరాళమందించారు.

విజయవాడకు చెందిన ఎం శ్రీనివాసరావు రు.1 లక్ష విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. మరోదాత విజయవాడకు చెందిన సాదు వెంకట సుబ్బారావు గుప్తా దంపతులు రు.1,11,111ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు.

ఆయా దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



క్యూలైన్లలో భక్తుల రద్దీ

## యోగ సాధన ఎంతో ప్రయోజనం

**విజయవాడ, జూన్ 12 ప్రభాతవార్త:** అనునిత్యం యోగసాధన చేయటం వల్ల మనసుకు, శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విజయవాడ బెరంపార్కు ఆవరణలో శుక్రవారం నిర్వహించి యోగశిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేసారు.

ఈసందర్భంగా యోగసాధన వల్ల కలిగే ప్రయోజనాలను కలెక్టర్ వివరిస్తూ ప్రతిరోజూ 45 నిముషాలపాటు యోగసాధన చేయటం వల్ల మనసుకు ప్రశాంతత లభించటమే కాకుండా శరీరం ఉత్తేజితమవుతుందన్నారు. రోజూ యోగసాధన చేయటం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు.

ప్రతిఒక్కరూ యోగసాధన చేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆయుష్ జిల్లానోడల్ అధికారి డాక్టర్ ప్రియదర్శిని, నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ చంద్రశేఖర్, సెయింట్ ఆన్స్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా లబ్ధి

**తిరుపతి, జూన్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రెండేళ్ళ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి సదస్సులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా తాను పొందిన లబ్ధిని, తన అనుభవాన్ని ఉష ఈ సందర్భంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో తనకు కలిగిన మేలును చంద్రబాబు అనే రైతు చెప్పారు. తన ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం నిధులు తన ఖాతాలో జమ అయ్యాయని, చక్కగా చదువుకుంటున్నారని తల్లికి వందనం లబ్ధిదారు పులిచర్ల నాగమ్మ సంతోషంగా చెప్పారు. తనకు కూటమి ప్రభుత్వం ఇల్లు ఇచ్చిందని నాగమ్మ సభా వేదికగా వెల్లడించింది. రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. రెండేళ్ళ కాలంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలు, ప్రాంతాల వారీగా జరిగిన అభివృద్ధిని అద్దం పట్టేలా వీడియోను రూపొందించారు. కేంద్రం అందించిన సాయాన్ని, ప్రధాని మోడీ అందిస్తోన్న సహకారాన్ని వివరిస్తూ వీడియోను ప్రజెంట్ చేశారు. స్వర్ణాంధ్ర సాధన దిశగా సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఎలా పని చేస్తున్నారనే విషయాలను క్రోడీకరిస్తూ వీడియో రూపకల్పన చేశారు.

# గంజాయి కూపంలో అందాల మోడల్!

**బ్యాంకాక్ నుంచి తరలిస్తూ ముంబయిలో పట్టుబడిన వైనం**

**గంజాయి విలువ రూ. 11 కోట్లుపైనే**



ముంబయిలో గంజాయితో అధికారులకు పట్టుబడిన మోడల్ హర్షసన్నీ

**హైదరాబాద్ జూన్ 12, ప్రభాతవార్త:** మోడలింగ్‌లో రాణిస్తూ, కేరళ అందాల పోటీల్లో కిరీటం అందుకున్న ఓ యువతి గంజాయి స్మగ్లింగ్ బ్యాచ్ తో చేతులు కలిపి బ్యాంకాక్ నుంచి 11.82 కోట్ల విలువ చేసే నాణ్యమైన ఓజి గంజాయి తరలిస్తూ ముంబయి విమానాశ్ర యంలో కస్టమ్స్ అధికారులకు దొరికిపోయింది. ఈ ఘటన కేరళలో సంచలనం రేపింది. వివరాలు ఇలావున్నాయి. బ్యాంకాక్‌లో భారత్‌కు చెందిన కొందరు బడా స్మగ్లరు ఏకంగా ఓజిను సాగుచేస్తున్న విషయాన్ని ఈగల్ పోలీసులు రట్టు చేసి దీనిపై ఎన్‌సిఆర్‌బికి సమాచారం ఇచ్చారు. ఈ స్మగ్లర్ల ముఠాలో కేరళకు చెందిన ఓ స్మగ్లర్ హైదరాబాద్‌కు చెందిన మహిళా జూనియర్ ఆర్టిస్టు సూరికళతో ఓజిని తరలించగా శంషాబాద్ విమానాశ్రయంలో దొరికిపోవడం తెలిసిందే. ఈ ముఠాలో మరి కొందరు వున్నట్లు అందిన సమాచారంపై విమానాశ్రయాల్లో కస్టమ్స్ అధికారులు నిఘా వుంచారు. ఈ క్రమంలో కేరళకు చెందిన హర్ష సన్నీ (28) శుక్రవారం ఉదయం ముంబాయి విమా నాశ్రయంలో ఓజి తరలిస్తూ పట్టుబడింది. కేరళలో జరిగిన అనేక అందాల పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా అందుకుని. మిసెస్ కేరళ పోటీలో కూడా సన్నీ పాల్గొంది.

కాగా ఇటీవల బ్యాంకాక్ వెళ్లిన సన్నీ అక్కడ గంజాయి బ్యాచ్‌తో చేతులు కలిపిందని సమాచారం రాగా ఆమెపై నిఘా వుంచారు. శుక్రవారం ఉదయం ముంబ యిలోని ఛత్రపతి శివాజి మహారాజ్ అంత ర్జాతీయ విమానాశ్రయంలో సన్నీ దిగింది. అయితే లగేజి క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తనపై కస్టమ్స్ అ ధికారులకు అనుమానం వచ్చింది. దీంతో కస్టమ్స్ అధికారులు ఆమెను పక్కకు పిలిచి ఆమె వద్ద వున్న ట్రావెల్ బ్యాగ్‌తో పాటు ఇతర లగేజిని క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఒక బ్యాగులో చిన్నపాటి 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి.

వాటిలో పచ్చటి పదార్థం వుంది. దీంతో కస్టమ్స్ అధి కారులకు అనుమానం వచ్చి ఎన్‌డిపిఎస్ కిట్‌తో వాటిని పరీక్షించగా అత్యంత ఖరీదైన నాణ్యమైన హైడ్రోపోనిక్ మారిజువానా (ఓజి)గా తేలింది. ఈ ఓజి గంజాయి 11 కిలోలు బరువు వుంది. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్లో 11.82 కోట్ల రూపాయలుగా తేలింది. దీంతో కస్టమ్స్ అధి కారులు సన్నీని అరెస్టు చేసి ఆమెపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలిం చారు. సన్నీ అరెస్టు విషయాన్ని కస్టమ్స్ అధికా రులు తెలంగాణ ఈగల్ పోలీసులతోపాటు కేంద్ర ఎన్‌డిపిఎస్‌కు సమాచారం అందించారు. కాగా సన్నీని మరింతగా విచారించేందుకు కస్టమ్స్ అధికారులు కస్టడీలోకి తీసుకునే వీలుంది.

# ఈగల్ పోలీసులకు పట్టుబడిన అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్లు

**రూ.50 లక్షల మెపెడ్రోన్ పట్టివేత**

**హైదరాబాద్ జూన్ 12, ప్రభాతవార్త:** ఈగల్ పోలీసులకు మరో ఇద్దరు అంతర్జాతీయ సింథటిక్ డ్రగ్ స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వీ రి వద్ద నుంచి 50 లక్షల రూపాయల ఖరీదు చేసే 750 గ్రాముల మెపెడ్రోన్ డ్రగ్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డై రక్టర్ సందీప్ శాండిల్యా శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సూర్యాపేట్ జిల్లాకు చెందిన మత్స్యగిరి కేసరి (38), భువనగిరి జిల్లా మోత్కూ రుకు చెందిన నిమ్మల నరేష్ (38)లు 2015 నుంచి సింథటిక్ డ్రగ్స్‌ను దేశ వ్యాప్తంగా అనేక నగరాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు. వీరి ముఠాలో గుజరాత్‌కు చెందిన సంతోష్ సింగ్, విజయ్, అశ్విని పాఠక్, ఫయాజ్ అనే స్మగ్లర్లు వున్నారు. తమ వ్యాపారం కోసం కేసరి 2015లో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాచారంలో సాయి కెమికల్స్ అనే కంపెనీలో కెమిస్ట్‌గా చేరి ఏడాది పాటు పనిచేసి సింథటిక్ డ్రగ్స్ తయారీలో ప్రావిణ్యం సం పాదించాడు. ఈ సమయంలోనే గుజరాత్‌కు చెందిన సంతోష్ సింగ్, విజయ్, అశ్విని పాఠక్, ఫయాజ్‌లు కేసరితో చేతులు కలిపి మెపెడ్రోన్ డ్ర గ్ తయారు చేయడంపై పరిజ్ఞానం సంపాదించాడు. కాగా 2017లో విజయ్, సంతోష్‌లు మధ్యప్రదేశ్‌లో అరెస్టవగా బెయిలుపై వచ్చి మళ్లీ డ్రగ్స్ తయారు చేయసాగారు. దీని తరువాత పలు రాష్ట్రాల్లో ఈ ముఠా సభ్యులు పట్టుబడ్డారు.

తాజాగా కేసరి, నిమ్మల నరేష్‌లు అబ్దుల్లాపూర్ మెట్ వద్ద సొంతంగా ఒక కెమికల్ ఫ్యాక్టరీని స్థాపించి మెపెడ్రోన్‌ను తయారు చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులుశుక్రవారం ఉదయం దాడిచేశారు. ఈ సందర్భంగా కేసరి, నరేష్ పట్టుబడగా వారి వద్ద 750 గ్రాముల మెపెడ్రోన్‌తో వుండగా జప్తు చేశారు. అనంతరం వీరు ఏర్పాటు చేసిన కెమికల్ ఫ్యాక్టరీని ధ్వంసం చేసి అందులోని వస్తువులను, ఒక కారును, మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు.



నిందితుల వద్ద పట్టుబడిన మెపెడ్రోన్. అంతర్జాతీయ సింథటిక్ డ్రగ్స్ స్మగ్లర్లు.

# మేటి షూటర్ జస్పాల్‌రాణా ఆకస్మిక మృతి

**న్యూఢిల్లీ, జూన్ 12:** భారత దిగ్గజ షూటర్ జస్పాల్ రాణా(49) ఆకస్మికంగా కన్నుమూసారు. ఆసియా క్రీడల్లో ఆయన గతంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నారు. భారతీయ పిస్తోల్ షూటర్లకు కోచ్‌గా కొనసాగుతున్న జస్పాల్ రాణా అనూహ్య రీతిలో తుదిశ్వాస విడిచారు. గురువారం రాత్రి ఆయన ప్రాణాలు విడిచినట్లు సమీప మిత్రులు, బంధువులు తెలిపారు. జర్మనీలోని మునిచ్ ఇటీవల జరిగిన షూటింగ్ ఈవెంట్‌కు జస్పాల్ రాణా హాజరయ్యారు. అయితే అక్కడ ఆయన అస్వస్థతకు గురయ్యాడు. ఆ ఈవెంట్‌లో భారత షూటర్లు రాణించారు. రెండు గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. జర్మనీ నుంచి వస్తున్న సమయంలో జస్పాల్ రాణా విమానంలోనే తీవ్ర అనారోగ్యానికి లోనయ్యారు. అయితే ఢిల్లీలో దిగగానే ఆయన్ను నేరుగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆయనకు స్టెంట్ వేశారు. కానీ షూటర్ రాణా ఆ చికిత్స నుంచి కోలుకోలేక పోయారు. జస్పాల్ రాణా మృతి భారత షూటర్లకు తీవ్ర నిరాశను మిగిల్చింది. మేటి షూటర్‌గా రాణించడంతో పాటు ఉత్తమ కోచ్‌గా ఆయన అనేక ఆటగాళ్లకు మెంటర్‌గా చేశారు. స్పాల్ రాణా తన కెరీర్‌లో అత్యుత్తమ షూటర్‌గా నిలిచారు. ఆసియా క్రీడల్లో ఆయన గోల్డ్ మెడల్ సాధించారు. ఎన్నో అంతర్జాతీయ టోర్నీల్లోనూ సక్సెస్ అయ్యారు. ఆ తర్వాత కోచ్‌గా కూడా యువతను ఎంతో ప్రోత్సహించారు. 2012లో ఆయన జాతీయ జూనియర్ పిస్తోల్ జట్టుకు కోచ్‌గా నియమితుడయ్యారు. భారత మేటి షూటర్లు అయిన సౌరభ్ చౌదరీ, అనిశ్ భన్వాలా, చింకి యాదవ్‌లకు ఆయనే శిక్షణ ఇచ్చారు. మేటి షూటర్ మనూ భాకర్‌ను కూడా ఆయనే తీర్చిదిద్దారు. ఇక 2025 ఫిబ్రవరిలో ఎన్ఆర్ఏఐ రాణాను హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా నియమించింది. 25 మీటర్ల పిస్తోల్ ఈవెంట్‌కు స్పెషలిస్టు కోచ్‌గా చేశారు. ప్రపంచ స్థాయి ఉత్తమ షూటర్లను తీర్చిదిద్దే క్రమంలో ఆయన ప్రాణాలను అర్పించారు. 2020లో షూటర్ జస్పాల్‌రాణాకు ద్రోణాచార్య అవార్డును ఇచ్చి ప్రభుత్వం సత్కరించింది.



**రాణా మృతి పట్ల సిఎం సంతాపం**

భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్‌గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.

# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి

**కాన్పూర్, జూన్ 12:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు. సంఘటన వివరాల ప్రకారం, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్వర్ణ శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌పై గురువారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. రైలు కదులుతుండగా జరిగిన ఈ దాడిలో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఒక కిటికీ అద్దం దెబ్బతింది. ఇదే కోచ్‌లో మోహన్‌భగవత్ ప్రయాణిస్తున్నారని, అయితే కిటికీకి వేరేవైపు ఆయన కూర్చోవడంతో ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, స్థానిక పోలీసులు విచారణ ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు వ్యక్తులు రాళ్లు రువ్వినట్టు గుర్తించారు. వీరిలో ఇద్దరిని అరెస్టు చేశారు. రైలుపై దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందా, రైల్వే ట్రాక్ సమీపంలో దుండగులు చేసిన పనా అనే దానిపై భద్రతా సంస్థలు ఆరా తీస్తున్నాయి.



# భారత్, ఐర్లాండ్ టి20 సిరీస్‌పై అనిశ్చితి





## వేదిక మార్పు లేదా సిరీస్ వాయిదా

**న్యూఢిల్లీ:** బెల్ ఫాస్ట్‌లో కొనసాగుతున్న హింసాత్మక అల్లర్ల కారణంగా భారత్ ఐర్లాండ్ టి20 సిరీస్‌పై అనిశ్చితి నెలకొంది. ఆటగాళ్ల భద్రతపై బిసిసిఐ ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వేదిక మార్పు లేదా సిరీస్ వాయిదా అవకాశాలపై చర్చలు జరుగుతున్నాయి. భారత జట్టు రాబోయే రోజుల్లో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య ఈ నెల 27, 29 తేదీల్లో బెల్‌ఫాస్ట్ వేదికగానే ఈ రెండు టి20 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి షెడ్యూల్ ఖరారైంది. అయితే ఐర్లాండ్‌లో చెలరేగిన హింసాత్మక అల్లర్లు ఇప్పుడు బిసిసిఐని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. నార్తర్న్ ఐర్లాండ్ రాజధాని నగరమైన బెల్‌ఫాస్ట్‌లో గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నగరంలో జరిగిన ఒక ఘోర హత్యాయత్నం ఉదంతం ఈ అల్లర్లకు కారణమైంది. ప్రస్తుతం అక్కడ శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. సరిగ్గా ఇదే నగరంలో టీమిండియా మ్యాచ్‌లు జరగాల్సి ఉండటంతో బిసిసిఐ పెద్దలు అలర్ట్ అయ్యారు. ఈ ఆందోళనకర పరిస్థితులపై బిసిసిఐ ఇప్పటికే స్పందించింది. పరిస్థితులను చాలా నిశితంగా గమనిస్తున్నామని, తమ ఆటగాళ్ళు, కోచింగ్ స్టాఫ్, అధికారుల భద్రతే తమకు అన్నింటికంటే ముఖ్యమని స్పష్టం చేసింది. ఒకవేళ బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌లు నిర్వహించడం సాధ్యం కాకపోతే, వేదికలను మార్చే అంశాన్ని పరిశీలించాలని ఐర్లాండ్ క్రికెట్ బోర్డుకు సూచించింది. వేదికల మార్పునకు సంబంధించి ఐర్లాండ్ బోర్డు నుంచి ఎలాంటి ప్రతిపాదన వచ్చినా తాము సానుకూలంగా స్పందిస్తామని, కానీ ప్లేయర్ల భద్రత విషయంలో మాత్రం ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని లీగల్స్ పరంగా క్లారిటీ ఇచ్చింది. మరోవైపు ఐర్లాండ్ క్రికెట్ బోర్డు కూడా అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై స్థానిక ప్రభుత్వంతో కలిసి సమీక్షిస్తోంది. రాబోయే రెండు మూడు రోజుల్లో పరిస్థితులు అదుపులోకి రాకపోతే మ్యాచ్‌లను మరో నగరానికి మార్చడం లేదా సిరీస్‌ను తాత్కాలికంగా వాయిదా వేయడం మినహా మరో మార్గం కనిపించడం లేదు. దీంతో ఈ ప్రతిష్టాత్మక సిరీస్ జరుగుతుందా లేదా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.



# ఫిఫా ప్రపంచ కప్‌లో.. చెక్ రిపబ్లిక్‌పై దక్షిణ కొరియా సంచలన విజయం

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచకప్ గ్రూప్ దశలో దక్షిణ కొరియా అద్భుత ఆటతీరుతో చెక్ రిపబ్లిక్ పై 2-1 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ మొదట్లో వెనుకబడినప్పటికీ మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను మార్చుకున్న కొరియా చివరకు విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీనితో కొరియా 16 ఏళ్ల తర్వాత ఫిఫా ప్రపంచ కప్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్ మొదలైనప్పటి నుంచే ఇరు జట్లు అటాకింగ్ కంటే డిఫన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాయి. చెక్ రిపబ్లిక్ డిఫ్ఫెండింగ్ పటిష్టంగా ఉండడంతో కొరియాకు గోల్స్ అవకాశాలు పెద్దగా లభించకపోవడంతో తొలి అర్ధభాగం ఎలాంటి గోల్ నమోదుకాలేదు. రెండో అర్ధభాగంలో మ్యాచ్ పూర్తిగా మారిపోయింది. 59వ నిమిషంలో చెక్ రిపబ్లిక్ కార్నర్ కిక్‌ను సద్వినియోగం చేసుకుని తొలి గోల్‌గా మలిచింది. లాడిస్లావ్ క్రేజ్చి అద్భుత హెడ్డర్తో జట్టుకు ఆధిక్యం అందించాడు. అయితే గోల్ వెనుకబడిన తర్వాత కొరియాకు చెందిన హ్వాంగ్ ఇన్‌బియోమ్ మరింత దూకుడుగా ఆడుతూ చెక్ రిపబ్లిక్ డిఫెన్స్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ వ్యూహాత్మక మార్పుతో కొరియా పుంజుకుంది. దీనితో 67వ నిమిషంలో బాక్స్ అంచున జరిగిన పాస్‌లతో ఏర్పడిన అవకాశాన్ని హ్వాంగ్ ఇన్‌బియోమ్ గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆ తర్వాత 80వ నిమిషంలో మ్యాచ్ నిర్ణయాత్మక మలుపు తిరిగింది. దక్షిణ కొరియా ఓ హ్యోన్‌గ్యులో షాట్తో గోల్ సాధించి జట్టుకు 2-1 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత చెక్ రిపబ్లిక్ సమీకరణ గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేసినా, కొరియా వ్యూహాత్మక మార్పులు విజయానికి ప్రధానంగా నిలిచాయి.

### అంటాల్యా ప్రపంచ కప్‌లో.. పతకం లేకుండా

# భారత్ ఆర్చర్ల నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక్క పతకం కూడా లేకుండానే అంటాల్యా ప్రపంచ కప్-2026ని ముగించారు. టర్కీలో శుక్రవారం జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు ఒక్క పతకం కూడా గెలవలేక తమ పేలవ ప్రదర్శనను కొనసాగించారు.

పోటీలో ఉన్న చివరి నలుగురు వెన్నం జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, టి. గణేష్ మణిరత్నం, కుశాల్ దలాల్ అందరూ తమతమ వ్యక్తిగత ఈవెంట్లలో రౌండ్ ఆఫ్ 32లోనే నిష్క్రమించారు. అనుభవజ్ఞురాలైన జ్యోతి, డెన్మార్క్‌కు చెందిన సీనియర్ క్రీడాకారిణి తాన్యా గెల్లెన్‌థియన్ చేతిలో 144-146 తేడాతో ఓడిపోయి అరుదైన తొలి రౌండ్ల నుంచే నిష్క్రమించగా, పర్నీత్ స్పెయిన్‌కు చెందిన అలెక్సా ఒలివారెస్ చేతిలో 145-147 తేడాతో ఓటమి పాలైంది. అరంగేట్రం చేసిన టి. గణేష్, ఆస్ట్రియాకు చెందిన మాజీ ప్రపంచ ఛాంపియన్ నికో వీనర్ చేతిలో 143 -147 తేడాతో ఓడిపోగా, కుశాల్, ఉత్సాహంగా పోరాడినప్పటికీ, టర్కీకి చెందిన ఎమిర్కాన్ హేనీతో జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో 148-149 తేడాతో ఓటమి పాలయ్యాడు. అలాగే పురుషుల రికర్వ్ వ్యక్తిగత ఈవెంట్‌లో ఇటలీకి చెందిన మాసిమిలియానో మాండియాను 6-2 తేడాతో ఓడించిన ధీరజ్ బొమ్మదేవర సెమీఫైనల్‌కు చేరిన ఏకైక భారతీయ ఆర్చర్‌గా నిలిచాడు. మహిళల రికర్వ్ విభాగంలో దీపికా కుమారి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినా, రౌండ్ ఆఫ్ 16లో స్పెయిన్‌కు చెందిన ఎలియా కనాలిస్ చేతిలో 2-6 తేడాతో ఓడిపోయింది. మరోవైపు, ఆసియా క్రీడలకు అర్హత సాధించిన అంకితా భకత్, కుంకుమ్ మొహోద్, కీర్తి శర్మలు రౌండ్ ఆఫ్ 32లో నిష్క్రమించారు.



### తొలి టి20లో..

# వెస్టిండీస్ విజయం

### 7 వికెట్ల తేడాతో శ్రీలంక ఓటమి

**న్యూఢిల్లీ:** మూడు టీ20లో భాగంగా మొదటి మ్యాచ్ చివరి ఓవర్‌లో రోవ్‌మన్ పావెల్ కొట్టిన సిక్స్ కారణంగా వెస్టిండీస్ శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఆరు ఓవర్లలో 66 పరుగులు చేసినప్పటికీ, 147/9 లక్ష్య ఛేదనలో చివరిలో నెమ్మదించిన రన్ రేట్‌తో వెస్టిండీస్ మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చింది. 20 బంతుల్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా, అది తొమ్మిది బంతుల్లో బంతికి ఒక పరుగు అవసరమయ్యే స్థాయికి తగ్గింది. చివరకు, నాలుగు బంతులు మిగిలి ఉండగానే ఆతిథ్య జట్టు 149/3 స్కోరుతో ఉండగా, పావెల్ విజయాన్ని ఖాయం చేశాడు. కెప్టెన్, ఓపెనర్ షాయ్ హోప్ అజేయంగా 65 పరుగులు చేసి కరేబియన్ జట్టుకు నాయకత్వం వహించాడు. శ్రీలంక టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తర్వాత, కమీందు మెండిస్ 51 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కెప్టెన్ మరియు ఓపెనర్ కుసల్ మెండిస్ 36 పరుగులు జోడించాడు. జాసన్ హోల్డర్, షమార్ జోసెఫ్ చెరో మూడు వికెట్లతో వెస్టిండీస్ బౌలర్లకు నాయకత్వం వహించారు. చివరి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయిన తర్వాత, తడి నేలల్లో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను శ్రీలంక 1-0తో గెలుచుకుంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంక 41 పరుగుల తేడాతో విజయం సాధించింది.



# ఆస్ట్రేలియన్ ఓపెన్.. సెమీస్‌కు సింధు

### తన్వి ఓటమి

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో భారత్ షటర్ల పివి సింధు సెమీఫైనల్స్‌కు చేరగా, తన్వి శర్మ ప్రస్థానం ముగిసింది. సిడ్నీలో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో శుక్రవారం మహిళల సింగిల్స్‌లో సింధు రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత క్వార్టర్ ఫైనల్స్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, చైనీస్ తైపీకి చెందిన చెన్ సు యును కేవలం 27 నిమిషాల్లో 21-6, 21-9 తేడాతో ఓడించింది. మూడో సీడ్ అయిన ఆమె, రెండు గేమ్‌లలోనూ ఆధిపత్యం చెలాయించి, చివరి నాలుగు స్థానాల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. సెమీఫైనల్ పోరులో సింధు జపాన్‌కు చెందిన టాప్ సీడ్ అకానె యమగుచితో తలపడనుంది. మరోపక్క ఇదే రోజు జరిగిన మరో మ్యాచ్‌లో టీనేజ్ సంచలనం తన్వి శర్మ యమగుచి చేతిలో ఓటమి పాలవ్వడంతో టోర్నమెంట్‌లో ఆమె అద్భుతమైన ప్రస్థానానికి తెరపడింది. ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ విజయాలు నమోదు చేసిన తన్వి 32 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 3 జపనీస్ క్రీడాకారిణి చేతిలో 21-14, 21-14 తేడాతో ఓడిపోయింది. దీంతో మహిళల సింగిల్స్ పోటీలో భారతదేశపు ఆశలు ఇప్పుడు పూర్తిగా సింధుపైనే ఆధారపడి ఉన్నాయి.

# స్టాక్ మార్కెట్లలో జోష్

### తొమ్మిది లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద


### లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబై, జూన్ 12:** అమెరికా- ఇరాన్ మధ్య డీల ఖరారవుతుందన్న అంచనాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. సుమారుగా రూ.9.7 లక్షలకోట్లు ఇన్వెస్టర్ల సంపద పెరిగినట్లు అంచనా. అన్ని ప్రధాన రంగాల సూచీలు లాభాల్లో ముగియగా, ప్రైవేట్ బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ షేర్లు మార్కెట్లకు బలాన్నిచ్చాయి. సెన్సెక్స్ 1,695.40 పాయింట్లు పెరిగి 75,527.95 వద్ద ముగిసింది. నిఫ్టీ50 461.30 పాయింట్లు పెరిగి 23,622.90 వద్ద స్థిరపడింది. లార్సెన్ అండ్ టుబ్రో 4.87 , హెచ్డీఎఫ్సీ బ్యాంక్ 3.67 , రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.64 షేర్లు నిఫ్టీకి మద్దతుచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 2.37 శాతం పెరగగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 2.60 శాతం లాభపడింది. బీఎస్ఈలో 3,222 షేర్లు పెరగగా, 1,046 షేర్లు మాత్రమే నష్టపోయాయి. 171 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడులు 6.897 నుంచి 6.870 కు తగ్గింది. రూపాయి డాలర్తో పోలిస్తే బలపడి 95.19 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ 1.05 పెరిగి రూ.1,50,499కు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ రాబడులు 4.452 కు తగ్గింది. బ్రెంట్ ముడిచమురు ధర 3.62 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 87.11 డాలర్లకు చేరింది. ఇరాన్‌డీల్‌పై ట్రంప్‌ప్రకటనతో ఆసియా, యూరప్ మార్కెట్లు కూడా లాభాల్లో ముగిశాయి. వాల్ స్ట్రీట్ ఫ్యూచర్స్ కూడా బలంగా ట్రేడ్ అయ్యాయి. ఎస్ పీ 500సూచీ 1.75 లాభపడితే నాస్డాక్ 2.54లాభాల్లో ముగిసింది. డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 29 పాయింట్ల పెరిగింది. హెక్సాగాన్ న్యూట్రిషన్ షేరు బీఎస్ఈలో రూ.45 ఇష్యూ ధరపై 11.98 శాతం ప్రీమియంతో రూ.50.39 వద్ద ముగిసింది. లిస్టింగ్ రోజునే పెట్టుబడిదారులకు మంచి లాభాలు అందించింది. నెస్లే ఇండియా మ్యాగీకి ఫుడ్ సేఫ్టీ అథారిటీ నోటీసు జారీ చేసినట్లు వార్తలు రావడంతో షేరు 3.23 పడిపోయింది. టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ జూలై 1 నుంచి కార్లు, ఎస్యూవీల ధరలను 1.5 వరకు పెంచనున్నట్లు ప్రకటించడంతో షేరు 4.02 ఎగిసింది. యంత్ ఇన్ఫ్రాటెక్ దక్షిణ తూర్పు మధ్య రైల్వే నుంచి రూ.16.54 కోట్ల ఆర్డర్ దక్కడంతో షేరు 17.24 జంప్ చేసింది. జీఎన్జీ ఎలక్ట్రానిక్స్ ప్రమోటర్ వాటాల విక్రయం ద్వారా కనీస నిబంధనలు పాటించడంతో షేరు 3.44 పెరిగింది. పీసీబీఎల్ కెమికల్ గుజరాత్లోని ముంద్రా ప్లాంట్లో కొత్త స్పెషాలిటీ ఉత్పత్తి లైన్ ప్రారంభించడంతో షేరు 4.43 లాభపడింది. హిటాచి ఎనర్జీ ఇండియా వడోదర సమీపంలోని కర్జన్లో భారీ పవర్ ట్రాన్స్ఫార్మర్ ఫ్యాక్టరీ కోసం రూ.2,000 కోట్ల పెట్టుబడి ప్రకటించడంతో షేరు 3.31 పెరిగింది. రత్నవీర్ ప్రెసిషన్ ఇంజినీరింగ్ రూ.330 కోట్ల రైట్స్ ఇష్యూ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలపడంతో షేరు 2.33 లాభపడింది. ఏవీజీ లాజిస్టిక్స్ హల్దీరామ్ నాగ్పూర్ నుంచి దీర్ఘకాలిక రవాణా ఒప్పందం దక్కడంతో షేరు 6.05 పెరిగింది.

# 3.93%కి మేనెల రిటైల్ ద్రవ్యోల్బణం

### ఆహార ఉత్పత్తుల ధరలు పెరుగుదలే ప్రధాన కారణం



**న్యూఢిల్లీ,జూన్ 12:** దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మే నెలలో 3.48 శాతంనుంచి 3.93 శాతానికి పెరిగింది. ఆహార వస్తువుల ధరలు పెరగడం వల్లే ఈ పెరుగుదల చోటుచేసుకున్నట్లు కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ మోస్పీ శుక్రవారం డేటా విడుదలచేసింది. మే నెలలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, సీఎన్జీ ధరలు పలుమార్లు సవరించబడటంతో ఇంధన వ్యయాలు కూడా పెరిగాయి. మార్కెట్ అంచనా వేసిన 4.02 శాతం కంటే ద్రవ్యోల్బణం కొద్దిగా తక్కువగా నమోదవడం విధాన నిర్ణేతలకు కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ప్రస్తుతం నమోదైన 3.93 శాతం ద్రవ్యోల్బణం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) మధ్యకాలిక లక్ష్యమైన 4 శాతానికి కాస్త దిగువన ఉంది. మేలో ఆహార ద్రవ్యోల్బణం 4.20శాతం నుంచి 4.78 శాతానికి చేరుకుంది. ఆహార మరియు పానీయాల విభాగంలో ద్రవ్యో ల్బణం 4.0శాతం నుంచి 4.6 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్లో 3.74 శాతంనుంచి మేలో 4.25 శాతానికి పెరి గింది. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 3.16 శాతం నుంచి 3.53 శాతానికి పెరిగింది. కోర్ ద్రవ్యోల్బణం కూడా పెరుగుదల నమోదు చేసింది. ఏప్రిల్లో 3.4 శాతంగా ఉన్న కీలక ద్రవ్యో ల్బణం మేలో 3.8 శాతానికి చేరింది. రెస్టారెంట్లు మరియు వసతి సేవల విభాగంలో ద్రవ్యోల్బణం 5.8 శాతంగా నమోదయింది. పాన్, పొగాకు మరియు మత్తు పదార్థాల విభాగంలో ద్రవ్యోల్బణం 4.83 శాతంగా నమోదైంది. దుస్తులు, పాదరక్షలు 2.80 నుంచి 2.98 గృహ నిర్మాణం, యుటిలిటీ సేవలు 1.71 నుంచి 1.73 శాతం, ఆరోగ్య సేవల విభాగంలో 1.64 శాతంనుంచి 1.49శాతానికి తగ్గింది. ఇతర విభాగాల్లో విద్యా సేవల ద్రవ్యోల్బణం 2.99 శాతంగా, వినోదం, క్రీడలు, సంస్కృతి విభాగంలో 1.98 శాతంగా, గృహోపకరణాలు మరియు ఫర్నిషింగ్ విభాగంలో 1.90 శాతంగా నమోదయ్యాయి.



# రేజర్‌పే రూ.5,700 కోట్ల ఐపిఒకు సిద్ధం

### వారం రోజుల్లో గోప్య డీఆర్‌హెచ్‌పీ దాఖలు

**బెంగళూరు,జూన్ 12:** డిజిటల్ చెల్లింపుల ఫిన్‌టెక్‌సంస్థ రేజర్‌పే ఐపిఒ జారీద్వారా సుమారు 600 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.5,700కోట్లు సమీకరించే లక్ష్యంతో రహస్య డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ డిఆర్‌హెచ్‌పిని వచ్చే వారం రోజుల్లో దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఈ ఐపీఓలో 300 మిలియన్ డాలర్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు, మరో 300 మిలియన్ డాలర్ల మేర ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉంటుంది. ప్రస్తుత పెట్టుబడిదారులు తమ వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించే అవకాశం పొందనున్నారు. రేజర్‌పే ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా 5 నుంచి 6 బిలియన్ డాలర్ల విలువను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరాంతానికి ముందే దేశీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ పూర్తి చేయాలని సంస్థ యోచిస్తున్నట్లు వర్గాలు వెల్లడించాయి. ఐపీఓ నిర్వహణ కోసం యాక్సిస్ క్యాపిటల్, సిటీగ్రూప్, గోల్డ్‌మాన్ శాక్స్, జేపీ మోర్గాన్ మరియు మహీంద్రా క్యాపిటల్‌లను ప్రధాన బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా నియమించింది. భారత్‌లో లిస్టింగ్‌కు మార్గం సుగమందేశీయ మార్కెట్‌లో లిస్టింగ్‌కు అనువుగా ఉండేందుకు రేజర్‌పే 2025 మేలో కీలక నిర్ణయం తీసుకుంది.

అమెరికాలో ఉన్న సంస్థ ప్రధాన కార్యాలయం మరియు కార్పొరేట్ డొమిసైల్‌ను తిరిగి భారత్‌కు మార్చుతూ రివర్స్ ఫ్లిప్ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో భారత స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్‌కు అవసరమైన నియంత్రణ అనుమతుల మార్గం సుగమమైంది. అంతకుముందు ఈ ఏడాది ఏప్రిల్‌లో తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా నిధుల సమీకరణకు కంపెనీ వాటాదారుల ఆమోదం కూడా పొందింది.

రేజర్‌పేలో పీక్ ఎక్స్‌వీ పార్ట్నర్స్, జీఐసీ, టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, వై కాంబినేటర్, సేల్స్‌ఫోర్స్ వెంచర్స్, లైట్స్‌పీడ్ వెంచర్ పార్ట్నర్స్ వంటి ప్రముఖ అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ సంస్థలు పెట్టుబడులు పెట్టాయి. భారత ఫిన్‌టెక్ రంగంలో అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న ఐపీఓలలో రేజర్‌పే పబ్లిక్ ఇష్యూ ఒకటిగా నిలుస్తోంది.

# లక్షకోట్ల డాలర్ల తొలి బిలియనీర్‌గా ఎలాన్ మస్క్



**న్యూయార్క్,జూన్ 12:** ప్రపంచ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరో అరుదైన రికార్డు సృష్టించారు. 1 ట్రిలియన్ డాలర్లకు పైగా వ్యక్తిగత సంపద కలిగిన తొలి వ్యక్తిగా నిలిచారు. స్పేస్ ఎక్స్ ఐపీఓ విజయవంతం కావడంతో మస్క్ సంపద భారీగా పెరిగింది. ప్రస్తుతం ఆయన నికర ఆస్తుల విలువ 1.1 ట్రిలియన్ డాలర్లను (రూ.94.6 లక్షల కోట్లు) దాట నున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. స్పేస్‌ఎక్స్ షేర్లు మార్కెట్లోకి రావడంతో మస్క్ సంపదలో ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదైంది. ఐపీఓకు ముందు ఆయన సంపద సుమారు 780 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. ఇప్పుడు స్పేస్ ఎక్స్‌లోని వాటా విలువ ఒక్కటే 866 బిలియన్ డాలర్లకు చేరినట్లు తెలుస్తోంది. టెస్లా, ఇతర కంపెనీల్లోని వాటాలను కలుపు కొంటే మొత్తం సంపద 1.1 ట్రిలియన్ డాలర్లను దాటుతోంది. స్పేస్‌ఎక్స్ ఐపీఓకు ముందు కూడా మస్క్ ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు. ఆయన సంపద దాదాపు 971 బిలియన్ డాలర్లుగా ఉండేది. రెండో స్థానంలో ఉన్న గూగుల్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ పేజ్ సంపద సుమారు 304 బిలియన్ డాలర్లు మాత్రమే మస్క్ సంపద ఇప్పుడు కొన్ని దేశాల మొత్తం ఆర్థిక వ్యవస్థలనే దాటిపోవడం విశేషం. అంతర్జాతీయ ద్రవ్య నిధి అంచనాల ప్రకారం తైవాన్ జీడీపీ విలువ 976.7 బిలియన్ డాలర్లు. ప్రస్తుతం భారత జీడీపీ సుమారు 4.15 ట్రిలియన్ డాలర్లని అంచనా. మన దేశ జిడిపిలో దాదాపు నాలుగో వంతుకు సమానమైన సంపద ఒక్క మస్క్ వద్దే ఉంది. టెస్లా ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు కొత్త దిశ చూపించారు. స్పేస్‌ఎక్స్‌తో అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. న్యూరాలింక్, బోరింగ్ కంపెనీ వంటి సంస్థలను కూడా స్థాపించారు. 2022లో ట్విట్టర్‌ను కొనుగోలు చేసి దానికి ఎక్స్‌గా పేరు మార్చిన సంగతి తెలిసిందే. మస్క్ కంపెనీలకు పెట్టుబడిదారులు ఇస్తున్న ప్రత్యేక విలువను మార్కెట్ విశ్లేషకులు ఎలాన్ ప్రీమియంగా అభివర్ణిస్తున్నారు.

# 114.58 బిలియన్ డాలర్లకు ఆర్బీఐ పసిడి నిల్వలు

**ముంబై, జూన్ 12:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారు నిల్వల విలువ జూన్ 5తో ముగిసిన వారానికి 1.98 బిలియన్ డాలర్లు పెరిగి 114.58బిలియన్ డాలర్లకు చేరింది. విదేశీ మారక నిల్వలు మొత్తం 711 మిలియన్ డాలర్లు తగ్గి 681.61 బిలియన్ డాలర్లకు చేరాయి. ఫారెక్స్ నిల్వల్లో అత్యధిక వాటా కలిగిన విదేశీ కరెన్సీ ఆస్తులు వారాంతంలో 2.70 బిలియన్ డాలర్లు తగ్గి 543.44బిలియన్ డాలర్లకు చేరాయి. ఎఫ్‌సీఏలను అమెరికన్ డాలర్ విలువలో లెక్కిస్తారు. ఇందులో యూరో, పౌండ్ స్టెర్లింగ్, యెన్ వంటి ఇతర విదేశీ కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే మార్పుల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుంది. గత వారంలో భారత విదేశీ మారక నిల్వలు సుమారు 938 మిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. రూపాయిపై అధిక ఒత్తిడి లేదా విదేశీ మారక మార్కెట్లో తీవ్ర అస్థిరత నెలకొన్నప్పుడు ఆర్బీఐ తన విదేశీ మారక నిల్వలను వినియోగించి జోక్యం చేసుకుంటుంది. అమెరికన్ డాలర్ నిల్వలను మరింత బలోపేతం చేయడంతో పాటు రూపాయి పుంజుకునేందుకు సహాయపడే లక్ష్యంతో ఎఫ్‌సీఎన్‌ఆర్‌బీ డిపాజిట్ల హెడ్జింగ్ వ్యయాన్ని తామే భరిస్తామని ఆర్బీఐ ఇటీవల ప్రకటించింది. ఆర్బీఐ చేపట్టిన చర్యల ప్రభావంతో భారత రూపాయి ప్రస్తుతం అమెరికన్ డాలర్‌తో పోలిస్తే 95 స్థాయి వద్ద ట్రేడవుతోంది. ఈ ఏడాది ప్రారంభంలో ఇది 97 స్థాయికి పడిపోయిన సంగతి తెలిసిందే. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం, రానున్న రోజుల్లో రూపాయి 94.70 నుంచి 95.60 మధ్య శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది.

# ధరలు పెంచిన టాటా మోటార్స్

**ముంబయి,జూన్ 12:** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి కొత్తధరలు అమల్లోకి రానున్నాయి. గరిష్ఠంగా 1.5శాతం వరకు ధరల్ని పెంచుతోంది. ఈ పెంపు ఐసీఈ మోడళ్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలకూ వర్తిస్తుంది. పెరుగుతున్న ముడి పదార్థాల వ్యయం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా పెరుగుతున్న ప్పటికీ వాటిలో సింహ భాగాన్ని తామే భరిస్తు న్నామని, కొంత భారాన్ని వినియోగదారులపై మోపక తప్పడం లేదని కంపెనీ పేర్కొంది. ధరల పెంపు అన్ని మోడళ్లపై ఒకేలా ఉండదని తెలిపింది. వాహనం, వేరియంట్‌ను బట్టి మారుతుందని స్పష్టం చేసింది. ఇటీవల ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపులు సాధారణంగా మారాయి. గత నెలలో హ్యుందాయ్ కూడా తన వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచింది. ముడి పదార్థాల ధరలు, కమొడిటీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడమే కారణమని తెలిపింది. మారుతి సుజుకి జూన్ నుంచి వివిధ మోడళ్లపై రూ.30 వేల వరకు ధరలు పెంచగా మహీంద్రాకూడా ఈ ఏడాది ప్రారం భంలోనే తన ఎస్‌యూవీలు, కమర్షియల్ వాహనాల ధరలను సవరించింది. దీంతో కంపెనీ షేర్లు కూడా మార్కెట్లో స్వల్ప లాభాలతో ట్రేడ్ అయ్యాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

# త్వరలో సింగరేణి మెడికల్ బోర్డు పునరుద్ధరణ



## నేడు 335 మందికి కారుణ్య నియామక పత్రాలు: తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, జూన్ 12, ప్రభాతవార్త :** సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆ సంస్థ యాజమాన్యానికి సూచించారు. ఈ మేరకు దీనికి సంబంధించి శుక్రవారం ఒక ప్రకటనలో సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షి కంగా, వివాదరహితంగా నిర్వహించాలన్నారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందన్నారు. ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో ఈ నెల 13న జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశాన్ని పరిష్కరించేందుకు న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్స్‌టర్నల్ పోస్టుల, 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. ఈ భర్తీని ఆన్లైన్‌లో వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. అలాగే కారుణ్య నియామకాల గరిష్ఠ వయోపరిమితిని 35 నుండి 40 ఏళ్లకు పెంచడం ద్వారా మరింత మందికి అవకాశం కల్పించామని వివరించారు. ఇక దేశంలోనే తొలిసారిగా సింగరేణిలోని 40 వేల మంది ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు. ఇదే కాకుండా వీరి కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అంతేకాకుండా కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. వీటితో పాటు, సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాగా గత రెండేళ్లలో రూ.1,500 కోట్లను చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5 వేలు, 2024-25లో రూ.5,500 చొప్పున బోనస్ పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణిలోని ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా, గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు చెప్పారు. సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించి, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించడం ద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకునేందుకు ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సి న అవసరం ఉందన్నారు.

బల్క్ పెట్రోలు విక్రయాలపై

# కేంద్రం ఆంక్షలు!

**న్యూఢిల్లీ,జూన్ 12:** దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, పెద్ద కంపెనీలు ఇకపై పెట్రోల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డీజిల్‌కు అసాధారణంగా డిమాండ్ పెరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధర, సాధారణ పెట్రోల్ బంకుల్లోని ధర కంటే ఎక్కువగా ఉండటంతో అనేక సంస్థలు బంకుల నుంచే భారీగా కొనుగోళ్లు చేస్తున్నాయి. దీంతో సాధారణ వినియోగదారులకు సరఫరా సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం భావించింది. ఢిల్లీలో ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర పెట్రోల్ బంకులో రూ.95.20గా ఉంది. అదే బల్క్ కొనుగోలుదారులకు ఈ ధర రూ.134.50గా ఉంది. ఈ తేడా కారణంగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు బల్క్ డిపోల బదులు బంకుల వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని గుర్తుచేసింది. షిప్పింగ్ వ్యవస్థ కూడా ప్రభావితమవడంతో దేశీయంగా ఇంధన లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తాజా ఆంక్షలు తీసుకొచ్చింది. మరోవైపు పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్ఓ) అనుమతి పొందిన కంటైనర్లకు మాత్రమే డీజిల్ విక్రయించాలి. ఒక వినియోగదారు లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని ఆదేశించారు.

దీన్ని మళ్లీ విక్రయించడం పూర్తిగా నిషేధం. నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక కొనుగోళ్లు, ఇంధన మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ ఆంక్షలు మొదట 90 రోజుల పాటు అమల్లో ఉంటాయి.

అవసరమైతే మరో ఉత్తర్వుతో గడువును పొడిగించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా సాధారణ వినియోగదారులకు ఇంధన కొరత తలెత్తకుండా చూడటమే ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

## బిజెపి బిసిల వ్యతిరేక పార్టీగా ముద్ర వేసుకుంది: విహెచ్



జనగణన డిప్యూటి రిజిస్ట్రార్ ఆర్.జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**గోషామహల్ (హైదరాబాద్), జూన్ 12 ప్రభాతవార్త :** బిజెపి బిసిల వ్యతిరేక పార్టీగా ముద్ర వేసుకుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు ఆరోపించారు. జాతీయ జనగణనలో బిసి కులగణన చేపడతామని స్వయానా ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించి, మాట తప్పారని విమర్శించారు. జాతీయ జనగణనలో బిసిల కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ కేంద్రీయ సదన్ వద్ద జాతీయ జనగణలో బిసి-కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతె రోహిత్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, దిడ్డి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంద్ర,గణన డైరెక్టర్ భారతీహోళికేరి అందుబాటులో లేకపోవడంతో జనగణన డిప్యూటి రిజిస్ట్రార్ ఆర్.జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం విహెచ్ మాట్లాడుతూ దేశంలో ఉన్న 60 శాతం మంది బిసిలకు ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని మండిపడ్డారు. బిసిల లెక్కలు తేలితేనే రాజ్యాధికారం దక్కుతుందని అన్నారు. జాతీయ జన గణనలో బిసి కుల గణన చేపట్టకపోతే బీసీలందరు జనగణనను బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, కేంద్ర మంత్రులను అడ్డుకోవడంతో పాటు ప్రధాని పర్యటనలో తమ నిరసనలు తెలియజేస్తామని స్పష్టం చేశారు. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి భారతీయ జనతా పార్టీ కాదని, బిసిల జూఠా పార్టీ అన్నారు. బిసిలకు నమ్మక ద్రోహం చేసిన, బిజెపి పార్టీకి బిసిలంతా, తగిన గుణపాఠం తెలుపుతామన్నారు. ఈ సందర్భంగా జనగణన శాఖ డైరెక్టర్ భారతి హోలీ కేరీను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, దిడ్డి రాంబాబు, బిసి సంక్షేమ సంఘం నాయకుడు గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌యాదవ్, కృష్ణగౌడ్, దిలీప్‌కుమార్, అశోక్‌యాదవ్, జై.శంకర్, ధన్‌రాజ్‌యాదవ్ పెద్ద ఎత్తున్న తదితరులు పాల్గొన్నారు.

## సర్ సర్వే సజావుగా జరిగేలా సహకరించండి

### రాజీయ పార్టీల ప్రతినిధులతో సిఇఒ

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి**

**హైదరాబాద్,జూన్12:** ఈ నెల 25 నుండి జరగబోయే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సర్వే కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసి సర్వే కార్యక్రమం సజావుగా జరిగేవిధంగా అన్ని రాజకీయ పార్టీలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సిఇఒ) సి. సుదర్శన్ రెడ్డి కోరారు. శుక్రవారం బిఆర్‌కె భవన్ లోని సిఇఓ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనికి అన్ని రాజకీయ పార్టీల వారు రాష్ట్రంలో సజావుగా నిర్వహించేందుకు తమ సహాయసహకారాలు అందజేయాలని కోరారు.

## యూరియా కొరతపై కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్12:** రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల సరఫరాను నిరాటంకంగా కొనసాగించేందుకు యూరియా కొరతను భర్తీ చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు శుక్రవారం లేఖ రాశారు. ఖరీఫ్-2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాల వారీగా ఎరువుల ముందస్తు నిల్వల ఏర్పాట్లు చేపట్టిందని, అయితే ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో గణనీయమైన లోటు ఏర్పడిందని తెలిపారు. ఏప్రిల్ నెలకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు ఉండగా, కేవలం 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కావడంతో 0.47 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఏర్పడిందని వివరించారు. అదేవిధంగా మే నెలలో కూడా అవసరమైన రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు బదులుగా ఇప్పటివరకు 1.67 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పంపిణీ ప్రక్రియలో ఉన్నాయని పేర్కొన్నారు. రవాణా వాహనాల కొరత, రేక్ పాయింట్ల వద్ద ఉన్న సమస్యల కారణంగా జిల్లాలకు ఎరువుల తరలింపు కూడా ప్రభావితమవుతోందని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, వరి, పత్తి వంటి ప్రధాన పంటల సాగు విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో జూన్ నెలకు కేటాయించే సాధారణ రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు, ఏప్రిల్‌లో ఏర్పడిన 0.47 లక్షల మెట్రిక్ టన్నుల లోటును భర్తీ చేసే అదనపు కేటాయింపును కూడా రాష్ట్రానికి మంజూరు చేయాలని మంత్రి కేంద్రాన్ని కోరారు.

# నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

### -రూ.30 లక్షల విలువైన నకిలీ ప్యాకెట్లు, 2 టన్నుల నాసిరకం విత్తనాలు స్వాధీనం ముగ్గురు అరెస్టు..

### రైతులను మోసం చేసే యత్నాన్ని భగ్నం చేసిన మల్కాజిగిరి పోలీసులు

**నేరెడ్ మెట్,మల్కాజిగిరి, కమిషనరేట్ , జూన్ 12,ప్రభాతవార్త :** రైతులను మోసం చేసి అక్రమంగా లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో నకిలీ పత్తి విత్తనాల వ్యాపారానికి పాల్పడుతున్న ముఠాను మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు ఛేదించారు. ప్రముఖ విత్తనాల కంపెనీ పేరుతో నకిలీ ప్యాకెట్లు ముద్రించి, నాసిరకం విత్తనాలను అసలైనవిగా విక్రయించేందుకు సిద్ధమైన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.30 లక్షల విలువైన 12,800 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు, సుమారు 2 వేల కిలోల అనుమానాస్పద విత్తనాలు, ఒక మారుతి ఈకో వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్మెట్ కమిషనరేట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కమిషనర్ బి.సుమతి తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన నర్మదా సాగర్ అగ్రి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ సోలంకే యశ్వంత్‌రావు ఫిర్యాదు మేరకు త్రిముల్‌ఘెర్రీ పోలీసులు కేసు నమోదు చేశారు. నర్మదా సాగర్ సంస్థకు చెందిన పత్తి విత్తనాల ప్యాకెట్లను పోలి ఉండే నకిలీ ప్యాకెట్లను ముద్రించి, వాటిలో నాసిరకం విత్తనాలను నింపి మార్కెట్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎస్ఓటీ మల్కాజిగిరి టీమ్2, త్రిముల్‌ఘెర్రీ పోలీసులతో కలిసి బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ యార్డు వద్ద తనిఖీలు నిర్వహించారు. టీజీ079378 నంబర్ గల మారుతి ఈకో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 12,800 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు లభించాయి. వాహనంలో ఉన్న యెరువ బాలశోరెడ్డి అలియాస్ శివారెడ్డి, కపర్తి బెంజిమెన్, దొంగ శ్రీనులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు రైతు సంపద సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యెరువ బాలశోరెడ్డి తన సహచరులతో కలిసి ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడినట్లు వెల్లడైంది. నర్మదా సాగర్ కంపెనీ పేరును పోలి ఉండే ప్యాకెట్ల డిజైన్‌ను దొంగ శ్రీను రూపొందించగా, వాటిని మేడ్చల్ జిల్లా బహదూర్‌పల్లి ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ప్రింటింగ్ సంస్థలో ముద్రించినట్లు తేలింది. రైతుల వద్ద నుంచి సేకరించిన నాసిరకం విత్తనాలను బండ్లగూడలోని కార్యాలయంలో నిల్వ చేసి, వాటిని నకిలీ ప్యాకెట్లలో నింపి విక్రయించేందుకు సిద్ధమయ్యారని పోలీసులు గుర్తించారు. నిందితుల సమాచారంతో బండ్లగూడలోని కార్యాలయంపై దాడి చేసి సుమారు 2 వేల కిలోల అనుమానాస్పద పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. రైతుల భవిష్యత్తుతో చెలగాటంఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ, నకిలీ విత్తనాల విక్రయం రైతుల జీవితాలతో చెలగాటమాడటమేనన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాల కోసం భారీ మొత్తాలు వెచ్చిస్తారని, అలాంటి సమయంలో నకిలీ లేదా నాసిరకం విత్తనాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, దిగుబడి దెబ్బతినడం, పంటలు పూర్తిగా నష్టపోవడం వంటి పరిణామాలు ఎదురవుతాయని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ అనుమతులు, ధృవీకరణలు కలిగిన సంస్థల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రెసిడెంట్ అడెపు వరలక్ష్మీ తదితరులు

## మా ఉద్యోగాలు.. ప్రాణాలకు భరోసా లేదు..

### అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

### తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**హైదరాబాద్,జూన్ 12,ప్రభాతవార్త:** తమ ఉద్యోగం, ప్రాణాలకు భరోసా లేదని పాలక ప్రభుత్వాలు తమతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయి తప్ప తమను రెగ్యూలరైజ్ చేయాలన్న ఆలోచన చేయడం లేదని..అసలే చాలీ చాలనీ వేతనాలు ఇస్తున్నారని, రెండు నెలలుగా అవి కూడా రావడం లేదని తెలంగాణ రాష్ట్ర (మినీ) అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలోని 66వేల మంది అంగన్‌వాడీలు గత రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులపాలవుతున్నారని, ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా వేదిస్తోందన్నారు. ప్రతి నెలా జీతాల కోసం ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సి న దుస్థితి దాపురించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులుకరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించామని, కాని తాము దవాఖానల పాలైతే కనీసం సెలవులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను చిన్న చూపుచూస్తున్నాయన్నారు. తక్షణమే వేతన బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతి నెలా 1వ తేదీన జీతాలివ్వాలని కోరారు. అలాగే అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీలకు 12 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, అవసరమైన చోట హెల్పర్లను నియమించాలని, అదనపు విధులను రద్దు చేయాలని, ప్రీప్రైమరీ పాఠశాలల్లో అర్హత కలిగిన వారికి ప్రాథమిక ఉపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

## యుపిహెచ్‌సి కేంద్రాలకు ఆధునిక వైద్య పరికరాలు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, సంజీవరెడ్డి నగర్, జూన్ 12, ప్రభాతవార్త:** దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, సనత్‌నగర్, అమీర్‌పేట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆధునిక వైద్య పరికరాలను అందజేసిన అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ దేశానికి అత్యధిక కాలం సేవలందించిన నాయకుల్లో ఒకరని, దేశ ప్రజలతో పాటు ప్రపంచ దేశాల నాయకుల ప్రశంసలు అందుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దశలవారీగా ఆధునిక వైద్య పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆసుపత్రుల వద్ద రోగుల సౌకర్యార్థం షెడ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్న ఆయన, ప్రస్తుతం మరుగుదొడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో చల్లని తాగునీటి యంత్రాలు ఏర్పాటు చేయడంతో పాటు గుండె జబ్బుల నిర్ధారణ పరీక్షలకు అవసరమైన పరికరాలు, కంటి పరీక్షల యంత్రాలు తదితర ఆధునిక వైద్య పరికరాలను అందజేసినట్లు వెల్లడించారు. ఆరోగ్య రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించే ఆయుష్మాన్ భారత్ పథకం దేశవ్యాప్తంగా కోట్లాది మందికి ప్రయోజనం చేకూరుస్తోందన్నారు. హైదరాబాద్‌లోని ఈఎస్ఐ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వం గణనీయంగా అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈఎస్ఐ ఆసుపత్రిలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో బాహ్య రోగులు సేవలు పొందుతున్నారని, కార్మికులు, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి నిర్మాణ పనులు 90 నుంచి 95 శాతం వరకు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నెలలో పూర్తి స్థాయిలో తెలంగాణ ప్రజలకు అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఈఎస్ఐ ఆసుపత్రిలో కొత్త బాహ్య రోగుల విభాగ భవనాన్ని త్వరలో ప్రారంభించ నున్నామని, సుమారు రూ.1000 కోట్ల వ్యయంతో అదనపు భవనాలు,

వసతి గృహాలు, పడకల సంఖ్య పెంపుతో ఆసుపత్రిని మరింత ఆధునీకరించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్యామ్ సుందర్ గౌడ్, అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ సరళ, శ్రీశైలం గౌడ్, చరణ్ సింగ్, వైద్య అధికారులు, సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిండర్‌యాప్ సాయంతో రూ.52 లక్షలు స్వాహా

### మహిళా జడ్జికి టోకరా వేసిన టిండర్ ప్రియుడు

**చండీగఢ్, జూన్ 12:** ఆన్‌లైన్ డేటింగ్ యాప్ టిండర్ వేదికగా జరిగిన ఓ ఘరానా మోసంలో హర్యానాకు చెందిన ఒక మహిళా జడ్జి ఏకంగా రూ. 52 లక్షలకు పైగా పోగొట్టుకున్నారు. సీక్రెట్ ప్రభుత్వ విభాగంలో పనిచేస్తున్నానంటూ పరిచయమైన ఒక వ్యక్తి హనీట్రాప్ ద్వారా ఆమెను బురిడీ కొట్టించాడు. ఈ కేసులో ఒక ఊహించని ట్విస్ట్ చోటుచేసుకుంది. బాధితురాలైన సదరు జడ్జి నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయకుండా, తన ఇంట్లో పనిచేసే మహిళ పనిమనిషి పేరుతో కంప్లైంట్ ఇప్పించారు. ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ద్వారా తానే మోసపోయానంటూ ఆ పనిమనిషి పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ వ్యవహారంపై ఢిల్లీ కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిందితుడికి బెయిల్ నిరాకరించింది. ఫిర్యాదు దాఖలు చేసిన తీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఎఫ్ఐఆర్ ప్రకారం సదరు మహిళా జడ్జికి గత నవంబర్‌లో టిండర్ యాప్‌లో అభిమన్యు వశిష్ట్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. కాలక్రమేణా వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ఈ క్రమంలోనే లాభదాయకమైన పెట్టుబడి పథకాలు ఉన్నాయంటూ నమ్మబలికిన నిందితుడు ఆమె నుండి విడతల వారీగా రూ. 52 లక్షలకు పైగా తన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయించుకున్నాడు. అతను చెప్పినట్లు ఎలాంటి లాభాలు రాకపోగా, అసలు డబ్బు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని సదరు జడ్జి గ్రహించారు. సమాజంలో తమ హోదాకు ఎక్కడ భంగం కలుగుతుందోనన్న సంకోచంతో ఆమె తన పేరుతో కాకుండా, తన పనిమనిషి పేరుతో కేసు పెట్టించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో నిందితుడు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌ను విచారించిన అడిషనల్ సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ లాలెర్ అనుమానాస్పద లావాదేవీలన్నీ జడ్జి బ్యాంకు ఖాతాల నుంచే జరిగాయని, పనిమనిషి ఖాతా నుంచి కాదని గుర్తించారు. అసలైన బాధితురాలు ఎవరో ఫిర్యాదులో స్పష్టంగా లేదని, ఒక జడ్జి హోదాలో ఉండి క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌ను ఇలా పరోక్షంగా ఆశ్రయించడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి రొమాన్స్ స్కామ్స్ లో చిక్కుకున్నప్పుడు బాధితులు ఇబ్బందిగా, అవమానంగా భావించడం సహజమే అయినప్పటికీ పారదర్శకమైన, సమగ్రమైన దర్యాప్తు కోసం నిజాలు దాచకూడదని స్పష్టం చేసింది. ఈ కేసు దర్యాప్తులో పోలీసుల వైఫల్యాలను సైతం కోర్టు ఎత్తిచూపింది. వారిద్దరూ మాట్లాడుకున్న టిండర్ చాట్స్ గానీ, పూర్తి స్థాయి వాట్సాప్ సంభాషణలను గానీ పోలీసులు సేకరించలేదు. కనీసం కాల్ డేటా రికార్డులను కూడా స్వాధీనం చేసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు నిందితుడు కూడా కోర్టుతో దాగుడు మూతలు ఆడుతున్నాడని, సదరు జడ్జి తనకు పంపిన మెసేజ్‌లను మాత్రమే చూపిస్తూ, తాను పంపిన రిప్లైలను డిలీట్ చేశాడని కోర్టు పేర్కొంది. ఫోన్ పాస్‌వర్డ్ ఇవ్వకుండా దర్యాప్తునకు సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. వెంటనే వారిద్దరి టిండర్, వాట్సాప్ రికార్డులను సేకరించాలని, ఎక్కడెక్కడ కలుసుకున్నారు.

# రైతాంగ అభివృద్ధికి ఇందిరాగాంధీ సేవలు అమోఘం

### - ఘనంగా అగ్రి వర్సిటీ 62 వ ఆవిర్భావ దినోత్సవాలు - సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానానికి అగ్రి వర్సిటీ దిక్సూచి కావాలి : మంత్రి తుమ్మల - హరిత విప్లవంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర : జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**అత్తాపూర్ జూన్12,ప్రభాతవార్త :** దేశ రైతాంగ అభివృద్ధికి ఇందిరాగాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకోచ్చి దేశంలో సంక్షభం లేకుండా చేశారని సాంకేతిక వ్యవసా పరిజ్ఞానానికి అగ్రీ వర్సిటీ దిక్సూచి కావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్ర నగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం 62 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉపకులపతి అల్దాస్ జానయ్య అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భారత దేశ హరిత విప్లవ సాధన లో ఇందిరాగాంధీ విశేష సేవలు అన్న అంశం పై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ,దేశానికి 62 ఏళ్ళుగా ఈ విశ్వవిద్యాలయం సేవలు అందిస్తోందని అభినందించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ చేతుల మీదుగా ప్రారంభం అయిన ఈ విశ్వవిద్యాలయం వివిధ పంటలలో రూపొందించిన సుమారు 520 వంగడాలు రైతుల మన్ననలు పొందాయన్నారు. అనేక వేల మందిని పట్టభద్రుల గా తీర్చిదిద్దిందన్నారు. ఇందిరా గాంధీ, స్వామినాథన్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల తోడ్పాటుతో అమలు చేసిన హరిత విప్లవం కారణంగా నేడు ఆహార ఉత్పత్తుల్ని ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదిగిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. వరి, మొక్కజొన్న పంటల ఉత్పత్తి లో రాష్ట్రం రికార్డు సాధించిందన్నారు. అనేక దేశాలలో పంట లకు విలువ జోడింపు, మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్, సెన్సర్ ల ఆధారిత వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తున్నాయని మంత్రి వివరించారు. తెలంగాణా వ్యవసాయం సాంకేతిక, విలువ ఆధారిత వ్యవసాయం గా పరిణామం చెందాలని అందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం దిక్సూ చి గా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...దేశం ఆహార భద్రత సాధించడలో , నేడు ఆహార ధాన్యాలని ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకోవడానికి ఇందిరాగాంధీ అమలు చేసిన హరిత విప్లవం ప్రధాన కారణమని అయన అన్నారు. వ్యవసాయ వర్సిటీ వంటి సంస్థల స్థాపన అందుకు దోహదం.

# చిరుత ప్రింట్స్ !

## ఇప్పుడిదో ట్రెండ్

ఫ్యాషన్ ఫ్యాషన్





అలనాటి అందాలే కొత్త రూపుదాల్చుకుని మళ్లీ మళ్లీ కొత్త రూపంలో మార్కెట్‌లో తిరిగొస్తాయి అన్నా అందరి మాట. అది ఏ విషయంలోనైనా సరే కానీ.. లెపర్డ్ ప్రింట్ విషయంలో మాత్రం కాదు అంటారు ఫ్యాషనిస్టులు. అదెప్పుడూ ట్రెండ్‌లో భాగమే.. కాస్త కనుమరుగైనా తిరిగి అంతే అందంగా దూసుకొస్తుంది అంటారు వాళ్లు. అవును మరి.. ఈనాటిదా ఈ ఫ్యాషన్. చిరుత పులి చర్మాన్ని పోలినట్టుండే ఈ ఫ్యాషన్ 1940ల్లో తొలిసారి హాలీవుడ్ తెరమీదకి వచ్చింది. అక్కడి నుంచి ప్రపంచమంతా ప్రయాణించింది. డేరింగ్ స్టైల్ అంటూ ఇప్పటికీ ఈ ట్రెండ్‌పై మనసు పారేసుకుంటున్నారంతా. లావు, సన్నం, మధ్యస్థం..శరీరాకృతి ఏదైనా నప్పేయడం ఈ ప్రింట్ ప్రత్యకం. కాబట్టే మన తారలూ పార్టీలైనా, హాలిడే టూర్లైనా 'లేడీ చిరుత'ల్లా సిద్ధమై అందరి దృష్టి ఆకర్షించేస్తున్నారు.



# అల్జీమర్స్.. ఐనా

## ఆమె జ్ఞాపకశక్తి అమేయం !





అల్జీమర్స్ అంటేనే వృద్ధాప్యంలో జ్ఞాపకశక్తిని కోల్పోవడం. కానీ ఎనభై ఏళ్ల వృద్ధురాలిపై పుట్టగొడుగుల ప్రభావం గమనిస్తే అది అల్జీమర్ రోగులకు ఓ వరప్రసాదంగా పరిశోధకులు భావిస్తున్నారు. ఆమె 'సైటో సైబిన్' కలిగిన పుట్టగొడుగులు తిన్న వెంటనే ఆమె జాక్షపకశక్తిలో మెరుగుదల కన్పించింది. ఈ విషయాన్ని పరి శోధకులు 'ఫాంటియర్' జర్నల్‌లో ప్రచురించబడింది. అంతకు ముందు ఆమె తీవ్రమైన ఆల్జీమర్స్‌తో మతితపప్పిన దానివలె ప్రవర్తించేది.

ఆమె జ్ఞాపకశక్తి, సంభాషణ, చలనశీలత, రోజువారీ కార్యకలాపాలలో గణనీయమైన మెరుగుదల కనిపించిందని పరిశోధకులు నివేదించారు. మార్కోస్ లాగో, మరియానా సెర్వీరా , జో జేవియర్ సైమోనెట్ అనే పరిశోధకులు రచించిన ఈ అధ్యయనం, అల్జీమర్స్ వ్యాధి పూర్తిగా నయమైందని పేర్కొనలేదు. అయితే, కోల్పోయిన కొన్ని విధులు నిద్రాణంగా ఉండిపోవచ్చని,కొన్ని నాడీ సంబంధిత పరిస్థితులలో అవి తిరిగి క్రియాశీలకం కావచ్చని వివరించారు. జపనీస్‌అమెరికన్ అయిన ఆ మహిళ, దాదాపు ఒక దశాబ్దం పాటు అల్జీమర్స్ వ్యాధితో జీవించింది. గత ఐదేళ్లుగా, ఆమె పరిస్థితి తీవ్రమై, ఆమె ఎక్కువగా ఒంటరి పదాలలో మాట్లాడటంతో నిరంతర పర్యవేక్షణ అవసరమైంది, మూత్ర ఆపుకొనలేని సమస్యతో బాధపడటం, నడవడానికి, మింగడానికి ఇబ్బంది పడటం, మాట్లాడలేదు. సంజ్ఞలు కూడా కష్టమయ్యేవి. అధ్యయనం ప్రకారం, మెదడు కార్యకలాపాలను మార్చడానికి ప్రసిద్ధి చెందిన సైకడెలిక్ పదార్థమైన సైలోసైబిన్ కలిగిన 5 గ్రాముల పుట్టగొడుగులను రోగికి ఒకే నోటి మోతాదుగాఇచ్చారు. ప్రారంభ దశలో, ఆమెకు విపరీతమైన చెమటలు పట్టడం, జ్వరం వచ్చినట్లు అనుమానం, ఎక్కువసేపు నిద్రలాంటి స్థితి వంటివి అనుభవమయ్యాయి.పుట్టగొడుగులు తీసుకున్న సుమారు 19 గంటల తర్వాత, పరిశోధకులు ఒక నాటకీయ మార్పును గమనించారు. ఆ మహిళ తన వ్యక్తిగత జ్ఞాపకాల గురించి స్వచ్ఛందంగా మాట్లా డటం ప్రారంభించింది. చాలా గంటలపాటు సంభా షణలలో పాల్గొంది. ఆమె మరింత చురుకుగా, భావోద్వేగాలకు స్పందిస్తూ సామాజికంగా కలిసిపోతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.తర్వాతి రోజులు, వారాలలో, మరిన్ని మెరుగుదల కనిపించింది. ఆ రోగికి మూత్రంపై నియంత్రణ తిరిగి వచ్చిందని, మరింత స్వతంత్రంగా నడవగలిగిందని, తనంతట తాను బట్టలు వేసుకోగలిగిందని, సంభాషణలలో మరింత చురుకుగా పాల్గొన గలిగిందని తెలిసింది. పరిశోధకులు ఆమెలో సందర్భానుసార జ్ఞాపకశక్తి, భావో ద్వేగాలకు స్పందించే సామర్థం, తన చుట్టూ ఉన్న వ్యక్తులతో మమేక మయ్యే సామర్థం పెరగ డాన్ని కూడా గమనించారు. రెండవ సెషన్ మెరుగు దలలను బలపరిచింది ఒక నెల తరువాత, ఆ మహిళ 3 గ్రాముల తక్కువ మోతాదుతో పర్యవేక్షణలో రెండవ సెషన్‌కు హాజరయ్యారు. ఈ అను భవం సమయంలో, ఆమె మాటల ద్వారా తన భావాలను వ్యక్తపరిచారు .ఒక ప్రశాంతమైన ద్వీపంలో తన కొడుకుతో సర్ఫింగ్ చేస్తున్నట్లు సానుకూల మానసిక చిత్రాలను వివరించారు .ముఖ కవళికలు, హాస్యం, సామాజిక భాగస్వామ్యం, చలన శీలతలో నిరంతర మెరుగుదలలను పరిశోధకులు గమనించారు. రుగ్మత నయమయినట్లే అనిపించింది. అల్జీమర్స్ చివరి దశలో కూడా, కొన్ని క్రియాత్మక సామర్థ్యాలు మెదడులో భద్రపరచబడి ఉండవచ్చు నాడీ వ్యవస్థలను మార్చే, ప్లాస్టిసిటీని ప్రోత్సహించే చికిత్సల ద్వారా వాటిని ఉపయోగించుకునే అవకాశం ఉంది. అనంతరం మరికొన్ని క్లినికల్ అధ్యయనాలు భావిస్తున్నారు. □

# శ్రీరాముడు ఆదర్శ ప్రాయుడు

మనం చాలాసార్లు ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువల గురించి కంటే ఐహిక సుఖాల గురించే ఆలోచిస్తాం. ఆశించిన విషయంలో విజయం లభిస్తే.. ఆనందం, లేదంటే ఆందోళన. అనుకుననవి నెరవేరనప్పుడు ఆ ఓటమిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండం. నిజానికి భౌతిక సంపదల కంటే ఆధ్యాత్మిక చింతన గొప్పదని, లేకుంటే జీవితానికి అర్థం, పరమార్థం లేదని చెబుతున్నాయి పురాణేతిహాసాలు. మనలో నైతికవిలువలు నెలకొల్పాలని అంతరాత్మ తపన పడుతుంటుంది. మనసు అక్రమ మార్గాల దిశగా మళ్లకుండా అది పదేపదే హెచ్చరికలు చేస్తుంటుంది. దీన్నే ఆత్మలో సందడి అంటారు యోగులు. మనసును కట్టడి చేసేవారే స్థితప్రజ్ఞులు. ఈ విలువైన వ్యక్తులే సమాజ హితానికి దోహదపడతారు. విలువలను నమ్ముకున్నవారికి విజయం తప్పనిసరిగా లభిస్తుంది. అలా అయితే విజయం తక్షణం సమకూరితేనే అదృష్ట వంతులని, అది ఆలస్యమైతే దురదృష్టంతులని భావిస్తారు కొందరు. అది వాస్తవం కాదు. పాండవులు ఏళ్ల తరబడి కష్టాలు అనుభవించినా.. చివరికి న్యాయమే గెలిచింది. ఆలస్యంగానైనా రాజ్యాన్ని తిరిగి దక్కించు కోగలిగారు. కౌరవులు అన్యాయంగా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న మాట నిజమే. దాన్ని నిలబెట్టుకోవడానికి ఎన్నో అడ్డదారులు తొక్కారు. కానీ చివరికి ఏం ఒనగూరింది? వంశమే నశించింది కదా! జరగాల్సి న పట్టాభిషేకం తప్పిపోయినా, అర్ధాంగి సీతమ్మను రావణాసురుడు అపహరించుకు పోయినా రాముడు చెక్కుచెదరలేదు. అడ్డదారులు తొక్కలేదు. రావణాసురుని సంహరించాక స్వర్ణలంకను చూసి లక్ష్మణుడు ఇష్టపడి లంకలోనే ఉండిపోదా మన్నాడు. కానీ శ్రీరాముడు అంగీకరించ లేదు. కన్నతల్లి, మాతృభూమి కన్నా స్వర్గం కూడా గొప్పది కాదని సోదరుడికి హితవు చెప్పాడు. అంతటి నిజాయితీ కలిగినవాడు కనుకనే శ్రీరామచంద్రుడు ఆదర్శ ప్రాయుడు అయ్యాడు. □

# చిక్‌పీస్‌తో చింత లేకుండా!



అమెరికన్ / ఇరానీయన్ చీక్‌పీలు భారత్ చీక్‌పీల కంటే తియ్యగా ఉంటాయి. 8 మరియు 9 సైజుల్లో ఉండే కెర్మాన్ షా చిక్‌పీలు ప్రపంచంలోనే అత్యున్నతమైన నాణ్యత కలవి. యుపిలో వీటిని బూట్ అంటారు. శనగల్ని వేయించి, నానబెట్టి, ఉడికించి, మొలకెత్తించి తినవచ్చు. మొల కెత్తిన సెనగల్లోని ఫైటోకెమికల్స్ గుండె, కండరాల్లో నాళాల్లో చేరే ఫ్లేక్ లాంటి పదార్థాన్ని పేరుకుపోకుండా చేసి చెడుకొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్)ని తగ్గస్తుంది. శనగల్లోని ఫైటో ఈస్ట్రోజెన్స్ మోనోపాజ్ సమస్యల్ని మతి మరుపు, వేడి ఆవిర్లు రావడం, హార్మోన్ల అసమానత, బుతు సంబంధ సమస్యల్ని, ఆస్టియో ఫోరోసిస్ (ఎముకలు బోలు వారడం) వంటి సమస్యల్ని తగ్గిస్తుంది. చిన్నపిల్లల్లో తక్షణ శక్తి అందించడానికి వీలుగా శనగల పాప్‌కార్న్, అటుకులు, పఫ్స్, చిప్స్, చాక్లెట్స్‌ని తయారు చేస్తున్నారు. శనగలు రోజువారీ శ్రమలో తలెత్తే అలసట, నీరసాన్ని తగ్గిస్తుంది. వీటిలోని అధిక విటమిన్స్, ఖనిజాల వల్ల శరీరానికి సమగ్ర పోషణ అందు తుంది. వీటిలోని ఫైబర్ పొట్ట నిండిన భావన కల్గి, అధిక ఆకలిని నియంత్రించి బరువు నియంత్రణలో ఉపయోగపడుతుంది. అజీర్ణం, మలబద్ధకం తగ్గి జీర్ణక్రియ మెరుగవుతుంది. చక్కెర స్థాయిల్ని స్థిరీకరించి డయాబెటిస్‌ని కంట్రోల్ చేస్తాయి. శనగల్లోని జింక్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీర వ్యాధుల తో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. శనగలోనంలని ఆంటీ ఆక్సిడెంట్స్ కణాల పునరుత్పత్తిని, శరీ రాన్ని డీటాక్సిఫై చేసి ఫ్రీరాడికల్స్‌ని తొలగించి శారీరక ధారు డ్యాన్ని పెంపొందిస్తాయి.శనగల్లోని కాల్షియం, ఫాస్ఫరస్ కీళ్ల వ్యాధులు, దంత వ్యాధుల్ని తగ్గించి ఎముకల ఆరోగ్యానికి దోహదపడతాయి. అధిక ప్రోటీన్స్, తక్కువ కెలరీల వల్ల బరువు ఆకలిని అదుపులో ఉంటుంది. ఆంటి ఇన్‌ఫ్లమేటరీ ఛేంజ్స్ వల్ల వాపు, నొప్పి, మంటలు తగ్గుతాయి. ఆంథోసైనిన్ లుప, ఫైటో న్యూట్రిమెంట్స్ రక్తనాళాల్ని బలంగా ఆరోగ్యంగా ఉంచి స్ట్రోక్, పక్షవాతం రాకుండా రక్తపోటు, గుండె ఆరోగ్యాన్ని కాపాడు తుంది. శనగల్లోని ఐరన్ రక్తహీనతని తగ్గించి ఎర్రరక్తకణాల ఉత్పత్తిని పంచి హీమోగ్లోబిన్ స్థాయిల్ని స్థిరీకరిస్తుంది. ఇది ఆంటికేన్సర్ ఏజెంట్‌గా రొమ్ము, కోలన్, లంగ్ కేన్సర్ల్ని రాకుండా ఆరికడుతుంది. వీటిలోని అమినో ఆసిడ్స్, ట్రిప్టోఫాన్, సెరటోనిన్‌లు, లినోలిక్ ఆసిడ్స్, ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ ఒత్తిడి, (కుంగుబాటు) మూడ్ ఛేంజ్స్‌ని తగ్గించి నిద్రలేమి సమస్యల్ని లేకుండా చేసి ప్రశాంతతని అందిస్తాయి. దీనిలోని ప్రోటీన్స్ కండ రాల బట్టి చర్మ ఆరోగ్యానికుపయోగపడుతుంది. ఇది ప్రీ బయాటిక్ ఫుడ్‌గా గట్‌హెల్త్‌ని కాపాడే శక్తి దీనికి ఉంది. ప్రేగు కదలికల్ని సులభతరం చేస్తాయి. ప్రేగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని వానపెట్టి ఉదయం అల్పాహారంగా ఒక కప్పు మాత్రమే తీసుకో వచ్చు. డెమెన్షియా, ఆల్జీమల్స్ డిసీజెస్, తామర, బొల్లి వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్స్, తలనొప్పి వంటి సమస్యల్ని తగ్గిస్తుంది. కాబట్టి వీటిని మితంగా వాడి మీ ఆరోగ్య సంరక్షణలో భాగం చేసుకోండి. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్రఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు,ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

# చిరు158 పొల్లాచ్చిలో క్రూషియల్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్ లో ChiruBobby 2 / Chiru158 చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.'వాల్తేరు వీరయ్య' భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ విజయవంతమైన కాంబో మరోసారి చేతులు కలపడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పలు భాషల్లో భారీ విజయాలు అందు కున్న కేవీఎన్ ప్రొడక్షన్స్‌కు ఇది తొలి తెలుగు చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా తమిళనాడు లోని పొల్లాచ్చిలో జరిగిన హైఎనర్జీ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవి, ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. నెక్స్ట్ షెడ్యూల్ త్వరలో ప్రారంభంకానుంది. చిరు158 కోసం దర్శకుడు బాబీ కొల్లి భారీ స్థాయిలో కథను సిద్ధం చేశారు. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన మరోసారి అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు.ఈ భారీ ప్రాజెక్ట్‌కు టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్‌ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె.చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఆడిషనల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భాను–నందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు.ఈ చిత్రంలో కథానాయికతో పాటు ఇతర ప్రధాన తారాగణానికి సంబంధించిన వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించ నున్నారు.



# 'మా ఇంటి బంగారం' సెన్సార్ పూర్తి



సమంత నటించి, నిర్మించిన 'మా ఇంటి బంగారం' సెన్సార్ పూర్తి.. జూన్ 19న చిత్రం భారీ ఎత్తున విడుదల..ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూన్ 19న విడుదల కాబోతోంది. ఇప్పటికే టీజర్, ట్రైలర్‌లతో సినిమా టీం ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేసింది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన సెన్సార్ పూర్తయింది.'మా ఇంటి బంగారం' చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ సభ్యులు మేకర్స్‌ను అభినందించారు. ఈ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ఈ చిత్రం జూన్ 19న గ్రాండ్ రిలీజ్‌కు రెడీగా ఉంది. ఇప్పటికే సమంత ఈ సినిమా గురించి ఎన్నో విశేషాల్ని పంచుకు న్నారు. తాజాగా ఇన్ స్టాలో తన అభిమానులతో ముచ్చటిస్తూ ఈ మూవీకి సంబంధించిన ఎన్నో విషయాల్ని తెలియజేశారు.ప్రేక్షకులు పెట్టే డబ్బు, వెచ్చించే సమయం ఇలా అన్నింటికీ న్యాయం చేసేలా సినిమా ఉంటుందని టీం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించారు. ఈ మూవీకి ఓం ప్రకాష్ కెమెరామెన్‌గా, ధర్మేంద్ర కాకరాల ఎడిటర్‌గా పని చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు ఈ సినిమా జూన్ 19న ప్రపంచ



# కిరణ్ అబ్బవరం కొత్త చిత్రం ప్రారంభం



డైనమిక్ యంగ్ హీరో అబ్బవరం 'క', 'కెర్యాంప్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ల తర్వాత అలరించారు. 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' సంచలన విజయంతో తన రైటింగ్ ట్యాలెంట్‌ని ఇప్పటికే చాటుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు హీరోగా, కథా రచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాతగా అరంగేట్రం చేస్తున్న ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం, కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతోంది.అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. భారీ గంగాళం, మంటలు, పొగల మధ్య బ్యాక్ సైడ్ నుంచి కనిపిస్తున్న కిరణ్ అబ్బవరం సంప్రదాయ గ్రామీణ యువకుడి గెటప్‌లో ఆకట్టుకుంటున్నారు. గ్రామీణ వేడుకల వాతావరణాన్ని ప్రతి బింబించే ఈ పోస్టర్, ఈ చిత్రాన్ని కూడా ఒక ప్రత్యేక విందులా ఎంతో శ్రద్ధతో రూపొంది స్తున్నామనే ఫీలింగ్ కలిగిస్తోంది. Ek Dum Bindass Pakaane Waale అనే ట్యాగ్‌లైన్ మరింత ఆసక్తి కరంగా మార్చింది.ఈ చిత్రంతో దేవికా భట్ తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం అవుతు న్నారు. సీనియర్ నటులు శరత్ కుమార్, సాయి కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యూత్ ను ఆకట్టుకునే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. హైదరాబాద్‌లో చిత్ర బృందం, నటీనటులు హాజరైన ఒక భారీ పూజా కార్యక్రమంతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవం అనంతరం వెంటనే రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. తొలి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొంటోంది.

# 'మకుటం' యాక్షన్ మోడ్‌లో టీజర్



'మార్క్ ఆంటోనీ', 'మద గజ రాజా' చిత్రాలతో విశాల్ మంచి విజయాల్ని అందుకున్నారు. విశాల్ కెరీర్‌లోనే'మకుటం' ఓ స్పెషల్ ప్రాజెక్ట్‌గా నిలబోతోంది. హీరోగా, దర్శకుడిగా విశాల్ చేసిన తొలి ప్రాజెక్ట్ ఇదే. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో 99వ సినిమాగా'మకుటం' రూపుదిద్దుకుంటోంది. స్వర్గీయ నిర్మాత ఆర్.బి. చౌదరి ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక చిత్రం రాబోతోంది. రవి అరసు అందించిన కథ ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్ అన్నింటికీ ఆడియెన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ దక్కింది. ఈ రోజు (జూన్ 11) మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు.మండుతున్న శవం.. అందులోంచి సిగరెట్ వెలిగించుకుంటూ ఇచ్చిన హీరో ఎంట్రీ అదిరిపోయింది. ఇక ఇందులో అంజలి మాస్ యాక్షన్‌ను చూడొచ్చు. అంజలి ఓ కొత్త అవతారంలో కనిపించనున్నారు. ఇక విశాల్ అయితే మూడు డిఫరెంట్ గెటప్స్‌లో తన విశ్వరూపం చూపించారు స్టైలిష్, విజువల్ ట్రీట్‌లా విశాల్ ఈ మూవీని తెరకెక్కించారు. సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం నాథన్, జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకి ప్రధాన బలం కానున్నాయి. ఈ సినిమాకి ఎడిటర్‌గా ఎన్.బి. శ్రీకాంత్, జి. దురైరాజ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేశారు.మొత్తం మీద ఈ టీజర్ ఒక్కసారిగా'మకుటం'పై భారీ అంచనాల్ని పెంచేసింది. విశాల్ త్రిపాత్రాభినయం, స్టైలిష్ దర్శకత్వం, ఆకట్టుకునే సాంకేతిక నైపుణ్యం,

# ప్రారంభమైన సెవెన్ క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం.3



సాయి సోహన్, విస్మయ శ్రీ , విష్ణు ఓయ్, నరేంద్ర రవి, హరితేజ, జీవన్ కుమార్, మురళీధర్‌గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త సినిమా ఈ రోజు హైదరాబాద్ ఆరె మైసమ్మ టెంపుల్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను నిసా ఎంటర్ టైన్ మెంట్స్, సెవెన్ క్రియేషన్స్ బ్యానర్స్ తమ ప్రొడక్షన్ నెం.3 చిత్రంగా నిర్మిస్తు_న్నాయి. క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు జి.మధుసూధన్ రెడ్డి రూపొందిస్తు న్నారు. ఈ రోజు జరిగిన ఈ చిత్ర పూజా కార్యక్రమాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్స్ అనిల్ భాను, "రోమాంచికం" చిత్ర దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో దర్శకుడు జి.మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు మా చిత్ర పూజా కార్యక్రమాలకు అతిథిగా వచ్చి క్లాప్ ఇచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కి, కెమెరా స్విచ్ఛాన్ చేసిన పబ్లిసిటీ డిజైనర్స్ అనిల్ భాను, దర్శకుడు వేణు గోపాల్ రెడ్డికి థ్యాంక్స్. మా సినిమాను క్రైమ్ కామెడీ జానర్ లో మంచి ఎంటర్ టైన్ మెంట్ తో రూపొందిస్తున్నాం. మూవీని ప్రొడక్షన్ వ్యాల్యూస్ లో ఎక్కడా రాజీ పడకుండా నిర్మాతలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తు న్నారు. త్వరలోనే మా సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ వెల్లడిస్తాం. అన్నారు.

# 'ఇరుముడి' బ్యూటిఫుల్ వర్కింగ్ స్టిల్స్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ, ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' నిర్మిస్తున్న 'ఇరుముడి' చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణ జతకట్టారు. ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌కు వచ్చిన అద్భుతమైన స్పందనతో సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెల కొన్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకు లను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ సెట్స్ నుంచి బ్యూటిఫుల్ వర్కింగ్ స్టిల్స్ షేర్ చేశారు. ఈ స్టిల్స్ రవితేజ, ప్రియా భవానీ శంకర్, శివ నిర్వాణ నేచురల్ స్మైల్స్ తో కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా ప్రియా భవానీ శంకర్ సోషల్ మీడియాలో ఓ స్పెషల్ పోస్ట్ పెట్టారు. 'ఇరుముడి' షూటింగ్ ప్రయాణం ఓ అందమైన జ్ఞాపకం. సన్నివేశాలను చిత్రీకరిస్తూ ఎన్నో మధుర క్షణాలను సొంతం చేసుకున్నాం. ఎనర్జిటిక్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ 'ఇరుముడి'లో పూర్తిగా భిన్నమైన, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఆయననటన ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగించనుంది.